
'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 277

గురువారం 28-12-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఎల్గర్ అజేయ సెంచరీతో...

దక్షిణాఫ్రికాకు ఆధిక్యం. ప్రస్తుతం 256/5. భారత్ 245 ఆలౌట్ -12లో



మళ్లీ రికార్డుల మోత

సెన్సెక్స్ 72,000 పాయింట్ల ఎగువకు.. 21,650 స్థాయిపైకి నిఫ్టీ -13లో



పొగమంచు గుప్పిట్లో ఉత్తరాది

ఉత్తర భారతదేశం పొగమంచు గుప్పిట్లో చిక్కుకుంటోంది. ఢిల్లీలో బుధవారం 110 విమానాలు ఆలస్యంగా నడిచాయి.

- వివరాలు 6లో



కారుతో తొక్కించి.. యువతి హత్య

రెండు జంటల తగాదా యువతి మృతికి దారి తీసింది. వేరొకరి స్నేహితురాలిని నిందితుడు తన కారుతో తొక్కించి చంపేశాడు.

- వివరాలు 6లో



'కన్నడ' బోర్డుల రగడ

వాణిజ్య, వ్యాపార సంస్థల నేమ్‌బోర్డులు 60% కన్నడంలోనే ఉండాలనే బీబీఎంపీ నిబంధన బెంగళూరులో విధ్వంసానికి దారితీసింది.

- వివరాలు 6లో



వియత్నాంలో కిస్సింగ్ బ్రిడ్జి

వియత్నాంలో అనగనగా ఓ వంతెన. దాన్ని కట్టింది ముద్దులు పెట్టుకోవడానికి మాత్రమే.. వినడానికే విచిత్రంగా ఉంది కదూ!..

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

'ప్రజాపాలన'లో నిర్లక్ష్యం వద్దు: ఉత్తమ్



ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం ముందుకెళ్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను శుక్రవారం పరిశీలించనున్నట్టు చెప్పారు. రేషన్ బియ్యం రీసైక్లింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

- వివరాలు 3లో

భూముల సర్వేకు సిద్ధం కండి: పొంగులేటి



రాష్ట్రంలోని వ్యవసాయ భూములను సర్వే చేసే విషయంలో ప్రభుత్వానికి స్పష్టత ఉందని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి పొరుగు రాష్ట్రాల్లోని సర్వేలను పరిశీలించాలని సూచించారు.

- వివరాలు 3లో

మాజీ ఐఏఎస్ ఇంటి కబ్జా కేసులో ఐపీఎస్



మాజీ ఐఏఎస్ అధికారి భన్వర్‌లాల్ ఇంటి కబ్జాకు యత్నించిన కేసులో ఐపీఎస్ అధికారి నవీన్‌కుమార్ భట్ నిందితుడిగా ఉన్నారు. భన్వర్‌లాల్ భార్య మణిలాల్ ఫిర్యాదుతో సీసీఎస్ నమోదు చేసిన ఈ కేసులో నవీన్‌కుమార్, ఆయన సోదరుడు సాంబశివరావు పేర్లు ఉన్నాయి.

- వివరాలు 5లో

ఇదండీ సంగతి



రేషన్‌కార్డులిస్తూనే ఉంటాం

ప్రజాపాలన దరఖాస్తు ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం

- తెల్ల రేషన్‌కార్డు లేకుంటే పథకాలు కష్టం
- పథకాలు కావాల్సిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి
- ప్రజాపాలన దరఖాస్తులు రేషన్‌కార్డులు లేనివారు ఇచ్చినా తీసుకుంటాం
- వాటితో పాటు ప్రత్యేక కౌంటర్‌లో ఇతర విజ్ఞాపనలూ ఇవ్వొచ్చు
- విద్యా భరోసా కార్డుల జారీకి వచ్చే విద్యా సంవత్సరం నుంచి దరఖాస్తులు
- ప్రజాపాలన దరఖాస్తు ఫారం, లోగో, పోస్టర్ ఆవిష్కరించిన రేవంత్‌రెడ్డి



'ప్రజాపాలన' లోగో ఆవిష్కరించి మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి, తుమ్మల, కొండా సురేఖ, సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: 'తెల్ల రేషన్‌కార్డు లేకుంటే ప్రజాపాలన కింద పథకం రావడం కష్టం. అందువల్ల కొత్త రేషన్‌కార్డులు కూడా ఇస్తాం. రేషన్‌కార్డుల జారీ విషయంలో ప్రభుత్వం నిరంతర ప్రక్రియగా ముందుకు వెళుతుంది. అలాగే ప్రజాపాలన దరఖాస్తులు రేషన్‌కార్డులు లేనివారు ఇచ్చినా తీసుకుంటాం. ప్రజాపాలనలో సంబంధిత దరఖాస్తుతో పాటు ఇతర విజ్ఞాపనలను కూడా స్వీకరిస్తాం. ఇందుకోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నాం. రేషన్‌కార్డు, భూముల వారసత్వ బదిలీ, ఇతర ఏం సమస్యలున్నా దరఖాస్తు తీసుకుంటాం..' అని సీఎం ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల డేటా ఇప్పటికే తమ వద్ద ఉందని చెప్పారు. పథకాలు కావాల్సిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరుతున్నామన్నారు. యువ వికాసం కింద విద్యా భరోసా కార్డుల జారీ కోసం వచ్చే విద్యా సంవత్సరం నుంచి కళాశాలల్లోనే కౌంటర్లు పెట్టి దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. ఎన్నికల హామీని నిలబెట్టుకునే క్రమంలో ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు 8 పనిదినాల్లో గ్రామాలు, మున్సిపల్ వార్డులు, పట్టణాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. తండాలు, గూడేలు,

మిగతా 2వ పేజీలో ▶

దుబారా వద్దు

- వృథా ఖర్చులు తగ్గించండి
- వాస్తవికత ప్రతిబింబించేలా వచ్చే ఏడాది బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయండి: సీఎం రేవంత్‌రెడ్డి

3 లో

నేటి నుంచి వార్డుల్లో ప్రజాపాలన

జనవరి 6 వరకు ఒక్కోరోజు ఒక్కో బస్తీలో నిర్వహణ...

6 గ్యారంటీలకు దరఖాస్తుల స్వీకరణ

2 లో

మిగిలిన రూ.99,999 కోట్లూ పంచాల్సిందే

- కేటీఆర్‌ను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యలు
- కాళేశ్వరం, ఇతర నిర్మాణాలపై న్యాయ విచారణకు ఆదేశించాం

2 లో



మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో ఏఐటీయూసీ నాయకుల సంబరాలు

సింగరేణి ఎన్నికల్లో ఏఐటీయూసీ జయభేరి

కార్మిక సంఘం గుర్తింపు యూనియన్‌గా ఆవిర్భావం

- ఐఎన్‌టీయూసీతో హోరాహోరీగా సాగిన పోరు... స్పష్టమైన మెజారిటీతో సత్తా చాటిన 'నక్షత్రం' గుర్తు
- ఏరియాల పరంగా ఐఎన్‌టీయూసీకి ఆధిక్యం, ఓట్లపరంగా ఏఐటీయూసీది పైచేయి... ఖాతా తెరవని టీబీజీకేఎస్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ సత్తా చాటింది. మొత్తం 11 ఏరియాల్లో బుధవారం జరిగిన ఎన్నికల్లో మొత్తం 39,773 మంది ఓటర్లు ఉండగా.. 37,447 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తంగా అత్యధిక ఓట్లతో నక్షత్రం గుర్తుకు కార్మికులు పట్టం కట్టారు. దీంతో గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ ఆవిర్భవించింది. 5 ఏరియాల్లో 16,177 ఓట్లతో ఏఐటీయూసీ గెలుపొంది గుర్తింపు సంఘంగా నిలవగా, 6 ఏరియాల్లో ఐఎన్‌టీయూసీ గెలిచినా, 14,215 ఓట్లు మాత్రమే సాధించగలిగింది. బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, రామగుండం–1, రామగుండం–2, రామగుండం–3 ప్రాంతాల్లో ఏఐటీయూసీ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. అత్యధిక ఓట్లతో ఆయా ప్రాంతాల్లో ప్రాతినిధ్యం దక్కించుకుంటూనే అత్యధిక ఓట్లను రాబట్టింది. ఒక్క శ్రీరాంపూర్‌లోనే 2,166 ఓట్ల ఆధిక్యం చేజిక్కించుకోవడం పోలింగ్‌లోనే టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. ఇల్లెందు, మణుగూరు, కార్పొరేట్‌లో ఏఐటీయూసీపై ఐఎన్‌టీయూసీ స్వల్ప ఆధిక్యంతో

మిగతా 10వ పేజీలో ▶

ఓడిన అభ్యర్థులే ఇన్‌చార్జులు

లోక్‌సభ ఎన్నికలపై బీఆర్‌ఎస్ దృష్టి



- నేతలకు క్షేత్రస్థాయిలో పార్టీ బాధ్యతల అప్పగింత
- పార్టీ ఎమ్మెల్యేలు ఒక్కరు కూడా లేని నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి
- కేటీఆర్ పర్యటన షెడ్యూల్‌పై కసరత్తు

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభించిన భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) క్షేత్ర స్థాయిలో పార్టీ బాధ్యతల అప్పగింతపై దృష్టి సారించింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున 39 మంది గెలుపొందగా, 80 చోట్ల పార్టీ ఓటమి పాలైన విషయం తెలిసిందే. కాగా పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న చోట్ల వారికే బాధ్యతలు అప్పగించింది. అలాగే పార్టీ ఓటమి పాలైన నియోజకవర్గాల్లో లోక్‌సభ ఎన్నికల దిశగా పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేసే బాధ్యతను ఓడిన అభ్యర్థులకే అప్పగించింది. ఓటమి పాలైన నేతల్లో ఎక్కువ మంది మాజీ శాసనసభ్యులే ఉండటంతో వీరినే నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిలుగా ప్రకటించారు. నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్సీలు, ఇతర కీలక నేతలు, కేడర్‌ను సమన్వయం చేసే బాధ్యతను వీరు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఏ లోక్‌సభ నియోజకవర్గానికి ఎవరు అభ్యర్థి అనే అంశంతో సంబంధం లేకుండా నియోజకవర్గాల వారీగా ముఖ్య నేతలు, కేడర్‌తో సమావేశాలు ఏర్పాటు చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో పాటు నియోజకవర్గ

మిగతా 3వ పేజీలో ▶

గ్రూప్–2 పరీక్షలు మళ్లీ వాయిదా

త్వరలో తేదీలు ప్రకటిస్తామన్న టీఎస్‌పీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–2 పరీక్షలు మరోసారి వాయిదా పడ్డాయి. వివిధ కారణాలతో ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడుతూ వచ్చిన ఈ పరీక్షలను తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) మూడోసారి వాయిదా వేసింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి బుధవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ప్రకటన విడుదల చేశారు. వాస్తవానికి ఈ పరీక్షలను జనవరి 6, 7 తేదీల్లో నిర్వహించాల్సి ఉంది. అయితే కమిషన్ చైర్మన్, సభ్యుల రాజీనామాలతో టీఎస్‌పీఎస్సీ కుర్చీలు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం కార్యదర్శి ఒకరే ఉన్నప్పటికీ పరీక్షల నిర్వహణకు కమిషన్ చైర్మన్

మిగతా 10వ పేజీలో ▶



భట్టికా.. బీసీకా?

కొత్త ఏడాదిలో కొత్త పీసీసీ చీఫ్!

- ఎస్సీల నుంచి భట్టి ఒక్కరే... బీసీల నుంచి నలుగురి పేర్లు పరిశీలనలో
- కర్ణాటక మాదిరే తనకు పీసీసీ పదవి ఇవ్వాలని కోరుతున్న విక్రమార్క
- బీసీ అయితే మహేశ్ గౌడ్, యాష్కీ, పొన్నం, వీహెచ్‌లలో ఒకరు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ)కి కొత్త అధ్యక్షుడి ఎంపికపై దృష్టి సారించిన కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ కొత్త ఏడాది తొలినాళ్లలో ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తోంది. మరో మూడు నెలల్లో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పది, పదిహేను రోజుల్లోనే కొత్త అధ్యక్షుడి ఎంపిక పూర్తి చేయాలని భావిస్తోంది. దీనికై ఇప్పటికే ఏఐసీసీ పరిశీలకులు, రాష్ట్ర ముఖ్య నేతల నుంచి అభిప్రాయ సేకరణచేసిన హైకమాండ్ పెద్దలు ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఒక పేరును, బీసీ సామాజిక వర్గం నుంచి నలుగురి పేర్లను పరిశీలిస్తోంది.

కష్టకాలంలో నిలబడిన తనను గుర్తించాలంటున్న భట్టి

ఏఐసీసీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేరు పరిశీలనలో ఉందని తెలుస్తోంది. కర్ణాటకలో డీకే శివకుమార్‌కు డిప్యూటీ సీఎం పదవితో పాటే పీసీసీ అధ్యక్ష పదవి కట్టబెట్టిన మాదిరే తనకు కూడా ఆ పదవి ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిసింది. మంగళవారం రాత్రి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత సోనియాగాంధీని కలిసిన సమయంలో ఇదే విషయాన్ని ఆయన వెల్లడించినట్లు తెలుస్తోంది. పీసీసీ అధ్యక్షుడిగా మల్లు అనంతరాములు చేసిన సేవలతో పాటు సీఎల్పీ నేతగా తాను కష్టకాలంలో నిలబడిన తీరును పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లుగా సమాచారం.

బీసీ వర్గానికే ఎక్కువ చాన్స్...

ప్రస్తుతం ముఖ్యమంత్రి రెడ్డి సామాజిక వర్గం, ఉప ముఖ్యమంత్రి ఎస్సీ సామాజిక వర్గం అయినందున పీసీసీ అధ్యక్షుడి బాధ్యతలు బీసీ సామాజిక వర్గానికి కట్టబెట్టాలనే డిమాండ్ సైతం బలంగా ఉంది. దీనిని పరిగణనలోకి తీసుకుంటున్న హైకమాండ్ బీసీ వర్గానికి చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్,

మిగతా 3వ పేజీలో ▶

పీజీ ఇంకా ఈజీ

ఆన్‌లైన్‌లోనూ చేసే వెసులుబాటు

- ఏడాది కాలవ్యవధితో కోర్సులు.. నాలుగేళ్ల డిగ్రీ ఉంటే తేలికే
- ఆధునిక కోర్సుల మేళవింపు
- ఇప్పటికే ముసాయిదా రూపకల్పన
- త్వరలో యూజీసీ కీలక నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) విద్యను మరింత సరళీకరించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిర్ణయించింది. నాణ్యత ప్రమాణాలను మెరుగుపర్చడం దీని ఉద్దేశంగా పేర్కొంది. సరికొత్త పీజీ డిగ్రీ విధానంపై యూజీసీ ఇటీవల ముసాయిదా ప్రతిని రూపొందించింది. దీన్ని అన్ని రాష్ట్రాలకూ పంపింది. సలహాలు, సూచనలు, అభ్యంతరాల ప్రక్రియ వచ్చే నెల రెండో వారంతో ముగుస్తుంది. జనవరి ఆఖరి వారం లేదా ఫిబ్రవరిలో కొత్త పీజీ డిగ్రీ విధివిధానాలను ఖరారు చేయాలని భావిస్తోంది. డిగ్రీస్థాయి నుంచే ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సును అందించేలా ఇందులో ప్రతిపాదనలు పెట్టింది. మారుమూల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు సైతం తేలికగా ఆన్‌లైన్ ద్వారా ఈ కోర్సులను చేసే వీలు కల్పించాలని యోచిస్తోంది. అయితే, ఈ పీజీ చేసే ముందు డిగ్రీలో కొంత కష్టపడాల్సి ఉంటుంది.

ఏడాదిలోనే పూర్తి

ఇక మీదట కేవలం ఒక ఏడాదిలోనే పీజీ కోర్సులు పూర్తి చేసే అవకాశం కల్పించబోతున్నారు. ప్రస్తుతం ఇది రెండేళ్ల కాలపరిమితితో ఉంది. అయితే, నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు చేసిన వారే దీనికి అర్హులుగా యూజీసీ చెబుతోంది. వాస్తవానికి జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)–2020 అమలులో భాగంగా దేశవ్యాప్తంగా నాలుగేళ్ల కాలపరిమితి గల డిగ్రీ (ఆనర్స్) కోర్సులకు ప్రాధాన్యత పెరిగింది. క్రెడిట్ విధానం అందుబాటులోకి తెచ్చేందుకు ఇప్పటికే రంగం సిద్ధమైంది. ప్రాథమిక విద్య మొదలు పీజీ వరకూ క్రెడిట్ విధానం

మిగతా 5వ పేజీలో ▶

ఎంఫిల్‌కు గుర్తింపు లేదు

- ఆ కోర్సుల్లో ఎవరూ చేరకండి
- విద్యార్థులకు యూజీసీ సూచన

6 లో



అఖాడాలో ఒక రోజు..

రెజ్లర్లతో గడిపిన రాహుల్

రాహుల్‌గాంధీ 'భారత్ న్యాయ యాత్ర'

జనవరి 14 నుంచి ప్రారంభం

- మణిపూర్‌లో శ్రీకారం.. మార్చి 20న ముంబైలో ముగింపు

➤ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మరో సుదీర్ఘయాత్రకు సన్నద్ధమవుతున్నారు. వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా 'భారత్ న్యాయ యాత్ర' పేరిట రెండో విడత యాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. యాత్ర షెడ్యూల్‌ను కాంగ్రెస్ అధిష్టానం ఖరారు చేసింది.

- వివరాలు 6లో

నేడు పార్టీ నేతలతో అమిత్‌షా కీలక చర్చలు

అసెంబ్లీ ఫలితాలపై సమీక్ష

- లోక్‌సభ ఎన్నికలపై దిశా నిర్దేశం
- మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు బిజీబిజీ



సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం హైదరాబాద్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. అసెంబ్లీ ఫలితాలపై సమీక్ష, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర, అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ అంశాలపైనా ఆయన రాష్ట్ర పార్టీ నేతలతో సమీక్షించనున్నారు. ఢిల్లీ నుంచి మధ్యాహ్నం 12.05కి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు, అక్కడి నుంచి 12.20కి సమీపంలోని నోవాటెల్ హోటల్‌కు వస్తారు. 1.45 వరకు పార్టీ ముఖ్య నేతలతో సమావేశమవుతారు. భోజనానంతరం మధ్యాహ్నం 2 గంటలకు నగర శివార్లలోని కొంగర కలాన్ శ్లోక కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. 2.10 నుంచి 3.00 గంటల వరకు బీజేపీ నేతలతో జరిగే తొలి విడత భేటీలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సమీక్షిస్తారు. పోటీ చేసిన పార్టీ అభ్యర్థులు, ఎన్నికైన 8 మంది ఎమ్మెల్యేలతో గెలుపోటములను ప్రభావితం చేసిన అంశాలపై షా చర్చిస్తారు. 3 నుంచి 4.30 గంటల వరకు రెండో విడత భేటీలో లోక్‌సభ ఎన్నికలకు రాష్ట్ర పార్టీ సన్నద్ధతపై చర్చించి దిశానిర్దేశం చేయనున్నారు. ఈ భేటీలో పార్టీ మండల/డివిజన్ అధ్యక్షులు మొదలుకుని జాతీయ స్థాయి నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొననున్నట్టు సమాచారం. అమిత్ షా సాయంత్రం 5కి తిరిగి హోటల్‌కు చేరుకుని 5.30 వరకు పార్టీ ముఖ్య నేతలతో భేటీ అవుతారు. అనంతరం ఆయన చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటారు.



ఇండియా కూటమితో సమగ్రతకు ముప్పు

మెజారిటీ ప్రజల విశ్వాసాన్ని, అస్తిత్వాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ ప్రవర్తిస్తోంది: కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి

3 లో

మిగిలిన రూ.99,999 కోట్లూ పంచాల్సిందే...

- కేటీఆర్‌ను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యలు
- కాళేశ్వరం, ఇతర నిర్మాణాలపై న్యాయ విచారణకు ఆదేశించాం
- విచారణలో తేలే అంశాల ఆధారంగా తిరిగి వసూలు చేస్తాం

సాక్షి, హైదరాబాద్: 'ప్రజావాణికి వచ్చిన ఓ మహిళ సమస్యను ప్రభుత్వం పరిష్కరించలేదని, నేను రూ.లక్ష ఇచ్చి పరిష్కరిస్తున్నా అని కేటీఆర్ అన్నట్టు పత్రికల్లో వచ్చింది. నీ రూ.లక్ష కోట్లలో రూ.లక్షను మెడలు వంచి పేదలకు ఇప్పించామంటే ప్రజావాణి విజయవంతమైనట్టే కదా. అక్రమంగా సంపాదించిన రూ.లక్ష కోట్ల నుంచి రూ.లక్షను ఒక మహిళకు ఇవ్వగలిగాం. ఇంకా రూ.99,999 కోట్లు కేటీఆర్ వద్ద ఉన్నాయి. వాటినీ పంచాల్సిన పరిస్థితిని కల్పిస్తాం. కాళేశ్వరం ప్రాజెక్టు, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాల నిర్మాణంపై న్యాయ విచారణకు ఆదేశిస్తూ ఇప్పటికే ఉత్తర్వులిచ్చాం. ఈ విచారణలో తేలే అంశాల ఆధారంగా రెవెన్యూ రికవరీ చట్టం కింద తిరిగి వసూలు చేస్తాం..'.'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చార్లెస్ శోభరాజ్‌ను అడిగినా తాను ఏ తప్పు చేయలేదని అంటాడని, కాళేశ్వరం ప్రాజెక్టు కుంగడంలో ఎల్అండ్‌టీ, హరీశ్‌రావు, కేటీఆర్, ఇతర అధికారుల పాత్ర విచారణలో తేలుతుందని చెప్పారు. 'వాళ్ల దగ్గర ఉన్న ఆస్తి ప్రజల రక్తమాంసాలను పీల్చి పిప్పి చేసి సంపాదించుకున్నది. ఈరోజు వాళ్లు తినేది ప్రజల రక్తపు కూడు..'అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజాపాలనపై బుధవారం సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బావాబామ్మర్దుల తాపత్రయమే..

'శాసనసభలో బావాబామ్మర్దుల (కేటీఆర్, హరీశ్) తాపత్రయం తప్ప ఒక్క సభ్యుడైనా వీరికి మద్దతుగా లేచి మాట్లాడాడా? వాళ్లిద్దరే ఆరాటపడుతున్నారు. రోళ్లకల్లి నిప్పులు చిమ్మేలా వెనకటికి ఇద్దరు దంచుతున్నారట. ఆ దంచడం చూసి అందరూ అబ్బా..ఏం దంచుతున్నారు అని చప్పట్లు కొట్టుతున్నారట. ఓ అరగంట తర్వాత ఓ ముసలావిడ అక్కడినుంచి పోతూ ఆ రోట్లో జొన్నలు, సజ్జలు లేవు. ఎంత దంచ్చినా అలసిపోవడం తప్ప వచ్చేది ఏం లేదని చెప్పిందట. అసెంబ్లీలో కూడా హరీశ్, కేటీఆర్ దంచుడు అలానే ఉంది..'అంటూ రేవంత్ ఎద్దేవా చేశారు.



భవనాలను కూల్చడం ఆస్తుల సృష్టి కాదు

'ఉపయోగపడేవాటన్నింటినీ కూల్చి మళ్లీ కట్టారని శ్వేతపత్రంలో చెప్పాం. సచివాలయం భవనాలను కూల్చకుండా కిరాయి భవనాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులను తరలించడానికి అవకాశం ఉంది. ఒకవేళ అచ్చిరాలేదంటే ప్రభుత్వ ఆస్పత్రిగా మార్చి కొత్తగా ఖాళీ జాగాలో సచివాలయం కడితే ఉపయోగపడేది. అన్ని రకాల వసతులతో ఉన్న భవనాలను కూలగొట్టి కొత్తవి కట్టి ఆస్తి సృష్టించినం అంటున్నారు.

22 ల్యాండ్ క్రూజర్లను కొని దాచిపెట్టారు

నేను కొత్త వాహనాలను కొనొద్దు అని అధికారులకు చెప్పా. పాతబళ్లకు మరమ్మతులు చేయాలని నేను అంటుంటే..22 ల్యాండ్ క్రూజర్లను కొని విజయవాడలో దాచిపెట్టామని ఓ అధికారి చెప్పాడు. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయగానే తెద్దాం అనుకున్నాం కానీ ఆయన నెత్తిమీద దర్రిదం ఉండి ఇంటికి పోయిండు అని అన్నాడు. మూడోసారి కూడా వస్తాననుకుని కేసీఆర్ తనతో పాటు తన మందిమాగధుల కోసం ఒక్కో బండికి రూ.3 కోట్లు పెట్టి కొన్నారు. ఆయన సృష్టించిన సంపద అలాంటిది. ఆ వాహనాలు ప్రభుత్వ ఆస్తి. తీసుకోకుంటే ఎక్కడికిపోతాయి? కావాలంటే మీకు (జర్నలిస్టులకు) ఇస్తాం. అలా రౌండ్ కొట్టి రండి..'అంటే సీఎం ఛలోక్తి విసిరారు.

ఆ అధికారుల సమాచారం మా వద్ద ఉంది

'వరంగల్‌లో సైనిక్ స్కూల్ అర్ధాంతరంగా ఎందుకు ఆగిపోయింది? ఐటీఐఆర్ కోసం అడగలేని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ బుల్లెట్ ట్రైన్ కోసం మేము ప్రధానిని అడగలేదని సుద్దులు చెప్తున్నాడు. గత ప్రభుత్వంలోని పెద్దలకు సమాచారం ఇస్తున్న అధికారుల సమాచారం మా వద్ద ఉంది. నిన్నటి వరకు మీరే మంత్రులు కదా. షాడో టీమ్స్ ఎందుకు? (కొత్త ప్రభుత్వ పనితీరును గమనించేందుకు షాడో టీమ్స్ ఏర్పాటు చేస్తామని కేటీఆర్ చేసిన ప్రకటనను విలేకరులు గుర్తు చేయగా రేవంత్ ఇలా స్పందించారు) మా కొడంగల్, ఇతర ప్రాంతాల్లో కల్తీ కల్లు దొరకనప్పుడు బాధితులు పిచ్చిపిచ్చి చేష్టలు చేస్తే కుటుంబ సభ్యులే మంచానికి తాళ్లతో కట్టేస్తారు. అధికారం పోయిన కేటీఆర్ విత్ డ్రాయల్ సింప్టమ్స్‌తో అలా మాట్లాడుతున్నాడు. కొంత కాలం అతన్నీ తాళ్లతో మంచానికి కట్టాల్సిన పరిస్థితి ఉంటది. అప్పుడే అది ఇవ్వలేదని, ఇది ఇవ్వలేదని బావాబామ్మర్దులు తోక తెగిన బల్లిలా దుంకుతున్నారు. గత రెండేళ్లుగా డిసెంబర్ 22 నుంచి మార్చి 31 మధ్యనే రైతుబంధు వేశారు. మేం ఈసారి డిసెంబర్ 9నే ప్రారంభించాం..'అని రేవంత్ చెప్పారు.

త్వరలోనే టీఎస్‌పీఎస్సీకి కొత్త బోర్డు

- ప్రస్తుత చైర్మన్, సభ్యుల రాజీనామాలను నాలుగైదు రోజుల్లో గవర్నర్ ఆమోదిస్తారు: సీఎం రేవంత్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: త్వరలోనే టీఎస్‌పీఎస్సీకి కొత్త బోర్డు రానుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. వచ్చే నెల 6, 7 తేదీల్లో గ్రూప్‌- 2 పరీక్షలు నిర్వహిస్తామని గతంలో టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన నేపథ్యంలో ఈ పరీక్షల నిర్వహణపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారని బుధవారం సచివాలయంలో మీడియా ప్రశ్నించగా, సీఎం ఈ విధంగా స్పందించారు. 'టీఎస్‌పీఎస్సీ ద్వారా పోటీ పరీక్షలు నిర్వహణ, ఫలితాల ప్రకటన, ఉద్యోగ నియామక పత్రాల జారీకి చైర్మన్ ఉండాలి. చైర్మన్ లేకుండా ఈ ప్రక్రియ జరగదు. న్యాయపరంగా, చట్టరీత్యా చెల్లుబాటు కాదు. చైర్మన్, సభ్యుల రాజీనామాపై గవర్నర్ నాలుగు రోజుల్లో నిర్ణయం తీసుకుంటారు. గతంలో ఇదే సంస్థపై వచ్చిన ఫిర్యాదులపై నిర్ణయాలు తీసుకునేందుకు ఆమె రాష్ట్రపతి అనుమతి కోరారు. న్యాయనిపుణుల సలహాలు తీసుకుని రాజీనామాలను నాలుగైదు రోజుల్లో ఆమోదిస్తారు. ఆ వెంటనే కొత్త బోర్డు నియామకాలు చేపడతాం''అని సీఎం స్పష్టం చేశారు. 'మేనిఫెస్టోలో ప్రకటించిన క్యాలెండర్ ప్రకారం సంవత్సరం తిరిగే లోపు డిసెంబర్ 9, 2024 నాటికి 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. ఇక ఇప్పుడు అభ్యర్థులు ఆందోళనపడాల్సిన అవసరం లేదు'అని సీఎం వ్యాఖ్యానించారు.

నేటి నుంచి వార్డుల్లో ప్రజాపాలన

- 6వ తేదీ వరకు ఒక్కోరోజు ఒక్కో బస్తీలో నిర్వహణ
- ఆరు గ్యారంటీలకు దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నుంచి అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డుల వారీగా ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ అన్ని పురపాలికల కమిషనర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ప్రజల నుంచి జనవరి 6వ తేదీ వరకు ఆరు గ్యారంటీలకు సంబంధించిన అభయహస్తం దరఖాస్తులను స్వీకరించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేకంగా అధికారులు, సిబ్బందిని నియమించారు. ఒక్కోరోజు ఒక్కో బస్తీ చొప్పున నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు స్థానిక కార్పొరేటర్లను ఆహ్వానించాల్సిందిగా పేర్కొంటూ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం వీటిల్లో పాల్గొననున్నారు. పట్టణాల్లో జరిగే ప్రజాపాలనలో మునిసిపల్, రెవెన్యూ, పౌరసరఫరాలు, వైద్య, ఆరోగ్య శాఖలతో పాటు విద్య, విద్యుత్ విభాగాలకు చెందిన ఉద్యోగులు కూడా పాల్గొంటారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన తర్వాత వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలకు నోడల్ అధికారులుగా ఐఏఎస్‌లు

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి ప్రారంభిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పది ఉమ్మడి జిల్లాల వారీగా సీనియర్ ఐఏఎస్ అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియ నియమిస్తూ బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. నోడల్ అధికారులుగా నియమితులైనవారిలో దేవసేన(కరీంనగర్), శ్రీదేవి (మహబూబ్‌నగర్), రఘునందన్‌రావు (ఖమ్మం), శ్రీధర్(రంగారెడ్డి), వాకాటి కరుణ(వరంగల్), నిర్మల(హైదరాబాద్), సంగీత(మెదక్), ప్రశాంతి(ఆదిలాబాద్), కర్ణన్ (నల్లగొండ), క్రిస్టినా చోంగ్తూ(నిజామాబాద్) ఉన్నారు.

రేషన్‌కార్డులిస్తూనే ఉంటాం

▶ మొదటి పేజీ తరువాయి

మారుమూల పల్లెల్లోని అత్యంత నిరుపేదలు, నిస్సహాయులకు సహాయం అందించడానికే గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రజాపాలన కార్యక్రమం లోగో, పోస్టర్, దరఖాస్తు ఫారాలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, కొండా సురేఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ప్రజల చెంతకు పాలన

'సుదూర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి సచివాలయం లేదా ప్రజాభవన్‌లో జరిపే ప్రజావాణిలో వినతిపత్రాలు అందజేయడం పేదలకు అత్యంత వ్యయప్రయాసలతో కూడిన పని. ఒకరోజు ముందే వచ్చి రాత్రిబస ఇక్కడే చేస్తున్నారు. గత ప్రభుత్వం అందుబాటులో లేకపోవడం, పరిపాలన ప్రజల వద్దకు చేరకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ ఇబ్బందులు పేరుకుపోయి ప్రభుత్వాలు మోయలేనంత భారంగా మారాయి. ఈ నేపథ్యంలో ప్రజలను ప్రజావాణి కోసం ప్రజాభవన్‌కు రప్పించుకోవడం కాకుండా, గతంలో గడీల లోపల జరిగిన పరిపాలనను గ్రామాలకు చేర్చాలన్న ఆలోచనతో మా ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టింది. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, జెడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులను ఏ ప్రజలైతే ఎన్నుకున్నారో వారి గ్రామాలకే పంపించడం ద్వారా ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లిన భావన కలుగుతుంది. ఇది ప్రజల ప్రభుత్వం అని, సమస్యలు పరిష్కరిస్తుందనే విశ్వాసం ఏర్పడుతుంది. వారంలో రెండు రోజులు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తేనే దాదాపుగా 24 వేల పైచిలుకు దరఖాస్తులొచ్చాయి. భూసమస్యలు, ఇళ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ లాంటి సమస్యలే అధికం.

వీలున్న విజ్ఞాపనలన్నింటినీ పరిష్కరిస్తాం

ఈ ప్రజావాణి దరఖాస్తులన్నిటికీ ఒక నంబర్ ఇచ్చి డిజిటలైజ్ చేస్తున్నాం. వాటిని సంబంధిత శాఖలకు, అధికారులకు పంపిస్తున్నాం. ఒక ఐఏఎస్ అధికారి, సిబ్బందితో ఇందుకు వ్యవస్థను ఏర్పాటు చేశాం. విజ్ఞాపన పత్రం పురోగతిని, అది ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి ట్రాకింగ్ సిస్టం పెట్టాం. పరిష్కారానికి వీలు ఉన్నవన్నీ పరిష్కరిస్తాం. వీలు లేనప్పుడు దరఖాస్తుదారులకు కారణాలు తెలియజేస్తాం..' అని సీఎం చెప్పారు.

రైతుబంధు సీలింగ్‌పై అసెంబ్లీ చర్చ

రైతుబంధుపై సీలింగ్ విధించే అంశంపై అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించి అందరి సమ్మతితో నిర్ణయం తీసుకుంటాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లకు ఇబ్బంది కలుగుతుందని ముందే ఊహించి వారికి ఆర్థిక సహాయం అంశాన్ని మేనిఫెస్టోలో పెట్టాం. వారి వివరాలూ సేకరిస్తాం. తబ్లిగీ జమాత్ సమావేశాలకు 2006 నుంచి ప్రభుత్వం సాయం చేస్తోంది. ఆ సమావేశాలను ప్రభుత్వం పర్యవేక్షిస్తుంది..' అని రేవంత్ తెలిపారు.

తర్వాత కూడా దరఖాస్తులు ఇవ్వొచ్చు

'గ్రామసభల్లో దరఖాస్తు ఇవ్వలేకపోయిన వారు తమకు పథకాలు వర్తించవని ఆందోళనపడాల్సిన అవసరం లేదు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు గ్రామ పంచాయతీల్లో గ్రామ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లకు దరఖాస్తు సమర్పించవచ్చు. ఆ తర్వాత కూడా నిజమైన లబ్ధిదారులు ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఇవ్వవచ్చు. హైదరాబాద్‌లో దరఖాస్తును ఉర్దూలో కూడా ఇస్తాం. గ్రామాల్లో ఉదయం 8-12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2-6 వరకు దరఖాస్తులు ఇవ్వొచ్చు. పట్టణాల్లో ఉదయం 10-5 గంటల వరకు అందజేయవచ్చు. డిసెంబర్ 7న బాధ్యతలు చేపట్టిన మా ప్రభుత్వం జనవరి 7లోపే లబ్ధిదారుల సమాచారాన్ని సేకరిస్తుంది..' అని చెప్పారు.

గవర్నర్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తాం

'సచివాలయంలో లోపల పత్రికా సమావేశం పెట్టుకోగలమని, ముఖ్యమంత్రి, మంత్రులతో కలిసి కూర్చోగలుగుతామని జర్నలిస్టులు భావించి ఉండకపోవచ్చు. అప్పట్లో పోలీసులు అడ్డుకుంటే ప్రజాప్రతినిధులమైనా రాలేక మేం అటు నుంచి అటే వెళ్లిపోయాం. ఇకపై సీఎం, మంత్రులు ఇదే హాల్‌లో మీడియా సమావేశాలు నిర్వహిస్తారు. మేము స్వేచ్ఛనిస్తాం, మీరు (జర్నలిస్టులు) దుర్వినియోగం చేయకుండా సహకరించాలి. జర్నలిస్టుల సమస్యలూ చాలా కాలంగా పేరుకుపోయాయి. త్వరలో దృష్టి పెడ్తాం. ఆందోళన వద్దు. మాకు హిడెన్ ఎజెండా లేదు. మాపై కేసులు లేవు. లూటీమార్ చేసిన వారి లాగా మాఫీల కోసం వంగాల్సిన అవసరం లేదు. ప్రధానికి దరఖాస్తు ఇచ్చాం. రాష్ట్రానికి సహకరిస్తామని ప్రధాని కూడా హామీ ఇచ్చారు. రాష్ట్ర గవర్నర్‌తో సత్సంబంధాలు ఇలాగే కొనసాగిస్తాం..' అని ముఖ్యమంత్రి అన్నారు.

అర్హులెవరో తెలుసుకోవడానికే దరఖాస్తులు

'మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు లాంటి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలంటే నిజమైన లబ్ధిదారుల వివరాలు ప్రభుత్వం వద్ద ఉండాలి. అప్పుడు లక్ష్యం పెట్టుకుని, దానిని చేరడానికి అహర్నిశలు కృషి చేయగలం. ఎంతమంది అర్హులు దరఖాస్తు చేసుకుంటే ఎన్ని పరిష్కరించాం, ఇంకా ఎన్ని పరిష్కరించాల్సి ఉందనేది తెలుస్తుంది. జనాభా అధికంగా ఉండే గ్రామాల్లో ఎక్కువ కౌంటర్లు, మహిళలు, పురుషుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం.

మత్తు వదిలించేలా..



నేర నియంత్రణలో భాగంగా నార్కోటిక్స్ బ్యూరో, సైబర్ సెక్యూరిటీ బ్యూరోల ఏర్పాటు

- నిబంధనలు అతిక్రమించిన పోలీసు అధికారులపై ఈసీ కొరడా
- ఫలితాల రోజు అనూహ్యంగా డీజీపీ అంజనీకుమార్ సస్పెన్షన్
- టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ సహా పలు కీలక కేసులు నమోదు
- ర్యాగింగ్‌కు బలైన మెడికల్ విద్యార్థిని ప్రీతి

సాక్షి, హైదరాబాద్

మత్తు మహమ్మారిని తుద ముట్టించేందుకు ఈ ఏడాది కీలక అడుగులు పడ్డాయి. రాష్ట్ర యువతపై పంజా విసురుతున్న గంజాయి, డ్రగ్స్ పీడ వదిలించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో నార్కోటిక్స్ బ్యూరో ఏర్పాటు చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మత్తుపదార్థాల రవాణాపై ఉక్కుపాదం మోపుతోంది. ఇటీవల కలెక్టర్లు, ఎస్పీలతో జరిగిన సమావేశంలోనూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇదే అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. దీంతో ఈ ఏడాది నుంచే మత్తు కట్టడిపై ప్రభుత్వం యుద్ధభేరి మోగించినట్టు అయ్యింది. టీఎస్ న్యాబ్ (తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ బ్యూరో) డైరెక్టర్‌గా సందీప్ శాండిల్య బాధ్యతలు తీసుకున్న రోజుల వ్యవధిలోనే మూడు దశాబ్దాలుగా ఆల్ఫ్రాజోలం మత్తుదందా చేస్తున్న నిందితులను వెలుగులోకి తేవడమే కాదు రూ.3.14 కోట్ల విలువైన ఆల్ఫ్రాజోలం స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా ఈ ఏడాదిలో చెదురుమదురు ఘటనలు మినహా ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్‌శాఖ పక్కా ప్రణాళికలు ఫలించాయి. నిరుద్యోగుల జీవితాలను ప్రశ్నార్థకంగా మార్చిన టీఎస్‌పీఎస్సీ వరుస పేపర్ లీకేజీలపై కేసుల నమోదు సంచలనం సృష్టించింది. అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాదే జరగడంతో దాదాపు సగం సమయం ఎన్నికల కసరత్తు, ఎన్నికల విధుల్లోనే పోలీసులు గడిపారు.

ఈ ఏడాదిలో నమోదైన కొన్ని ప్రధాన నేర ఘటనలు

- ఫిబ్రవరి 23న వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో పీజీ ఫస్టియర్ విద్యార్థిని ధరావత్ ప్రీతి సీనియర్ సైఫ్ వేధింపులతో ఆత్మహత్యకు యత్నించగా, చికిత్స పొందుతూ ఫిబ్రవరి 27న చనిపోయింది.
- ఫిబ్రవరి 17న అబ్దుల్లాపూర్‌మెట్ స్టేషన్ పరిధిలో బీటెక్ విద్యార్థి నవీన్‌ను తోటి విద్యార్థి హరిహరకృష్ణ హత్య చేసి తల, గుండె, చేతి వేళ్లు, మర్మాంగాలను శరీరం నుంచి వేరు చేసి, వాటిని తగులబెట్టాడు.
- ఈ ఏడాదిలో టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారం అత్యంత కీలకమైంది. తొలుత టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్ పరీక్షపత్రం లీకేజీపై మార్చి 10న టీఎస్‌పీఎస్సీ అసిస్టెంట్ సెక్రెటరీ సత్యనారాయణ ఫిర్యాదుతో తొలుత కేసు నమోదైంది. ఆ తర్వాత వరుసగా అనేక పరీక్షల లీకేజీ బయటపడడంతో ప్రభుత్వం మార్చి 14న హైదరాబాద్ సిటీ అడిషనల్ సీపీ క్రైమ్స్ ఏఆర్ శ్రీనివాస్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేసింది. నిందితుల అరెస్టు పర్వం కొనసాగుతూనే ఉంది. ఈ కేసులో సిట్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.
- మార్చి 16 సాయంత్రం సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. 14 మందిని అగ్నిమాపకశాఖ సిబ్బంది కాపాడింది.
- మార్చి 11న ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో ఈడీ అధికారులు ఎమ్మెల్సీ కవితకు తొలిసారిగా నోటీసులు జారీ చేశారు.
- దేశవ్యాప్తంగా 17 కోట్ల మంది వ్యక్తిగత సమాచారం చోరీచేసి సైబర్ నేరగాళ్లకు అమ్ముతున్న 12 మంది సభ్యుల ముఠాను ఈ ఏడాది మార్చి 23న సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు.
- - ఒక నైజీరియాతో సహా నలుగురు సభ్యుల ముఠాను మే 7న అరెస్టు చేసిన సైబరాబాద్ పోలీసులు వారి నుంచి రూ.1.30 కోట్ల విలువైన కొకైన్ స్వాధీనం చేసుకున్నారు
- మే నెలలో కుషాయిగూడలోని ఓ టింబర్ డిపోలో జరిగిన అగ్నిప్రమాదంలో ఐదేళ్ల కుమారుడు సహా దంపతులు సజీవ దహనం అయ్యారు.
- అప్పు తిరిగి చెల్లించే విషయంలో వచ్చిన వివాదంతో మలక్‌పేటలో మాజీ హెడ్‌నర్స్ అనురాధారెడ్డిని చంద్రమోహన్ మే 15వ తేదీ రాత్రి హత్య చేసి, శరీరభాగాలను ముక్కలు చేసి ఫ్రిజ్‌లో 13 రోజులు దాచి, ఆ తర్వాత వాటిని మూసీనదిలో వేశాడు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.
- దేశవ్యాప్తంగా వందలమందిని ముంచిన ఈ-స్టోర్ ఇండియా సంస్థ రూ.1,000 కోట్ల మోసాన్ని మే 30న హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు వెలుగులోకి తెచ్చారు.



- మావోయిస్టు పార్టీ అగ్రనేత, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ మే 31న దండకారణ్యం గెరిల్లా జోన్‌లో గుండెపోటుతో మరణించారు.
- పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తేవడంతో అప్సరను పూజారి సాయికృష్ణ రాయితో మోది దారుణంగా హతమార్చి మృతదేహాన్ని సరూర్‌నగర్ మండల ఆఫీస్ వెనుక ఉన్న పాత సెప్టిక్ ట్యాంక్‌లో వేసి ఉప్పు, ఎర్రమట్టి నింపిన ఘటన సంచలనం సృష్టించింది.
- ఓ మహిళా కానిస్టేబుల్‌తో వివాహేతర సంబంధం నేపథ్యంలో మహబూబ్‌నగర్ సీసీఎస్ సీఐ ఇఫ్తికర్ అహ్మద్‌పై ఆ కానిస్టేబుల్ దంపతులు జగదీశ్, శకుంతల, మరో వ్యక్తి కృష్ణలు దాడి చేసి అతడి మర్మాంగాలు కోశారు. తీవ్రంగా గాయపడిన సీఐ చికిత్స పొందుతూ మరణించాడు.
- తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) డిసెంబర్ 6న మచ్చబొల్లారంలో జరిపిన సోదాల్లో రూ 4.3 కోట్ల విలువైన యాంటీ కేన్సర్ నకిలీ మందులను గుర్తించారు.
- డిసెంబర్ 8న సంగారెడ్డి జిల్లాలో టీఎస్ న్యాబ్ సోదాల్లో డ్రగ్ తయారీ కేంద్రాన్ని గుర్తించడంతోపాటు రూ.3 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు.
- ఏడాది డిసెంబర్ 14న ఖమ్మం పోలీస్‌స్టేషన్ పరిధిలో ముగ్గురు ఆటోలో గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న రూ.1.22 కోట్ల విలువైన 484 కిలోల గంజాయిని టీఎస్ న్యాబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
- ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పుల ఊబిలో చిక్కిన సిద్దిపేట కలెక్టర్ గన్‌మన్ నరేశ్ డిసెంబర్ 15న చిన్నకోడూర్ మండలం రామునిపట్లలో తన సర్వీస్ రివాల్వర్‌తో కుమారుడు రేవంత్, కుమార్తె రిషిత, భార్య చైతన్యలను కాల్చి, తను ఆత్మహత్య చేసుకున్నాడు.

నేర నియంత్రణలో కీలక అడుగులు



- ఓవైపు పెరుగుతున్న సైబర్ నేరాలు, మరోవైపు రాష్ట్ర యువత భవిష్యత్‌కు ముప్పుగా మారిన మత్తు మహమ్మారి కట్టడికి ఈ ఏడాదిలోనే కీలక అడుగులు పడ్డాయి. తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీఎస్ఎన్ఏబీ), తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలు మే 31న ప్రారంభమయ్యాయి.
- బస్‌లో భరోసా పేరిట రాజన్న సిరిసిల్ల పోలీసులు ఆర్టీసీ బస్సులలో సీసీటీవీ కెమెరాలను ఈ ఏడాది ఆగస్టు 15న ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రజల భద్రత కోణంలో ఇదో నూతన ఆవిష్కరణ.
- మొబైల్ ఫోన్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా.. తిరిగి గుర్తించేందుకు తెలంగాణ పోలీసుల టెలికమ్యూనికేషన్స్ విభాగం రూపొందించిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టార్ (సీఈఐఆర్) యాప్ వాడడం ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించారు. ఈనెల 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా 15,024 మొబైల్‌ఫోన్లు గుర్తించి దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచారు.
- పని ప్రదేశాల్లో మహిళలకు మరింత భద్రత కల్పించే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ మహిళా భద్రత విభాగం ఈ ఏడాది మే 20న 'సాహస్'వెబ్‌సైట్‌ను ప్రారంభించింది.

ఎన్నికల కమిషన్ కొరడా.. అనూహ్య బదిలీలు



- ఎన్నికల విధుల్లో ఉండే పోలీస్ ఉన్నతాధికారులపై కేంద్ర ఎన్నికల సంఘం ఈసారి కొంచెం గట్టిగానే కొరడా ఝుళిపించింది. అక్టోబర్ 9న రాష్ట్రంలో ఎన్నికల కోడ్ వచ్చిన మూడు రోజుల తర్వాత ఏకంగా 20 మంది అధికారులపై బదిలీ వేటు వేసింది. ప్రతిపక్షాల నుంచి వచ్చిన ఆరోపణలు, క్షేత్రస్థాయిలో పరిస్థితులు గమనించిన అనంతరం ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది.
- అసెంబ్లీ ఎన్నికల ఫలితాల రోజు నిబంధనలకు విరుద్ధంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసిన అప్పటి డీజీపీ అంజనీకుమార్‌పై ఎన్నికల సంఘం అనూహ్యంగా సస్పెన్షన్ వేటు వేసింది. మరో ఇద్దరు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆ తర్వాత కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం..పోలీస్‌శాఖలోని కీలక బదిలీలు వరుసగా జరిగాయి.

క్లుప్తంగా...

ప్రభుత్వోద్యోగులకు 5వ తేదీలోగా జీతాలు: పొన్నం

కల్వకుంట్ల కుటుంబంపై సొధపత్రం విడుదల చేయాలి



హుస్నాబాద్: కల్వకుంట్ల కుటుంబ ఆస్తులపై సొధపత్రం విడుదల చేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 రోజులు కూడా కాకముందే బీఆర్ఎస్ నాయకులు స్వేదపత్రం పేరిట విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో బుధవారం ప్రజాపాలనపై నియోజకవర్గ కార్యకర్తల భేటీ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అనంతరం పొన్నం విలేకరులతో మాట్లాడారు. పదేళ్లలో కల్వకుంట్ల కుటుంబానికి ఆస్తులు పెరిగాయని, ఇన్ని బంగ్లాలు, ఫామ్‌హౌస్‌లు ఎక్కడి నుంచి వచ్చాయో తెలంగాణ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ కాలంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ప్రతి నెలా 5లోగా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే రెండు గ్యారంటీలను అమలు చేశామని అన్నారు.

గ్యారంటీలు అమలు చేసే చిత్తశుద్ధి లేదు: దాసోజు



సాక్షి, హైదరాబాద్: రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిలా కాకుండా ముఠా నాయకుడి తరహాలో మాట్లాడుతున్నారని, గ్యారంటీలను అమలు చేయాలన్న చిత్తశుద్ధి ఆయనకు లేదని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. ప్రజా పాలన పేరిట కొత్తగా దరఖాస్తులు తీసుకోవడం టైమ్‌పాస్ వ్యవహారమని, పార్లమెంటు ఎన్నికల దాకా నెట్టుకొచ్చి ఆ తర్వాత ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో దాసోజు శ్రవణ్ బుధవారం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికే పథకాలు వర్తిస్తాయనే మాట చెప్పకపోవడాన్ని ప్రశ్నిస్తూ.. ఓటర్లను మోసగించి అధికారంలోకి రావడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేశారని ఆరోపించిన సీఎం.. లంకె బిందెలున్నాయని ఎలా భావించారని దాసోజు ప్రశ్నించారు. అసెంబ్లీలో శ్వేత పత్రాలు పెట్టి అభాసు పాలైన రేవంత్.. ప్రధాని ముందు వాటి గురించి చెప్పి తెలంగాణ పరువు తీశారన్నారు. కేటీఆర్ మానవతా దృక్పథంతో చేసిన సాయంపై కూడా రేవంత్ నీచంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ప్రతిపక్ష ఎమ్మెల్యేలనూ పిలుస్తున్నాం: వీహెచ్



సాక్షి, హైదరాబాద్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా తాము ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలను కూడా పిలుస్తున్నామని, కానీ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మాత్రం ఇప్పటికీ పేదల వ్యతిరేక వైఖరినే అవలంబిస్తున్నారని మాజీ ఎంపీ వి.హనుమంతరావు వ్యాఖ్యానించారు. అంబర్‌పేట నియోజకవర్గంలో జరిగిన ప్రజాపాలన సభకు వచ్చిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నానంటూ వెళ్లిపోవడం సిగ్గుచేటన్నారు. గాంధీభవన్‌లో బుధవారం కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాపాలన కార్యక్రమానికి మంచి స్పందన వస్తుందని, అంబర్‌పేట సభలో ఎమ్మెల్యేతో పాటు వెళ్లిపోయిన ప్రజలు మళ్లీ తిరిగొచ్చి సభలో కూర్చున్నారని, ప్రభుత్వ సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. కాగా, ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వీహెచ్ రూ.1.38 లక్షల విరాళాన్ని అందజేశారు.

కాంగ్రెస్ నేతలు సంధానకర్తలుగా ఉండాలి

సాక్షి, హైదరాబాద్: ఆరు గ్యారంటీ పథకాలు ప్రజలకు అందేలా కాంగ్రెస్ నేతలు.. అధికారులు, ప్రజల మధ్య సంధానకర్తలుగా వ్యవహరించాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ కోరారు. ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం మొదలైందని, ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేశామని గుర్తు చేశారు.

దుబారా వద్దు..

- వృథా ఖర్చులు తగ్గించండి.. గొప్పలు, ఆర్భాటాలకు పోవద్దు
- నెలసరి ఖర్చులపై స్పష్టత ఉండాలి.. అప్పులు, చెల్లింపులపై అవగాహనతో వెళ్లండి
- మనకు రావాల్సిన నిధులను రాబట్టండి
- వాస్తవికత ప్రతిబింబించేలా వచ్చే ఏడాది బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- ఆర్థిక శాఖ అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: 'అసలైన ప్రజల తెలంగాణ వచ్చిందనుకోండి. అందుకు అనుగుణంగా బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయండి. వాస్తవికతను ప్రతిబింబించేలా 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ఉండాలి. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే అంతిమ లక్ష్యంగా బడ్జెట్ కసరత్తు జరగాలి.' అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆర్థిక శాఖ అధికారులకు సూచించారు. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సవాళ్లు, ప్రభుత్వం ముందున్న లక్ష్యాలన్నింటినీ ఉన్నది ఉన్నట్టు ప్రజలకు చెప్పాలని ఆయన స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆర్థిక శాఖపై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. సమీక్షలో భాగంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంపదను దుబారా చేయవద్దని, వృథా ఖర్చులు అరికట్టే విధంగా ఆర్థిక శాఖ ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. 'వాస్తవంగా రాష్ట్ర ఆదాయమెంత ఉంది? ఉద్యోగుల జీతభత్యాలు, ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఇతర పనులకు ఎంత ఖర్చవుతుంది? ఎలాంటి దాపరికం లేకుండా ఆదాయ వ్యయాల ముఖచిత్రం ప్రజలకు అర్థం కావాలి. గొప్పలు, ఆర్భాటాలకు పోవద్దు.' అని స్పష్టం చేశారు. రాష్ట్రానికి ఉన్న అప్పులు, చెల్లించాల్సిన బకాయిలు, నెలవారీగా చేయాల్సిన ఖర్చులపై స్పష్టతతో ఉండాలని, ఓ అవగాహన మేరకు ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించాలని సూచించారు. ఈ క్రమంలో ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్న విషయాన్ని విస్మరించవద్దన్నారు. కొందరు వ్యక్తులను సంతృప్తిపర్చాల్సిన అవసరం లేదని, తెలంగాణ ప్రజలను సంతృప్తిపర్చాల్సిన బాధ్యత గుర్తెరగాలని చెప్పారు. ప్రజల కోణంలో బడ్జెట్ ఉండేలా ప్రత్యేక కసరత్తు జరపాలని, గతంలో ఉన్న అప్పులు దాచిపెట్టడం, ఆదాయ, వ్యయాలను భూతద్దంలో చూపెట్టడం లాంటివి చేయొద్దని, బడ్జెట్ ప్రతిపాదనలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు.

కేంద్రానికి పేరొస్తుందని ఆలోచించకండి

కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోవడంలో ఎక్కడా వెనుకడుగు వేయొద్దని సీఎం రేవంత్ చెప్పారు. 'కేంద్రం ఇచ్చే గ్రాంట్లను నూటికి నూరుపాళ్లు సద్వినియోగం చేసుకోవాలి. వీలైనన్ని ఎక్కువ గ్రాంట్లు రాబట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. వివిధ శాఖలు, పథకాల వారీగా కేంద్రం ఇచ్చే మ్యాచింగ్ గ్రాంట్‌ను వినియోగించుకోవాలి. కొంత వాటా రాష్ట్రం ఇస్తే కేంద్రం మిగిలిన నిధులను ఇచ్చే ప్రాయోజిత పథకాలను ఎట్టి పరిస్థితుల్లో వదులుకోవద్దు. కేంద్ర ప్రభుత్వానికి పేరు వస్తుందనో, రాష్ట్ర ప్రభుత్వానికి పేరు పెద్దగా రాదనో బేషజాలకు అస్సలు పోవద్దు.' అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, కార్యదర్శి టి.కె.శ్రీదేవి, జాయింట్ సెక్రటరీ కె.హరితతో పాటు ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక అధికారి కృష్ణభాస్కర్‌తో పాటు ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తప్పనిసరైతేనే ప్రభుత్వ ప్రకటనలు.. కొత్త వాహనాలు కొనుగోలు చేయొద్దు

రాష్ట్ర ఆదాయవనరులను సద్వినియోగం చేసుకోవాలని, దుబారా ఖర్చులు తగ్గించుకోవాలని, అడ్డగోలు ఖర్చు, అనవసర వ్యయం మంచిది కాదని సీఎం రేవంత్ ఆర్థిక శాఖ అధికారులతో సమీక్షలో వ్యాఖ్యానించారు. తప్పనిసరయితేనే ప్రభుత్వం తరఫున ప్రకటనలు ఇవ్వాలని, కొత్త వాహనాలను కొనుగోలు చేయవద్దని, ఇప్పుడున్న వాహనాలనే వినియోగించుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వం ఎన్నికల్లో గెలవకముందే 22 ల్యాండ్ క్రూయిజర్ వాహనాలను కొనుగోలు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసిన సీఎం ఇలాంటి ఖర్చులను అస్సలు పెట్టుకోవద్దని స్పష్టం చేశారు.

నేడు నాగ్‌పూర్‌కు ముఖ్యమంత్రి

సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ఉదయం నాగ్‌పూర్ వెళ్తున్నారు. అక్కడ జరిగే పార్టీ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొనడానికి వెళ్తున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు వివరించాయి. కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం సాయంత్రం సీఎం తిరిగి హైదరాబాద్ చేరుకుంటారని ఆ వర్గాలు తెలిపాయి.

క్షయ విముక్తి భారత్ లక్ష్యంగా..

కేంద్రం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తోంది: తమిళిసై



వికసిత్ భారత్ సంకల్పయాత్రను ప్రారంభిస్తున్న గవర్నర్ తమిళిసై

లాలాపేట (హైదరాబాద్): టీబీ వ్యాధి నిర్మూలనకు 2025లోగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో క్షయ విముక్తి భారత్ దిశగా ప్రయత్నిస్తోందని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. వైద్యురాలిగా తాను ఈ విషయం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం సికింద్రాబాద్ నియోజకవర్గం లాలాపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో జరిగిన 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' ప్రారంభోత్సవంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి సమగ్ర సమాచారం అందించే పబ్లిసిటీ వ్యాన్‌ను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ సమాచారంతో కూడిన ఐఈసీ మెటీరియల్‌ను, బ్రోచర్లను గవర్నర్ ఆవిష్కరించారు. అనంతరం స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ కేంద్ర ప్రభుత్వ స్టాళ్లను గవర్నర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నర్ తెలుగులో మాట్లాడుతూ 'మీ అందరికీ నమస్కారం... మీరందరూ సంతోషంగా ఆరోగ్యంగా ఉండాలని నేను దేవుడిని ప్రార్థిస్తున్నాను. మన ప్రధాని నరేంద్ర మోదీ మీరందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నారు. అందుకే ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని ఇచ్చారు' అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరూ తెలుసుకోవాలని పేర్కొన్నారు. సోదరీమణులు కష్టపడకుండా ఉండాలనే పీఎం ఉజ్వల యోజనా పథకం ద్వారా వంట గ్యాస్ కనెక్షన్‌లు ఇస్తున్నారని, ఆయుష్మాన్ భారత్‌తో నిరుపేదలకు ఉచితంగా వైద్య సదుపాయం కల్పించారన్నారు. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని దేశ ప్రధాని పని చేస్తున్నారని గవర్నర్ వివరించారు. ప్రభుత్వ పథకాల ఫలాలను ప్రజలకు చేరవేసేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ఈ యాత్ర ఉద్దేశం అన్నారు. 100 శాతం లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వ పథకాలను అందజేసేందుకు ఈ యాత్ర 2024 జనవరి 25 వరకు కొనసాగుతుందని గవర్నర్ చెప్పారు.

భూముల సర్వేకు సిద్ధం కండి

- ఏపీలో ఏం జరుగుతుందో పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వండి: మంత్రి పొంగులేటి
- రెవెన్యూ రికార్డుల్లో దాపరికం వద్దు.. వీఆర్ఏలకు వారం రోజుల్లో ఐడీ కార్డులు, వేతనాలు
- భూముల క్రమబద్ధీకరణపై త్వరలోనే నిర్ణయం
- భూపరిపాలన, రిజిస్ట్రేషన్ శాఖల సమీక్షలో మంత్రి వెల్లడి



అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వ్యవసాయ భూములను సర్వే చేసే విషయంలో ప్రభుత్వానికి స్పష్టత ఉందని, సర్వేకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 'దేశంలోని పలు రాష్ట్రాల్లో జరిగిన భూముల సర్వేలను పరిశీలించండి. అత్యాధునిక పరిజ్ఞానంతో సర్వే ఎలా చేయాలన్న దానిపై నివేదిక తయారు చేయండి' అని నిర్దేశించారు. బుధవారం సచివాలయంలో భూపరిపాలన, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో ఆయన వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. భూపరిపాలన, సర్వే విభాగాల అధికారులతో సమీక్ష సందర్భంగా భూముల సర్వే అంశం చర్చకొచ్చింది. ప్రస్తుతం కేరళ, ఆంధ్రప్రదేశ్‌లో సర్వేలు జరుగుతున్నాయని, ఏపీలో జరుగుతున్న సర్వే మోడల్ సర్వేగా ఉపయోగపడుతుందని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. ఇందుకు స్పందించిన పొంగులేటి.. ఏపీలో ఏం జరుగుతోందో పరిశీలించడంతోపాటు మంచి, చెడులను విశ్లేషిస్తూ సమగ్ర నివేదిక రూపొందించాలని చెప్పారు. భూముల క్రమబద్ధీకరణపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని, రెవెన్యూ రికార్డుల్లో దాపరికం ఉండకూడదని చెప్పారు. వీఆర్ఏలకు త్వరలోనే ఐడీ కార్డులు, వేతనాలివ్వాలని, ఈ ప్రక్రియను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షల్లో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, సీసీఎల్ఏ, సర్వే–ల్యాండ్ సెటిల్‌మెంట్స్, రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆదాయమెందుకు తగ్గింది?

రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయ వృద్ధి గతంతో పోలిస్తే సహేతుకంగా లేదని మంత్రి పొంగులేటి అభిప్రాయపడ్డారు. దీనికి రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు స్పందిస్తూ గతంలో పంచాయతీల లేఅవుట్లను కూడా రిజిస్ట్రేషన్ చేసేవారమని, ఇప్పుడు సుప్రీంకోర్టు ఆదేశాలతో అవి పెండింగ్‌లో పడ్డాయని చెప్పారు. గత ప్రభుత్వం పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలకు తెచ్చిన సవరణలు ఇబ్బందికరంగా మారాయని, ఈ సమస్య నుంచి బయటపడే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. దీనిపై స్పందించిన పొంగులేటి.. పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులతోనూ తాను మాట్లాడతానని, సుప్రీం తీర్పు ఉల్లంఘన జరగకుండా ఎల్ఆర్ఎస్ విషయంలో ఏం చేయాలో నివేదిక సిద్ధం చేయాలని చెప్పారు. ఈ అంశంపై సీఎం రేవంత్‌తో కూడా మాట్లాడి నిర్ణయం తీసుకుందామని చెప్పారు.

కూల్‌గా చేయండి... కష్టపడండి

'రిజిస్ట్రేషన్ల శాఖ ప్రజలకు సంబంధించింది. ఈ శాఖలో గట్టిగా పనిచేయాలి. రెండేళ్లు, మూడేళ్లకోసారి బదిలీలు ఎలాగూ ఉంటాయి. బాగా పనిచేస్తే అలాగే కొనసాగొచ్చు. కానీ, ఆ రెండు, మూడేళ్లు తమ ఇష్టారాజ్యమంటే మాత్రం కుదరదు. ఫిర్యాదులు వస్తే ఎప్పుడైనా బదిలీకి సిద్ధంగా ఉండాల్సిందే. కూల్‌గా పని చేసుకోండి. కష్టపడండి' అని రిజిస్ట్రేషన్ల శాఖపై సమీక్ష సందర్భంగా పొంగులేటి చెప్పారు. తప్పు చేసిన వారి విషయంలో ముఖ్యమంత్రి చెప్పినా వినేది లేదని స్పష్టం చేసినట్టు సమాచారం. కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వేల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరుగుతుంటే, కొన్ని చోట్ల డాక్యుమెంట్ల సంఖ్య వందలు కూడా దాటడం లేదని, అలా కాకుండా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

ఓడిన అభ్యర్థులే ఇన్‌చార్జులు..

▶ మొదటి పేజీ తరువాయి

ఇన్‌చార్జులను ఆదేశించారు.

లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా సమీక్ష

రాష్ట్రం నుంచి 17 మంది ఎంపీలు లోక్‌సభలో ప్రాతినిధ్యం వహిస్తుండగా ఇందులో బీఆర్ఎస్‌కు చెందిన వారు 9 మంది ఉన్న విషయం తెలిసిందే. వీరంతా సమావేశాలకు అందుబాటులో ఉండాల ని తుంటి ఎముకకు శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్న పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు సుమారు వారం రోజుల క్రితం ఆదేశించారు. అయితే వైద్యుల సూచన నేపథ్యంలో ఈ భేటీలు వాయిదా పడినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ ఆదేశాల మేరకు కేటీఆర్ పార్టీ యంత్రాంగాన్ని లోక్‌సభ ఎన్నికల దిశగా సన్నద్ధం చేయడంపై కసరత్తు కొనసాగిస్తున్నారు. చేవెళ్ల, కరీంనగర్, నిజామా బాద్, కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గాల నుంచి పోటీ చేసే అభ్యర్థులపై పార్టీ అధినేత స్పష్టత ఇవ్వడంతో ఆయా ప్రాంతాల్లో ఎన్నికల కార్యాచరణపై దృష్టి కేంద్రీకరించారు. చేవెళ్ల లోక్‌సభ సెగ్మెంట్ (సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి) పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలతో రెండురోజుల క్రితమే సమన్వయ సమావేశం నిర్వహించారు.

ప్రాతినిధ్యంలేని నియోజకవర్గాలపై నజర్

అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు ఒక్క సెగ్మెంట్‌లోనూ గెలవని లోక్‌సభ నియోజకవర్గాలపై బీఆర్ఎస్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. హైదరాబాద్, ఖమ్మం, నల్లగొండ, హైదరాబాద్, పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో బీఆర్ఎస్‌కు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. భువనగిరి, వరంగల్, మహబూబాబాద్ సెగ్మెంట్ల పరిధిలో పార్టీకి కేవలం ఒక్కో ఎమ్మెల్యే మాత్రమే ఉన్నారు. ఆదిలాబాద్, జహీరాబాద్, నాగర్‌కర్నూల్ పరిధిలో ఇద్దరు, నిజామాబాద్, కరీంనగర్ లోక్‌సభ స్థానాల పరిధిలో ముగ్గురేసి చొప్పున బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. ఈ నేపథ్యంలో ఆయా లోక్‌సభ సెగ్మెంట్ల పరిధిలో బీఆర్ఎస్ తరఫున గెలిచిన, ఓటమి పాలైన అభ్యర్థులకు వచ్చిన ఓట్లు, సాధించిన లేదా కోల్పోయిన మెజారిటీ, ప్రభావం చూపిన అంశాలు, పార్టీ యంత్రాంగం పరిస్థితిపై ఇప్పటికే పోస్ట్‌మార్టం జరిగింది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడేలోగా ఈ లోక్‌సభ సెగ్మెంట్ల పరిధిలో పార్టీ యంత్రాంగాన్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు అవసరమైన కార్యాచరణపై బీఆర్ఎస్ దృష్టి సారించింది. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన నియోజకవర్గాల్లో కేటీఆర్ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌పైనా కసరత్తు జరుగుతోంది.

భట్టికా.. బీసీకా?

▶ మొదటి పేజీ తరువాయి

మాజీ పీసీసీ అధ్యక్షుడు వి.హనుమంతరావు పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో పొన్నం ఇప్పటికే మంత్రిగా కొనసాగుతుండటం, మధుయాష్కీ ఇటీవలే ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన దృష్ట్యా, మహేశ్ గౌడ్, వీహెచ్‌ల పేర్లపై చర్చ జరుగుతున్నట్లు చెబుతున్నారు.

ఆ ఇద్దరిలో ఒకరికి రేవంత్ మద్దతు?

ప్రస్తుతం పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం మహేశ్ గౌడ్, వీహెచ్‌లలో ఒకరికి మద్దతుగా నిలుస్తున్నారని సమాచారం. మొత్తంగా 'జనవరి రెండో వారానికల్లా తెలంగాణకు కొత్త అధ్యక్షుడు రావొచ్చు. దీనిపై ఇప్పటికే ఏఐసీసీ పరిశీలన చేస్తోంది. బీసీ సామాజిక వర్గ నేతను ఎంపిక చేసేందుకు ఎక్కువ అవకాశాలున్నాయి' అని ఏఐసీసీలోని కీలక నేత ఒకరు వెల్లడించారు.

'ఇండియా కూటమి'తో దేశ సమగ్రతకు ముప్పు

- సనాతన ధర్మానికి, హిందుత్వానికి, హిందీ మాట్లాడే ప్రజలకు ఈ కూటమి ప్రమాదం
- మెజారిటీ ప్రజల విశ్వాసాన్ని, అస్తిత్వాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ ప్రవర్తిస్తోంది
- కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్, ఆ పార్టీ నేతృత్వంలోని కూటమితో దేశ సమగ్రతకు ముప్పువాటిల్లుతోందనీ దేశ ప్రజలు ఈ విషయంపై ఆలోచించాలని కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలోని 'ఇండియా కూటమి' అహంకారాన్ని ఆదిలోనే అడ్డుకుని సరైన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరుతూ బుధవారం ఆయన బహిరంగ ప్రకటన చేశారు. సనాతన ధర్మానికి, హిందుత్వానికి, హిందీ మాట్లాడే ప్రజలకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఈ పనికిరాని కూటమి రోజురోజుకూ ప్రమాదంగా మారుతోందని ధ్వజమెత్తారు. మెజారిటీ ప్రజల విశ్వాసాన్ని, అస్తిత్వాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని నిందించారు. ఇటీవలే కాంగ్రెస్ కూటమిలోని డీఎంకే నాయకుడు.. యూపీ, బిహార్ నుంచి వచ్చే హిందీ మాట్లాడే వాళ్లు, తమిళనాడుకు టాయిలెట్లు కడిగేందుకు వస్తారని చేసిన వ్యాఖ్యలు దేశ వ్యాప్తంగా దుమారం రేపాయని గుర్తు చేశారు. ఆయా ప్రాంతాలకు చెందిన కార్మికులు.. శ్రమనే నమ్ముకుని జీవనోపాధి కోసం దేశంలోని వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన వారిని ఇంత నీచంగా అవమానించాల్సిన అవసరం ఉందా? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. శ్రమజీవులను అవమానించడం, కష్టపడి పనిచేసేవారిని అవహేళన చేయడం కాంగ్రెస్‌కు, వారితో అంటకాగుతున్న వారికి మొదట్నుంచీ అలవాటేనని ఆరోపించారు.

అధికారంలోకి వస్తే హిందువులను నిర్మూలించాలనే వారి ఆలోచన

ఇటీవలే పార్లమెంటులో చర్చ సందర్భంగా.. రాజకీయ స్వార్థంతో కడుపునిండా ద్వేషాన్ని నింపుకుని ఓ ఎంపీ మాట్లాడారని కిషన్‌రెడ్డి నిందించారు. గోమూత్రాన్ని తాగే రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుస్తుందన్న ఆ ఎంపీ అహంకార పూరితమైన మాటలను యావత్ సమాజం తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. డీఎంకే పార్టీ సనాతన ధర్మాన్ని కేన్సర్, డెంగ్యూ, మలేరియాతో పోల్చడాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన.. కొంతమంది కుహనా లౌకికవాదులు అహంకారపూరితంగా నోటికొచ్చినట్లు మాట్లాడటమే మేధావితనమని, గొప్పతనమని అనుకుంటున్నారని విమర్శించారు. ప్రతిసారీ హిందుత్వం, పేద ప్రజలపై తమ అక్కసును వెళ్లగక్కడం ద్వారా.. 2024 ఎన్నికలకు తమ ఎజెండాను ఈ కూటమి స్పష్టం చేసిందని తెలిపారు. అధికారంలోకి వస్తే హిందుత్వాన్ని, హిందువులను నిర్మూలించడమే ఆ కూటమి ఆలోచన అని అర్థమవుతోందని కిషన్ రెడ్డి ఆరోపించారు.

'ప్రజాపాలన'లో నిర్లక్ష్యం వద్దు

- అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి
- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా... ఆరు గ్యారంటీలు అమలు చేయాలి
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్



అధికారులతో జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న ఉత్తమ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా ఆరు గ్యారంటీలు అమలు చేసే దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోందని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం నుంచి వచ్చే నెల 6వరకు అమలు చేయనున్న 'ప్రజాపాలన' కార్యక్రమాన్ని అధికారులంతా బాధ్యతాయుతంగా వ్యవహరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజా పాలన అమలు విషయంలో నిర్లక్ష్యం వద్దని రెవెన్యూ, పోలీసు యంత్రాంగంతో పాటు మిగతా శాఖల భాగస్వామ్యంతో పదిరోజుల పాటు జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలలోని ప్రతి వార్డుల్లో సభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు.

రేపు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను పరిశీలిస్తాం..

మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను శుక్రవారం పరిశీలిస్తామని, వంతెన కుంగిన ఘటనను పరిశీలించి విచారణ చేపట్టి అందుకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంథనిలోని కాళేశ్వరం ప్రాజెక్టు, హుస్నాబాద్‌లోని గౌరవెల్లి ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామని చెప్పారు. రేషన్ బియ్యం రీసైక్లింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ హెచ్చరించారు.

ప్రజాభీష్టానికి అనుగుణంగానే పాలన సాగిస్తాం

- అమరవీరుల స్తూపాన్ని స్మృతి వనంగా తీర్చిదిద్దుతాం
- ఇంద్రవెల్లి స్తూపం వద్ద నివాళులర్పించిన మంత్రి సీతక్క



స్మృతి వనంపై ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌తో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఇంద్రవెల్లి: ప్రజలు రాచరిక పాలన నుంచి విముక్తి పొంది, ఇందిరమ్మ రాజ్యం కోరుకున్నారని, వారి అభీష్టానికి అనుగుణంగా ప్రజాపాలన సాగిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ప్రజా పాలనకు సంబంధించి బుధవారం ఆదిలాబాద్‌లో ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశానికి వెళ్తూ, మార్గమధ్యలో ఇంద్రవెల్లి స్తూపం వద్ద ఆగారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి ఆదివాసీ అమరవీరులకు ఘన నివాళి అర్పించారు. ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, డీపీవో శ్రీనివాస్‌తో పాటు అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం స్మృతి వనం ఏర్పాట్లపై ఐటీడీఏ పీవోతో మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. పేదల ఆశలు నెరవేర్చే దిశగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో గతంలో ఇక్కడ జరిగిన దళిత, ఆదివాసీ దండోరా సభలో స్మృతి వనం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇందులో భాగంగా స్మృతి వనం ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగే సభకు 50 వేల మందితో బయలుదేరి వెళ్తున్నట్లు సీతక్క వెల్లడించారు.

మేము రాసిన లేఖలనే మోదీకి మళ్లీ ఇచ్చారు

రాష్ట్రానికి రావాల్సిన హామీలపై కాంగ్రెస్ పార్టీ కొట్లాడాలి: బోయినపల్లి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రాసిన లేఖలనే సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మరోమారు ప్రధాని మోదీకి ఇచ్చారని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఏపీ విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు, నిధులకు సంబంధించి ప్రధాని మోదీని సీఎం హోదాలో కేసీఆర్ అనేక మార్లు కలిసిన విషయాన్ని గుర్తు చేశారు. మోదీతో కేసీఆర్ జరిపిన ప్రతీ భేటీలో చూస్తామనే మాటలు తప్ప రాష్ట్రానికి నయాపైసా ఇవ్వలేదని ఆయన అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి వినోద్ కుమార్ బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీతో సీఎం రేవంత్ భేటీ అయ్యి రాష్ట్రానికి రావాల్సిన నిధులపై లేఖ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ప్రధానికి ముఖ్యమంత్రి హోదాలో సీఎం కేసీఆర్ అనేక లేఖలు రాసినా పట్టించుకోనందునే మోదీని కలవడం మానేశామని వినోద్ వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి రావాల్సిన హక్కుల విషయంలో కేంద్రం వద్ద తాము ఎన్నడూ రాజీ పడలేదని, బీబీనగర్ ఎయిమ్స్ ఏర్పాటు బీఆర్ఎస్ పోరాటం వల్లే సాధ్యమైందన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా జాతీయ రహదారుల మంజూరుకు కేంద్రానికి ఎన్నిమార్లు విజ్ఞప్తులు చేసినా ఒక్కటీ నెరవేరలేదని వినోద్ కుమార్ అన్నారు. తెలంగాణ హక్కుల కోసం కేంద్రం వద్ద కాంగ్రెస్ పార్టీ కొట్లాడాలని వినోద్ కుమార్ సూచించారు.



“ దీర్ఘ అనుభవం మీద ఆధారపడి చెప్పే పొట్టి వాక్యమే... సామెత.
– మిగెల్ డె సెర్వాంటీజ్

సాక్షి
గురువారం, 28 డిసెంబర్ 2023

ఎరుపెక్కిన సముద్ర వర్తకం

సమీపకాలంలో భారత్‌కు అత్యంత ఆందోళనకర పరిణామం ఇది. బలవత్తరమైన శక్తిగా ఎదగడానికి సముద్ర వర్తకం ముఖ్యమైన వేళ... వాణిజ్య నౌకలపై వరుస దాడులు నిరంతర అప్రమత్తత అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. వేర్వేరు వాణిజ్య నౌకలపై అరేబియా సముద్రంలో ఇటీవల జరిగిన దాడులతో, భారత నౌకాదళం మూడు క్షిపణి విధ్వంసక నౌకలను మోహరించాల్సి వచ్చింది. వాటిని వివిధ ప్రాంతాల్లో గస్తీకి నిలిపి, ముష్కరుల దొంగదాడులకు మన నేవీ చెక్ పెట్టే పనిలో పడింది. వారం రోజుల్లో... భారతీయ సిబ్బందితో కూడిన రెండు వాణిజ్య నౌకలు మన దేశానికి వస్తూ, దాడికి గురవడం మన సముద్ర వర్తకం భద్రతపై ప్రశ్నలు రేపింది.

పోర్‌బందర్‌కు 217 నాటికల్ మైళ్ళ దూరం నుంచి 21 మంది భారతీయ సిబ్బందితో కూడిన ఎమ్వీ చెమ్ ప్లూటోపై డిసెంబర్ 23న డ్రోన్ దాడి జరిగింది. అప్రమత్తమైన భారత నౌకాదళం, భారత తటరక్షక దళం సదరు వర్తక నౌకకు రక్షణగా నిలిచాయి. తర్వాత కొద్ది గంటలకే... పాతిక మంది భారతీయ సిబ్బందితో కూడిన వాణిజ్య క్రూడాయిల్ ట్యాంకర్ ఎమ్వీ సాయిబాబాపై ఎర్రసముద్రం దక్షిణ ప్రాంతంలో డ్రోన్ దాడి జరిగింది. దీంతో,నౌకాదళం గస్తీ పెంచింది. దాడులు జరిపిన ముష్కరులు సముద్ర గర్భంలో దాగివున్నా సరే, వెతికి పట్టుకొని, కఠిన చర్యలు తీసుకుంటామంటూ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. లెక్కలు తీస్తే... నవంబర్ 19 నుంచి ఇప్పటికి ఈ ప్రాంతంలో వాణిజ్య నౌకలపై 30 డ్రోన్ దాడులు, సముద్రపు దొంగల దాడులు జరిగాయి. అంటే, దాదాపు రోజుకో దాడి. ఈ 30 దాడుల్లో సగం ప్రపంచంలోనే అతి రద్దీగా ఉండే సముద్ర వర్తక మార్గంలో ఎర్ర సముద్రంలో జరిగినవే. ఇది ఆందోళనకరం.

తాజాగా ఎమ్వీ చెమ్ ప్లూటోపై జరిగిన దాడి తాలూకు శిథిలాలను సేకరించి, దాడి తీరుతెన్నులను కనిపెట్టే ప్రయత్నం సాగుతోంది. దాడి మరో నౌకపై నుంచి చేశారా, లేక తీర ప్రాంతం నుంచి జరిగిందా లాంటి అంశాలను నిర్ధారణ చేసే పనిలో ఇండియన్ నేవీ నిమగ్నమైంది. ఒకపక్క గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధంతో ఉద్రిక్తతలు పెరగగా, అదే సమయంలో వాణిజ్య నౌకలపై ఇలా డ్రోన్ దాడులు జరగడం యాదృచ్ఛికమేమీ కాదు. అక్కడి యుద్ధం తాలూకు ప్రభావం ఇక్కడకు విస్తరించింది. యెమెన్‌లో అధిక ప్రాంతాలను తమ నియంత్రణలో పెట్టుకున్న హౌథీ రెబల్స్ నవంబర్ మధ్య నుంచి ఎర్ర సముద్రంలో వెళుతున్న నౌకలపై డ్రోన్లు, క్షిపణులు ప్రయోగిస్తున్నారు. గాజాలోని హమాస్‌కు సంఘీభావంగా రెబల్స్ ఈ దాడులు చేస్తున్నారు. ఇజ్రాయెల్‌తో స్పష్టమైన సంబంధం లేని నౌకలపైనా ఈ దాడులు సాగడం గమనార్హం. వీరికి ఇరాన్ అండదండలున్నట్టు కథనం.

దాడులకు బాధ్యత తమదేనంటూ ఈ యెమనీ రెబల్స్ అధికారికంగా ప్రకటించలేదు. అయితే, ఎమ్వీ సాయిబాబాపై హౌథీలు దాడి జరిపారనీ, ఎమ్వీ చెమ్‌ప్లూటోపై ఇరాన్ నుంచి డ్రోన్‌ను ప్రయోగించారనీ అమెరికా కేంద్ర కమాండ్ సమాచారం. దాడులకు ఎర్ర సముద్రాన్ని ఎంచుకోవడంలో ముష్కరులకు పెద్ద వ్యూహం ఉంది. ప్రపంచ నౌకా రవాణాలో 30 శాతం, వ్యాపారంలో 12 శాతం, సముద్రజలాలపై పెట్రోలియమ్ వాణిజ్యంలో 10 శాతం మధ్యధరా ప్రాంతాన్ని హిందూ మహాసముద్రంతో కలిపే ఎర్ర సముద్రం మీదుగానే జరుగుతాయి. దాడుల వల్ల నౌకలు రూటు మార్చి, ఒకప్పటిలా గుడ్‌హోప్ అగ్రం చుట్టూ తిరిగిరావాలి. దూరం, దరిమిలా ప్రయాణకాలం పెరిగే ఈ సుదీర్ఘయానం వల్ల చమురు, దిగుమతుల ధరలు గణనీయంగా పెరుగుతాయి. పశ్చిమాసియా నుంచి వచ్చే చమురు మరింత ప్రియమవుతుంది. చమురు సరఫరాలకు ప్రధానంగా ఆ ప్రాంతంపై ఆధారపడే భారత్‌కు ఇది దెబ్బ. ఇజ్రాయెల్ – హమాస్ పోరు ప్రారంభమైనప్పటి నుంచి ముడి చమురు ధరలు అంతకంతకూ పెరగడమే అందుకు నిదర్శనం.

అమెరికా, ఇజ్రాయెల్‌లను సైద్ధాంతికంగా వ్యతిరేకించే హౌథీల దాడుల దెబ్బకు ఎర్ర సముద్రం ఇప్పుడు యుద్ధ క్షేత్రమైపోయింది. గాజాకు మానవతా సాయం అందేవరకు ప్రపంచ సరఫరా వ్యవస్థలకు అవరోధాలు కల్పించాలన్న వారి ఆలోచన ఫలిస్తోంది. దీన్ని ప్రతిఘటించి, ముష్కరుల దాడుల నుంచి రక్షణ కోసం అమెరికా గత వారం ‘ఆపరేషన్ ప్రాస్పరిటీ గార్డియన్’ పేర బహుళ దేశీయ నౌకా దళాన్ని ప్రారంభించింది. అయితే, అగ్రరాజ్య సారథ్యంలోని ఈ బలగంలో పలు దేశాలు చేరలేదు. సూయజ్ కాలువ ద్వారా వర్తకం తగ్గినందు వల్ల భారీగా నష్టపోయే ఈజిప్ట్ ఇంతవరకు హౌథీల దుశ్చర్యలను ఖండించలేదు. చివరకు యెమెనీ గ్రూపుతో శాంతి ప్రక్రియ చర్చలు సాగిస్తున్న సౌదీ అరేబియా సైతం అమెరికా సారథ్య నౌకాబలగాన్ని సమర్థించలేదు.

ఉత్తరాన హిమాలయాలు, పశ్చిమాన శత్రుత్వం వహించే పాకిస్తాన్ ఉన్నందున, మిగిలిన దిక్కుల్లో వాణిజ్యానికి సంబంధించి ఆచరణలో భారత్ ద్వీపదేశమే. అందుకే, మనకు సముద్ర వర్తకం కీలకం. మన దేశ వాణిజ్య పరిమాణంలో 98 శాతం, విలువలో 68 శాతం సముద్ర మార్గాల్లోనే సాగుతాయి. దానికి తగ్గట్టే హిందూ మహాసముద్ర ప్రాంతానికి కావలి పాత్రను భారత్ పోషిస్తోంది. వాణిజ్యం పెరగాలంటే, మిత్రదేశాలతో కలసి ఈ సముద్ర మార్గాలను సురక్షితంగా ఉంచాలి. ఆ పనే భారత్ చేస్తోంది. అయితే, ఇజ్రాయెల్ – గాజా యుద్ధంలో సమదూరం పాటిస్తూ వచ్చిన మనకు తాజా పరిస్థితులు కొత్త బరువ నెత్తిన పెట్టాయి. సోమాలీ సముద్ర దొంగల్ని నిరోధించేందుకు ఈ సరికే గస్తీ సాగిస్తున్న భారత్, ఇకపై వాణిజ్య నౌకల్ని భద్రంగా ఎర్ర సముద్రం దాటించే పని తప్పదు. ఒకవేళ దాడులు సాగితే, అది మరో యుద్ధభేరి అవుతుంది. అందుకే, ఈ సమస్యలన్నిటికీ అసలు పరిష్కారం గాజాలో యుద్ధానికి తెర పడడం, శాంతి నెలకొనడమే!

2023 పాఠాలు... 2024 ఆశలు

విశ్లేషణ



శ్యామ్ శరణ్

2023 సంవత్సరం ముగింపునకు వచ్చేసింది. ఒకపక్క కృత్రిమ మేధ, మరోపక్క రాజకీయ పరివర్తన జోరుగా సాగుతున్న ఈ ఏడాది మనకు మిగిల్చిన జ్ఞాపకాలేమిటి? ప్రపంచం పట్టు తప్పిపోతోందన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. జీపీటీ–4 రావడం ఈ ఏడాది అత్యంత కీలకమైన పరిణామం. ఇక నుంచి కృత్రిమ మేధే భౌగోళిక రాజకీయాల్లో ఒక పాత్రధారి కానుంది. ఉక్రెయిన్, గాజా యుద్ధాల నేపథ్యంలో 2024ను ఊహించుకుంటే, ప్రపంచ వ్యాప్తంగా చాలా చోట్ల ఉన్న ప్రత్యేక పరిస్థితులు మరిన్ని యుద్ధాలకు దారితీసే ప్రమాదం కనిపిస్తోంది. అయితే, వాతావరణ మార్పుల ముప్పును తట్టుకునేందుకు శిలాజ ఇంధనాల నుంచి ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వైపు మళ్లాలని ‘కాప్’ సమావేశాల్లో అంగీకారం కుదరడం శుభపరిణామం.

చాలా దేశాల పౌరులు హ్రస్వదృష్టితో కూడిన జాతీయవాదానికీ, తాత్కాలిక ప్రయోజనాలకు పెద్దపీట వేసే నేతలకూ పగ్గాలు అప్పగించారు. కోవిడ్–19 పరిస్థితులు ప్రచండంగా ఉన్న సమయంలో టీకాల పేరుతో జాతీయ వాదం ప్రబలింది. ఇదెంత సంకుచితమైనదో ఆ తరువాత కానీ అర్థం కాలేదు. ఇది సాటి మానవుడి బాధను కూడా మరచిపోయేలా చేసింది. గాజాపై ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడుతున్నా ఎవరికీ పట్టకపోవడం కూడా దీనికి మరో నిదర్శనం. అదుపులేని హింసకు కొత్త, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలూ ఆజ్యం పోస్తున్నాయి. వేగంగా వృద్ధి చెందు తున్న ఈ టెక్నాలజీలు మానవాళి నిశ్చేష్టతకూ దారితీస్తున్నాయనడంలో సందేహం లేదు.



కల్పనకూ, వాస్తవానికీ తేడాలు చెరిగి...

ఈ ఏడాది మార్చిలో ఓపెన్‌ఏఐ జీపీటీ–4ను విడుదల చేసింది. ఇది కాస్తా రక్తమాంసాలతో కూడిన వాస్తవానికీ, కల్పనకూ మధ్య ఉన్న అంతరాన్ని చెరిపివేస్తోంది. ఈ డిజిటల్ వాస్తవాన్ని మన అనలాగ్ బుర్రలు ఎలా అర్థం చేసుకోగలవు? 2023 మొత్తమ్మీద అత్యంత కీలకమైన పరిణామం ఇదే అనడం అతిశయోక్తి కాబోదు. 2024లోనే కాదు... ఆ తరువాతి కాలంలోనూ మన జీవితాలను మార్చేసే పరిణామం. జీపీటీ–4 లాంటివి మన జియోపాలిటిక్స్‌ను కూడా ప్రభావితం చేస్తాయి. ‘‘టెక్నాలజీ అనేది భౌగోళిక రాజకీయాలపై ప్రభావం చూపడం కొత్త కాకపోయినా, కృత్రిమ మేధ రంగ ప్రవేశంతో పరిస్థితి సమూలంగా మారనుంది. కృత్రిమ మేధే భౌగోళిక రాజకీయాల్లో ఒక పాత్రధారి కానుంది’’ అని ఓ విశ్లేషకుడు ఇటీవలే వ్యాఖ్యానించారు.

ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లలో ప్రస్తుతం కృత్రిమ మేధే అతిపెద్దది. దీని నియంత్రణ కేవలం కొంతమంది చేతుల్లోనే ఉంది. ఈ టెక్నాలజీ కొన్ని బహుళజాతి కంపెనీల చేతుల్లో అభివృద్ధి చెందింది. ప్రభుత్వాలకు వీటిపై అవగాహన లేదు. నియంత్రించే శక్తి లేదు. నియంత్రించాలన్నా ప్రభుత్వాలు ఈ కంపెనీలపైనే ఆధారపడాల్సి ఉంటుంది. చైనా లాంటి దేశాలు చాలాకాలంగా సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిపై గట్టి నియంత్రణ పాటిస్తూ వచ్చిన విషయం ఇక్కడ చెప్పుకోవాలి. బహుశా చైనా ఈ కృత్రిమ మేధను ఇతరుల కంటే మెరుగ్గా నియంత్రించగలదేమో. కానీ అక్కడి ప్రభుత్వం కృత్రిమ మేధను కూడా తమ పార్టీ లక్ష్యాల సాధనకు పావుగా వాడుకున్నా ఆశ్చర్యం లేదు. అలాంటిది ఏదైనా జరిగితే అది ప్రపంచంలో అధికార అసమతౌల్యానికి దారితీయవచ్చు.

ద్వైదీ భావ పరాకాష్ఠలో ప్రపంచం...

మానవాళి సంక్షేమానికి అడ్డుగా నిలుస్తున్న సవాళ్లు అంతర్జాతీయ స్థాయికి చేరుతున్న తరుణంలో మన ఆలోచనా ధోరణులు మాత్రం అంతకంతకూ కుంచించుకుపోతున్నాయి. దేశాలకు, ప్రాంతాలకు పరిమితమైపోతున్నాయి. ఐరాస వంటి అంతర్జాతీయ సంస్థల ఆధ్వర్యంలో బహుముఖీన అంతర్జాతీయ సహకారం, సమష్టి బాధ్యతల పంపిణీతోనే మనం ప్రస్తుత సమస్యలను ఎదుర్కోగలం. సమన్యాయం పాటించగలం. ప్రస్తుతం ప్రభుత్వాతీత శక్తులన్నింటికీ శక్తిమంతమైన హింసాత్మక ఆయుధాలు అందుబాటులో ఉన్నాయి. ఇజ్రాయెల్‌పై హమాస్‌దాడి దీనికో తార్కాణం. బలహీనులు, నిర్వాసితులు కూడా బలంగా దెబ్బకొట్టగలరు అనేందుకు ఇజ్రాయెల్‌పై దాడి ఒక రుజువు.

ఉగ్రవాదంపై పోరు ఇప్పుడిప్పుడే అంతమయ్యేది కాదని 2023 మరోసారి నిరూపించింది. ఈ పోరు ఏకరీతిన లేదు. పైగా సాంకేతిక పరిజ్ఞానం ప్రభుత్వాలకు మరింత బలం చేకూరుస్తోంది. రాజ్యాంగాలను పక్కనబెట్టిన అన్ని దేశాలూ అర్థం చేసుకోవాల్సిన అంశం ఏమిటంటే, తిరుగుబాట్లను సమర్థంగా అణచివేసిన సంఘటనలు చరిత్ర మొత్తం వెతికినా కనిపించవూ అని! చిన్న రాపిడి మళ్లీ నిప్పు పుట్టించడం ఖాయం. ఫలితం తీవ్ర నష్టం, హింస. రాజకీయం ద్వారా హింసను చట్టబద్ధం చేయడం ఎంతమాత్రం తగని పని. అమాయకులు, మహిళలు, పిల్లలను చంపివేయడాన్ని కూడా సమర్థించే లక్ష్యం ఎంతటి ఉదాత్తమైనదైనా సమర్థనీయం కాదన్న విషయాన్ని అందరూ గుర్తించాలి. హింసను ఆయుధంగా వాడుకోవడం ఎప్పుడూ పులి మీద స్వారీ లాంటిదే. హింస మొదలైతే అది కేవలం తాము ఉద్దేశించిన లక్ష్యాలకే పరిమితమవుతుందని అనుకోలేము. హింస అటు ఆక్రమణదారులనూ, ఇటు బాధితులనూ రాక్షసుల్లా మార్చేస్తుంది. ఈ సత్యాన్ని చాలాకాలం క్రితమే మహాత్మాగాంధీ బాగా అర్థం చేసుకున్నారు. ‘అహింస’ భావన ఈ ప్రగాఢమైన అవగాహన నుంచి పుట్టిందే. గాంధీ మాటలను మనం ఎంత విస్మరిస్తామో ప్రపంచంలో అంతేస్థాయిలో ఘర్షణలు తలెత్తే ప్రమాదం ఉంది.

ఒక్క సానుకూల పవనం...

ఈ ఏడాది అంతర్జాతీయ స్థాయిలో చూసిన ఒక సానుకూల అంశం ఏదైనా ఉందీ అంటే అది దుబాయిలో ఇటీవలే ముగిసిన కాప్ సమావేశాలని చెప్పాలి. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకునేందుకు మానవాళి జరుపుతున్న కృషిలో భాగంగా జరిగిన ఈ సమావేశాల్లో కొన్ని ఆశాజనకమైన ఒప్పందాలు, నిర్ణయాలు జరిగాయి. వీటిని సక్రమంగా అమలు చేయగలిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సామాజిక సుస్థిరత దిశగా మళ్లే అవకాశాలు పెరుగుతాయి. వాతావరణ మార్పుల ముప్పును తట్టుకునేందుకు శిలాజ ఇంధనాల నుంచి ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వైపు మళ్లాలని అందరూ అంగీకరించడం శుభపరిణామం. కృత్రిమ మేధతోపాటు వినూత్నమైన టెక్నాలజీలను అందిపుచ్చుకునేందుకు ఇదో చక్కటి అవకాశం. 2023లో వాతావరణ మార్పుల విషయంలో జరిగిన ఒప్పందాలు, కల్పించిన ఆశ వచ్చే ఏడాదిలో సఫలీకృతమవుతాయని ఆశిద్దాం.

దీన్ని పక్కనపెడితే... ప్రపంచం వచ్చే ఏడాది కూడా కొంత అసందిగ్ధతను ఎదుర్కొంటుందనేందుకు కొన్ని నిదర్శనాలు కనిపిస్తున్నాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరిగేది 2024లోనే. ప్రస్తుతానికి డోనాల్డ్ ట్రంప్ పోటీ చేసే అవకాశాలు తగ్గాయి. అడ్డంకులు తొలిగి ట్రంప్ పోటీ చేసి గెలిస్తే మాత్రం అగ్రరాజ్యంలో సరికొత్త స్థానిక వాదం తలెత్తే ప్రమాదం ఉంది. మరోవైపు ఇజ్రాయెల్, హమాస్ యుద్ధంతోపాటు రష్యా ఉక్రెయిన్ జగడమూ వచ్చే ఏడాది మరింత ముదిరే అవకాశాలున్నాయి. ఉక్రెయిన్‌కు మద్దతిచ్చే విషయంలో అమెరికా కొంత అసందిగ్ధతతో వ్యవహరిస్తూండటాన్ని పుతిన్ గుర్తించక మానడు. తన దాడులను ఉధృతం చేయకుండా ఉండడు.

అమెరికా ఏకకాలంలో రెండు యుద్ధాలను పర్యవేక్షిస్తూండటం, ఆ దేశంతో మనకున్న సంబంధాలపై కూడా ప్రభావం చూపనుంది. పైగా చైనాతో తనకున్న శత్రుత్వాన్ని కొంత తగ్గించుకునే ప్రయత్నాలు చేయవచ్చు. ఇప్పటికే దీనికి కొన్ని రుజువులు కనిపిస్తున్నాయి. గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరు కారాదని బైడెన్ నిర్ణయించుకోవడం ఇక్కడ చెప్పుకోవాలి. అలాగే క్వాడ్ సమావేశాల వాయిదాను కూడా ఈ దృష్టితోనే చూడాల్సి ఉంటుంది. కెనెడా ఉగ్రవాది పన్నూ విషయంలో వచ్చిన అభిప్రాయబేధాలూ ఈ ధోరణికి కారణం కావచ్చు. సెప్టెంబరులో విజయవంతంగా నిర్వహించిన జీ20 సమావేశాల ప్రాభవం కాస్తా ఈ పరిణామాలతో తగ్గిపోయింది. మరోవైపు దేశంలోనూ సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. నరేంద్ర మోదీకి మరోసారి ప్రధాని పదవి దక్కే అవకాశం ఉంది. ఈ రాజకీయ సుస్థిరత 2024లో అంతర్జాతీయ స్థాయిలో మనకు మేలు చేస్తుందని ఆశిద్దాం.

వ్యాసకర్త విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి
(‘ద బిజినెస్ స్టాండర్డ్’ సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

కన్నడ కాక...



బెంగళూరులో శాంతి భద్రతల పరిస్థితి ఏమిటి? కన్నడ అనుకూల గ్రూపులు బెంగళూరు వ్యాప్తంగా విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఇంగ్లీష్ సైన్ బోర్డులను పగలగొడుతూ, బహిరంగంగా ఆస్తులకు నష్టం కలిగిస్తున్నాయి.

– నబీలా జమీల్, జర్నలిస్ట్

అంతా అనుకున్నట్టే!



సిరియా జనరల్ రజీ ముసావీ రజీ ‘ఐఆర్‌జీసీ’ (ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్) మిలిటరీ సలహాదారు ఇంటి మీదికి మూడు క్షిపణులు ప్రయోగించి ఇజ్రాయిల్ హత్య చేసింది. దీనిలో నిజ్జార్, పన్నూ ఛాయలు కనబడుతున్నాయి. అయినా యూఎస్ (అలాగే ఇండియా) నుంచి గట్టి మౌనం! ప్రపంచ నియమాల క్రమం నిజమైన ఆచరణలో ఉందా?

– ఎం.కె. భద్ర కుమార్, మాజీ దౌత్యవేత్త

తేలిన ఫలితం?



2024లో హిందూ రాజ్యం కావాలా, లౌకిక దేశమా అని శామ్ పిట్రోడా అడుగుతున్నారు. నిజానికి అడగాల్సింది ప్రజలను కాదు; నరేంద్ర మోదీకి గెలుపును వెండి పళ్లెంలో ఇస్తుందా, బంగారు పళ్లెంలోనా అని కాంగ్రెస్ నిర్ణయించుకోవాలి.

– అజిత్ దత్తా, రచయిత

రెండు వైపులు



ఉత్తర అరేబియా సముద్రంలో పైరసీని ఎదుర్కోవడానికి జలాంతర్గాములను ఉంచినప్పటికీ, సముద్ర మార్గాలను రక్షించడం నుంచి చైనా దూరంగా ఉంది. జరుగుతున్నది చూస్తూ అది ఆనందిస్తుండవచ్చు (ఇండియా నౌక మీద డ్రోన్ దాడి జరిగిన నేపథ్యంలో). అదే సమయంలో, తనను తాను గొప్ప శక్తిగా ప్రదర్శించుకుంటున్నప్పటికీ, పెద్దగా ఏమీ చేయలేని దాని పరిమితులు కూడా మనకు తెలుస్తున్నాయి.

– యూసఫ్ ఉంఝావాలా, జర్నలిస్ట్

అమ్మ వంటే!



ఈ మధ్య నేను ప్రతిరోజూ తింటున్న భోజనం అమ్మ వండినదే ఉండేట్టుగా చూసుకుంటున్నా. రెస్టారెంట్లు లేవు. ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇవ్వడం లేదు.

– ఓన్యేయా నువేల్వా, నైజీరియా రచయిత

ఇన్ బాక్స్

అక్షింతలతో ఆహ్వానం!

అయోధ్యలో భవ్యమైన శ్రీరాముడి మందిర నిర్మాణం పూర్తి చేసుకొని బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠకు ముహూర్తం సిద్ధమవుతోంది. 2019 నవంబర్ 9న చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా అయోధ్య ‘రామ జన్మభూమి’ విషయంలో సుప్రీం కోర్టులో రామభక్తులు విజయం సాధించారు. తదనంతరం అయోధ్యలో రాముల వారి మందిర నిర్మాణానికి ‘శ్రీరామ క్షేత్ర తీర్థ ట్రస్ట్’ సంకల్పించింది. ప్రస్తుతం రాముల వారి మందిర నిర్మాణం చివరి దశకు చేరుకుంది. విగ్రహ ప్రతిష్ఠ రోజున అందరూ సమీపంలో ఉన్న ఏ హిందూ దేవాలయానికైనా వెళ్లి పూజలు నిర్వహించి పండుగ చేసుకోవాలని... ప్రతి ఇంటికీ వెళ్లి అక్షింతలు అందించి ఆహ్వానం పలకాలని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్ణయించింది. భద్రత, ఇతర కారణాల దృష్ట్యా ఇతర ప్రాంతాల నుంచి జనవరి 22న ఎవరూ అయోధ్యకు రామదర్శనానికి రావద్దనీ, ఆ మరుసటి రోజు నుంచీ రావాలనీ ట్రస్ట్ ఆహ్వానం పలుకుతోంది.

అయోధ్య శ్రీరాముల వారి సన్నిధానంలోంచి అత్యంత భక్తి శ్రద్ధలతో తీసుకువచ్చిన పవిత్రమైన అక్షింతలను ఇంటింటికీ అందించేందుకు సర్వం సిద్ధమయ్యింది. ‘విస్తృత జనసంపర్క్ అభియాన్’ పేరుతో 2024 జనవరి ఒకటి నుంచి 15 వరకు ప్రతి ఇంటికి వెళ్లి ‘నివేదన’ అనే కరపత్రం, అక్షింతలు అందజేసి రాముల వారి దర్శన నిమిత్తం అయోధ్యకు ఆహ్వానం పలికేందుకు రామభక్తులు సిద్ధమయ్యారు. గ్రామాల్లోని ప్రతి దేవాలయాన్ని అందంగా అలంకరించి కూడళ్ళు, చౌరస్తాలు, రద్దీ ప్రాంతాలలో కాషాయ జెండాలతో తోరణాలు కట్టి అందంగా ముస్తాబు చేసేందుకు సిద్ధమవుతున్నారు రామ భక్తులు.

రాముల వారి విగ్రహ ప్రతిష్ఠాపన రోజున సూర్యాస్తమయం తర్వాత, ప్రమిదలతో దీపాలంకరణ చేసి, దీపావళి మాదిరి సంబరాలు చేసుకుంటారు. అన్నప్రసాదాలు, పూలు, పండ్లు, మిఠాయిలు పంచి ఆబాల గోపాలం ఆనందంగా గడిపేలా కార్యక్రమం సిద్ధమవుతోంది. ప్రతి హిందువు ఈ కార్యంలో భాగస్వామి కావాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సాదరంగా ఆహ్వానిస్తోంది. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు అందుకొని రాముడిని తలుచుకుంటూ పూజలు నిర్వహించాలని కోరుతోంది.

– పగుడాకుల బాలస్వామి
ప్రచార ప్రముఖ్, విశ్వహిందూ పరిషత్, తెలంగాణ

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com

సంపూర్ణ స్వరాజ్య స్ఫూర్తికి శతవసంతాలు

1923 డిసెంబర్ 28, 29 తేదీలలో 38వ భారత జాతీయ కాంగ్రెస్ మహా సభలు అప్పటి బ్రిటిషర్లు ‘కోకనాడ’గా పిలుచుకునే కాకినాడ పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ప్రధాన సభలు రెండు రోజుల పాటు జరిగినా, మరో మూడు రోజులపాటు అనుబంధ సంస్థల సమావేశాలు ఇదే ప్రాంగణంలో జరిగాయి. 1916లో జరిగిన ఆంధ్ర ప్రాంత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో జాతీయ మహా సభలు ఈ ప్రాంతంలో నిర్వహించేందుకు అనుమతి నివ్వవలసిందిగా జాతీయ కమిటీకి విజ్ఞప్తి చేశారు. 1922లో గయ (బిహార్)లో జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభలలో ఆంధ్ర కాంగ్రెస్ కమిటీ వారి అభ్యర్థనను ఆమోదించారు.

దేశభక్త కొండా వేంకటప్పయ్య అధ్యక్షులుగా, కాశీనాథుని నాగేశ్వరరావు, టంగుటూరి ప్రకాశం పంతులు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, దువ్వూరి సుబ్బమ్మ ప్రభృతులు ఉపాధ్యక్షులుగా, బులుసు సాంబమూర్తి, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, మరో ఆరుగురు ప్రధాన కార్యదర్శులుగా, లక్కరాజు సుబ్బారావు, పైడా వేంకటచలపతి కోశాధికారులుగా, మరి కొందరు సాధారణ సభ్యులుగా మొత్తం 4,181 మందితో ఆహ్వాన సంఘం ఏర్పడింది.

కాకినాడ పట్టణానికి పడమర భాగంలో ఎల్విన్ పేటకు చెందిన 120 ఎకరాల ప్రదేశాన్ని ‘గాంధీనగరం’గా నామకరణం చేసి సభాస్థలంగా ఎంపిక చేశారు. 150 మంది మహిళలతో పాటు మొత్తం 1,500 మంది వలంటీర్లు సేవలందించారు.

జిల్లా కలెక్టర్ బ్రాకెన్ దొర కాకినాడలో జాతీయ కాంగ్రెస్ సభలు జరగకుండా నిరోధించడానికి ఎన్నో అడ్డంకులు సృష్టించాడు. బ్రిటిష్ ప్రభుత్వంతో శత్రుత్వం పెట్టుకోవద్దనీ, వర్తకుల ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేస్తామనీ హెచ్చరించాడు. ఆహ్వాన సంఘం సమావేశానికి హాజరైనా, విరాళాలిచ్చినా రైతుల పంట పొలాలకు నీటి సరఫరా బంద్ చేస్తామన్నారు. అయినప్పటికీ కలెక్టర్ బెదిరింపులనెవరూ ఖాతరు చెయ్యలేదు. ఫలితంగా తమ పొలాలకు నీరు అందక ఎంతో మంది రైతులు నష్టపోయారు. అలీ సోదరుల్లో ఒకరైన మౌలానా మహమ్మద్ అలీ ఈ సభలకు అధ్యక్షత వహించారు. డిసెంబర్ 28 మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఆయన అధ్యక్షోపన్యాసం సుదీర్ఘంగా నాలుగు గంటలపాటు సాగింది. గాంధీజీ ఎరవాడ జైలులో ఉన్నందు వల్ల ఆయన హాజరు కాలేదు. గాంధీజీ సతీమణి కస్తూర్బాగాంధీ హాజరయ్యారు.

కాకినాడ కాంగ్రెస్ సభలకెన్నో ప్రత్యేకతలున్నాయి. హిందూ– ముస్లిం సమైక్యతకు ఎంతో ప్రాధాన్యమిచ్చింది. మహమ్మద్ అలీతో బాటు ఆయన సోదరుడు షౌకత్ అలీ, తల్లి బీ అమ్మ కూడా పాల్గొన్నారు. స్వాగత ఊరేగింపులో నమాజు సమయం ఆసన్నమైనప్పుడు శ్రోత్రియ బ్రాహ్మణుడైన కాశీభట్ల



కాంగ్రెస్ సేవాదళ్ మొదటి అధ్యక్షుడు నెహ్రూతో కార్యకర్తలు

సుబ్రహ్మణ్య శాస్త్రి ఆహ్వానించి నమాజుకు అవకాశమిచ్చారు. అలాగే టౌన్‌హాల్ ఎదురుగా గల సీతారామాలయంలో పురోహితుడు బొట్టుపెట్టి హారతినిచ్చారు. సభ జరుగుతుండగా అల్లూరి సీతారామరాజు మారువేషంలో వచ్చి ‘వందేమాతరం’ అంటూ బిగ్గరగా అరుచుకుంటూ జనసమూహంలో కలిసిపోయి అదృశ్యమయ్యారని చెబుతారు.

మహాసభల ప్రాంగణంలో 120 దుకాణాలతో వస్తు ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. సందర్శకులకు పావలా (25 పైసలు) ప్రవేశ రుసుముగా నిర్ణయించబడింది. ప్రవేశద్వారం వద్ద టికెట్ తీసుకుని లోనికి అనుమతించే బాధ్యతను దుర్గాబాయ్ (దేశ్‌ముఖ్)కు అప్పగించారు. అప్పటికి ఆమె వయసు పద్నాలుగేళ్ళు మాత్రమే. ఆహ్వాన సంఘం అధ్యక్షులు కొండా వేంకటప్పయ్య, మరికొందరు సభ్యులతో బాటు నెహ్రూ కూడా ఎగ్జిబిషన్ సందర్శనకు విచ్చేశారు. నెహ్రూ దగ్గర టికెట్ లేని కారణంగా దుర్గాబాయ్ ఆయనను అడ్డగించింది. వెంటనే వేంకటప్పయ్య జోక్యం చేసుకుని, ‘ఆయన ఎవరనుకున్నావ్? నెహ్రూ గారు. జాతీయ కాంగ్రెస్‌కు ప్రముఖ నాయకులు’ అంటూ ఆమెను మందలించబోయారు. అప్పుడు నెహ్రూ ‘ఆమె తనకు అప్పగించిన బాధ్యతను నిజాయితీగా నిర్వహించింది. ఇలాంటి అంకితభావం గల వారే నేడు దేశ స్వాతంత్ర్యానికి అవసరం. భవిష్యత్తులో ఈమె గొప్ప నాయకురాలు అవుతుంది’ అంటూ ఆశీర్వదించారు.


అప్పటివరకు ‘సంపూర్ణ స్వరాజ్యం’ భావన పట్ల కాంగ్రెస్ నేతలలో స్పష్టమైన అభిప్రాయం లేదు. అయితే అంతకు ముందు జరిగిన గోదావరి జిల్లా కాంగ్రెస్‌లో బులుసు సాంబమూర్తి ఈ అంశాన్ని ప్రతిపాదించారు. డిసెంబర్‌లో జరిగే జాతీయ సభలో చర్చించాలని తలపెట్టారు. డిసెంబర్ 30న దీనిపై చర్చ జరిగింది. ఆ విధంగా సంపూర్ణ స్వాతంత్ర్యం అనే మహోన్నత ఆశయానికి కాకినాడ కాంగ్రెస్‌లో పునాది పడి, ఆరేళ్ళ తర్వాత 1929లో లాహోర్ (ప్రస్తుతం పాకిస్తాన్) సమావేశంలో ఆమోదం లభించింది. ‘కాంగ్రెస్ సేవాదళం’ విభాగానికి కూడా కాకినాడ కాంగ్రెస్ మహాసభల్లోనే బీజం పడింది. జవహర్‌లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

మహనీయులు నడిచిన నేలపై వందేళ్ల తరువాత కాకినాడ వాసులు శతాబ్ది వేడుకలు నిర్వహించుకుంటున్నారు. అలనాటి మధుర స్మృతులు నెమరువేసుకుంటున్నారు. రాబోయే తరాల వారికి ఈ వారసత్వాన్ని కొనసాగించడానికి మనమంతా కృషి చేయవలసిన తరుణమిది.

– ప్రొఫెసర్ ఐ. దోసగిరిరావు, స్పెషల్ ఆఫీసర్ (రిటైర్డ్), ఆంధ్రా యూనివర్సిటీ కేంపస్, కాకినాడ
(‘కాకినాడ జాతీయ కాంగ్రెస్ సభల’కు నేటితో వందేళ్లు)

హరి నామం

‘... హరి నామములే అన్ని మంత్రములు, హరి హరి హరి హరి హరియనవో మనసా!’ అని పరవశించి పాడాడు పద కవితా పితామహుడు. పురుషార్థాలన్నిటి సాధనకు హరినామ స్మరణమే ఉత్తమ సాధనం అని ఎందరో ఇతర భక్తాగ్రేసరులు కూడా బోధించారు. **‘హరియను రెండక్షరములు/హరియించును పాతకములు, అంబుజనాభా!/ హరి! నీనామ మహత్వము,/ హరిహరి! పొగడంగతరమె, హరి, శ్రీకృష్ణా!’** అని స్తుతిస్తుంది కృష్ణశతకం. భగవన్నామాలూ, పౌరాణిక నామాలూ వ్యుత్పత్తి అర్థాలు లేకుండా ఉండవు. హరి అన్నా, హరుడన్నా, సీతా–గౌరీ– వాగీశ్వరీ అన్నా, ఆ మాటలు ఆయా దేవతల లక్షణాలను సూచించే మాటలే గానీ ఊరికే రెండు మూడు అక్షరాలు యాదృచ్ఛికంగా కలిపేసి ఏర్పరచిన పేర్లు కావు.



జ్యోతిర్మయం

నిఘంటువు హరి అనే పదానికి ముఖ్యంగా రెండు అర్థాలను చూపిస్తుంది. ఒకటి హరి వర్ణం లేక హరిత వర్ణం. రెండవ అర్థం హరించే వాడు, తీసుకొనే వాడు, స్వీకరించే వాడు, మోసుకెళ్ళే వాడు అని. ఈ రెండో అర్థంలో హరి అనే పేరు భక్తుల పాపాలనూ, హృదయాలనూ హరించగల శివ కేశవులకు ఇద్దరికీ వర్తిస్తుంది. ప్రాణాలను హరించే యముడికీ, సౌరభాలను మోసుకెళ్ళే వాయుదేవుడికీ, వస్తువులు ఎత్తుకు పోయే కోతికీ, రౌతులను మోసుకు వెళ్ళే గుర్రానికీ కూడా వర్తిస్తుంది.

హరి అంటే ఆకుపచ్చ రంగు. అంటే నీలం, పసుపూ కలిసిన రంగు. ఒక విధమైన నిగనిగ కల ముదురు దేహచ్ఛాయను కూడా ‘హరి’ వర్ణం, ‘శ్యామ’ వర్ణం అంటారు. (తెల్లని వాడు అంటే కాగితంలా తెల్లని వాడు కానట్టే, హరి వర్ణుడూ అంటే లేత ఆకులాంటి ఆకుపచ్చదనంతో ఉండేవాడని కాదు.)

మరెవరో చెప్పడం కాదు, హరిని ‘హరి’ అని ఎందుకంటారో శ్రీకృష్ణుడే స్వయంగా చెప్పాడు, మహాభారతం శాంతి పర్వంలో. ‘నేను నన్ను స్మరించే భక్తుల పాపాన్ని హరిస్తాను. యజ్ఞాలలో హవిర్భాగాన్ని స్వీకరించి తీసుకువెళ్తాను. అంతే కాదు, నా దేహవర్ణం శ్యామ వర్ణం లేక హరి వర్ణం కావడం వల్ల కూడా, నేను హరి అనే నామంతో పిలవబడుతున్నాను’ అన్నాడు. సమూలంగా సంసార బంధనాలను హరించేవాడు కనక హరి అని విష్ణు సహస్ర నామాలలో వచ్చే ‘హరి’నామానికి ఆదిశంకరుల వ్యాఖ్యానం.

– ఎం. మారుతిశాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.విదియ పూర్తి (24 గంటలు), **నక్షత్రం:** పునర్వసు రా.12.34 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ఉ.11.50 నుండి 1.30 వరకు, **దుర్ముహూర్తం:** ప.10.11 నుండి 10.59 వరకు, తదుపరి ప.2.38 నుండి 3.26 వరకు, **అమృత ఘడియలు:** రా.10.07 నుండి 11.47 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.33, **సూర్యాస్తమయం:** 5.30.

క్లుప్తంగా...

పరమపదనాథుడిగా లక్ష్మీనారసింహుడు



పరమపదనాథుడి అలంకారంలో స్వామివారు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో అధ్యయనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అయిదో రోజైన బుధవారం శ్రీస్వామి వారిని ఉదయం వటపత్రశాయిగా.. రాత్రి పరమపదనాథుడి (వైకుంఠనాథుడు)గా అలంకరించి ఆలయ తిరు మాడ వీధుల్లో ఊరేగించారు. అధ్యయనోత్సవాలు గురువారం ముగియనున్నాయి.

ప్లాస్టిక్ రహితంగా సమ్మక్క సారక్క జాతర



సాక్షి, హైదరాబాద్: సమ్మక్క సారక్క జాతరలో ప్లాస్టిక్ కాలుష్యం లేకుండా చర్యలు తీసుకుంటామని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఉద్యోగులు బుధవారం మంత్రి కొండా సురేఖను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాలాల్లో చెత్త పడేయకుండా ప్రజల్లో చైతన్యం అవసరమన్నారు. ప్రభుత్వం ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ఉంటుందని, తమది ప్రజా ప్రభుత్వమన్నారు. ఎన్నికల హామీ మేరకు ఆరు గ్యారంటీలను అందించి తీరుతామని సురేఖ స్పష్టం చేశారు.

ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి

- పౌరసరఫరాలశాఖ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన డీఎస్ చౌహాన్



సాక్షి, హైదరాబాద్: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని స్థాయిల అధికారులు, సిబ్బంది పనిచేయాలని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్ పేర్కొన్నా రు. పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో బుధవారం ఆయన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పౌరసరఫరాల విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలు, ఆలోచనలకు అనుగుణంగా అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. తాను దాదాపు పదేళ్లపాటు పోలీస్ విభాగానికి పనిచేశానని, ప్రతిచోట సమస్యలు, సవాళ్లుంటాయని వాటిని ఎదుర్కొని పరిష్కరించినప్పుడే మన పనితీరు తెలుస్తుందని పేర్కొన్నారు.

ప్రజాపాలనను విఫలం చేసేందుకు శ్రీనివాస్ గౌడ్ కుట్ర

- తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం వ్యవస్థాపక కార్యదర్శి ఏలూరు శ్రీనివాస రావు ఆరోపణ



పంజగుట్ట (హైదరాబాద్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన కార్యక్రమం కుంటుపడేలా చేసేందుకు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కుట్ర పన్నారని తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం వ్యవస్థాపక కార్యదర్శి ఏలూరు శ్రీనివాసరావు ఆరోపించారు. టీజీవో సమావేశాల పేరుతో అందరూ హైదరాబాద్ రావాలని పిలుపునిచ్చి ప్రజా పాలన కార్యక్రమానికి విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని, ఆయన కుట్రలను తిప్పికొడతామని చెప్పారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో టీజీవో నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ శాఖల నుంచి రావాల్సిన ఆదాయాన్ని దెబ్బతీసేలా వివిధ శాఖల్లో గత అసోసియేషన్ నాయకులకు అనుకూలంగా ఉండే వారితో ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ సమాచారాన్ని కూడా లీక్ చేస్తున్నట్లు తమకు సమాచారం ఉందని, అటువంటి అధికారులు వెంటనే వారి ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించారు. శ్రీనివాస్ గౌడ్ దశాబ్దకాలంగా అసోసియేషన్‌కు ఎన్నికలు జరగకుండా అడ్డుపడి, తన అడుగులకు మడుగులొత్తే వారిని సంఘం బాధ్యులుగా ప్రకటించారని మండిపడ్డారు.

ఎస్సీ వర్గీకరణ అంశం గుర్తుకు రాలేదా?

సీఎం రేవంత్‌కు మందకృష్ణ మాదిగ సూటి ప్రశ్న

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి భేటీలో సుమారు 20 అంశాలు మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు ఎస్సీ వర్గీకరణ అంశం గుర్తుకు రాలేదా? అని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రశ్నించారు. ఉమ్మడి ఏపీ చివరి ఎన్నికల మేనిఫెస్టోలోనే కాంగ్రెస్ వర్గీకరణ అంశం చేర్చినా, పరిష్కారం కోసం చిత్తశుద్ధి చూపించకపోవడం శోచనీయమన్నారు. మాదిగల పట్ల కాంగ్రెస్ వివక్ష చూపుతోందనడానికి ప్రధానితో సీఎం, డిప్యూటీ సీఎంల భేటీయే నిదర్శనమని మందకృష్ణ ఆరోపించారు. బుధవారం ఢిల్లీ తెలంగాణ భవన్‌లో మందకృష్ణ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ వ్యవహారశైలి ఇలాగే ఉంటే ఆ పార్టీకి మాదిగలు దూరమవుతారన్నారు. తెలంగాణ ప్రభుత్వం చొరవ చూపితే సమస్య త్వరగా పరిష్కారం అవుతుందని తెలిపారు.

మాజీ ఐఏఎస్ ఇంటి కబ్జా కేసులో ఐపీఎస్

- భన్వర్‌లాల్ ఇంటిపై నవీన్‌కుమార్ కన్ను
- తన సోదరుడైన సాంబశివరావుతో కలిసి కుట్ర
- ప్రస్తుతం పోలీసు అకాడమీలో పని చేస్తున్న నవీన్
- బాధితుడి భార్య ఫిర్యాదుతో సీసీఎస్‌లో కేసు నమోదు
- నవీన్‌కుమార్‌ను పట్టుకున్న పోలీసులు.. సీఆర్పీసీ 41ఏ నోటీసులు జారీ



నవీన్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: మాజీ ఐఏఎస్ అధికారి భన్వర్‌లాల్ ఇంటిని నకిలీ పత్రాలతో కబ్జా చేయడానికి యత్నించిన కేసులో ఐపీఎస్ అధికారి నవీన్‌కుమార్ భట్ నిందితుడిగా ఉన్నారు. భన్వర్‌లాల్ భార్య మణి లాల్ ఫిర్యాదుతో హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) అధికారులు నమోదు చేసిన ఈ కేసులో ప్రాథమికంగా నవీన్‌కుమార్‌తోపాటు ఆయన సోదరుడు ఒ.సాంబశివరావు పేర్లు మాత్రమే ఉన్నాయి. దర్యాప్తు నేపథ్యంలో సాంబశివరావు భార్య రూపా డింపుల్ పేరు వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే సాంబశివరావు దంపతులను అరెస్టు చేసిన పోలీసులు తాజాగా బుధవారం నవీన్‌కుమార్‌ను పట్టుకున్నారు. ఈయన్ను సీసీఎస్‌కు తరలించి విచారణ అనంతరం సీఆర్పీసీ 41ఏ నోటీసులు జారీ చేసి పంపారు. ప్రస్తుతం తెలంగాణ స్టేట్ పోలీసు అకాడమీలో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న నవీన్‌కుమార్.. గతంలోనూ పలు వివాదాలకు కేంద్రబిందువు అయ్యారు. వీరు క్రిమినల్ వ్యవహారాన్ని సివిల్ వివాదంగా మార్చాలని చూశారని పోలీసులు చెప్పారు.

ఇల్లు ఖాళీ చేయాలని అడిగినా...

ఓల్డ్ అల్వాల్‌లోని అద్దె ఇంట్లో నివసిస్తున్న భన్వర్‌లాల్‌కు జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో సొంత ఇల్లు ఉంది. సాంబశివరావు 2014 అక్టోబర్ 14న భన్వర్‌లాల్‌ను సంప్రదించి, నవంబర్ 1 నుంచి ప్రశాసన్‌నగర్‌లోని ఇంటిని ఐదేళ్ల పాటు అద్దెకు తీసుకుంటూ ఒప్పందం చేసుకున్నారు. 2019లో భన్వర్‌లాల్ పదవీ విరమణ చేయడంతో ప్రభుత్వ క్వార్టర్స్‌ను ఖాళీ చేయాల్సి వచ్చింది. దీంతో తమ ఇల్లు ఖాళీ చేయాలని భన్వర్‌లాల్ కోరినప్పటికీ సాంబశివరావు స్పందించలేదు. ఈ క్రమంలో ఆ ఇంట్లో ఐపీఎస్ అధికారి నవీన్‌కుమార్ కూడా ఎలాంటి రెంటల్ అగ్రిమెంట్ లేకుండా ఉంటున్నట్లు వీళ్లు గుర్తించారు. 2020 జనవరి నుంచి అద్దె చెల్లించడం ఆపేశారు. అయితే 2020 సెప్టెంబర్ 18న సాంబశివరావు రూ.11,10,000కు మూడు పోస్టు డేటెడ్ చెక్‌లు ఇచ్చారు. ఈ చెక్కులను భన్వర్‌లాల్ డిపాజిట్ చేయగా... అకౌంట్‌లో నగదు లేని కారణంగా బౌన్స్ అయ్యాయి. దీంతో భన్వర్‌లాల్ కోర్టులో ఎన్‌ఐ యాక్ట్ కింద కేసు దాఖలు చేశారు. అయితే 2020 నవంబర్ 12న భన్వర్‌లాల్‌కు లీగల్ నోటీసు పంపిన సాంబశివరావు అందులో తప్పుడు ఆరోపణలు చేయడంతోపాటు తమకు రూ.49.3 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనిపైనా భన్వర్‌లాల్ సివిల్ కేసు ఫైల్ చేశారు. అయితే సాంబశివరావు, నవీన్‌కుమార్ ఇద్దరూ ఆ ఇంటిని కబ్జా చేసేందుకు నకిలీ పత్రాలు సృష్టించారు. ఆ ఇంటి లీజును మరో 20 ఏళ్లకు పెంచినట్లు, హ్యాండ్ లోన్‌గా భారీ మొత్తం తీసుకున్నట్లు పత్రాలను తయారు చేశారు. ఇలా ఆ ఇంటిపై సివిల్ వివాదం సృష్టించి కబ్జా చేయాలని యత్నించారు.

రూ.42 లక్షల అద్దె నష్టం

ఈ పరిణామాలతో భన్వర్‌లాల్ రూ.42 లక్షల అద్దె నష్టపోవడంతోపాటు తీవ్ర మానసిక వేదనకు గురై అనారోగ్యం పాలయ్యారు. సుదీర్ఘకాలం ఐఏఎస్‌గా ప్రజలకు సేవ చేసి, సొంత ఇల్లు ఉండి కూడా అద్దె ఇంట్లో ఉండాల్సిన స్థితికి చేరారు. దీనిపై ఆయన భార్య మణి లాల్ ఈ ఏడాది నవంబర్ 17న పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన అధికారులు ఫోర్జరీ పత్రాలను సృష్టించడంలో అడ్వొకేట్ అయిన సాంబశివరావు భార్య రూపా డింపుల్ పాత్ర ఉన్నట్లు గుర్తించారు. వారిద్దర్నీ ఈ నెల 22న అరెస్టు చేశారు. పరారీలో ఉన్న నవీన్‌కుమార్‌ను బుధవారం పట్టుకుని విచారించి నోటీసులు జారీ చేశారు. నవీన్‌కుమార్ గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎస్పీగా పని చేశారు. అప్పట్లో ఆయనపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఉమ్మడి రాష్ట్రంలో తూర్పుగోదావరి ఏఎస్పీగా పనిచేస్తూ ఎస్పీతో జరిగిన ఘర్షణ నేపథ్యంలో సస్పెండ్ కూడా అయ్యారు.

అన్ని వివరాలు చెబుతా

నేను ఏ తప్పు చేయలేదు. ఈ విషయం కోర్టులో ఉంది. సివిల్ మ్యాటర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల కోసం నన్ను సీసీఎస్‌కు పిలిచారు. నా దగ్గర ఉన్న సమాచారమంతా ఇచ్చా. 2020 నుంచి ఈ వివాదం నడుస్తోంది. గురువారం అన్ని వివరాలు వెల్లడిస్తా. లీగల్‌గా ముందుకెళ్తా.

– నవీన్‌కుమార్, ఐపీఎస్

నా తండ్రికి సంబంధం లేదు

ఈ వ్యవహారంలో నా తండ్రికి ఎలాంటి సంబంధం లేదు. ఇది పోలీసు కిడ్నాప్ లాగా జరిగింది. ఓ ఐపీఎస్ అధికారికే ఇలా జరిగితే ఈ నగరంలో సామాన్యులు ఎలా బతుకుతారు. నోటీసులు ఇవ్వకుండా, సమాచారం లేకుండా అదుపులోకి తీసుకున్నారు. మా కుటుంబానికి న్యాయం కావాలి.

–సాకేత్, నవీన్‌కుమార్ కుమారుడు

11.08 లక్షల ఎకరాల్లో పంటల సాగు

- రాష్ట్ర ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ నివేదిక

సాక్షి, హైదరాబాద్: యాసంగి సీజన్‌లో ఇప్పటివరకు 11.08 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ తెలిపింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈ సీజన్‌లో అన్ని పంటల సాధారణ సాగు విస్తీర్ణం 54.93 లక్షల ఎకరాలు కాగా, 20.19 శాతం విస్తీర్ణంలో సాగైనట్లు వ్యవసాయశాఖ తెలిపింది. గత యాసంగి సీజన్‌లో ఇదే సమయానికి 12.39 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా, ఈసారి తక్కువగా నమోదు కావడం గమనార్హం. వరి సాధారణ సాగు లక్ష్యం 40.50 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.93 లక్షల ఎకరాల్లో నాట్లు వేశారు. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే చాలావరకు నాట్లు తక్కువగానే పడ్డాయి. గతేడాది వరి నాట్లు ఇదే సమయానికి 3.37 లక్షల ఎకరాల్లో వేశారు. ఇక పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 4.21 లక్షల ఎకరాలు కాగా, అందులో ఇప్పటివరకు 2.70 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. వాటిల్లో శనగ 2.38 లక్షల ఎకరాల్లో సాగైనట్లు వ్యవసాయశాఖ తెలిపింది. ఇక వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 2.77 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 1.80 లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 5.11 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.50 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగైంది.

బినామీ విత్తన కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టండి

- అధికారులకు వ్యవసాయ మంత్రి తుమ్మల ఆదేశం



సాక్షి, హైదరాబాద్: విత్తన కంపెనీలకు సరైన మౌలిక సదుపాయాలు లేకున్నా, బినామీ పేర్లతో ఉన్న విత్తన కంపెనీలను గుర్తించి వాటిని బ్లాక్ లిస్టులో పెట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. రైతులకు ఎలాంటి విత్తన కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణలో పండని విత్తనాలను పక్క రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాలని సూచించారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా పత్తి సేకరణ జరిగేలా, పత్తి కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు. పత్తి గింజల నుంచి నూనె సేకరించే యూనిట్లను స్థాపించడానికి పరిశ్రమల శాఖతో సంప్రదించి తగిన చర్యలు తీసుకోవలసిందిగా సూచించారు.

మీ వాదనలనూ వింటాం

- ‘దిశ’ఎన్‌కౌంటర్ కేసులో పోలీసుల పిటిషన్లను అనుమతించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసులో పోలీసుల వాదనలనూ వింటామంటూ.. వారు దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు అనుమతించింది. తుది విచారణలో భాగంగా అందరి వాదనలు వింటామంది. నిందితులు జొల్లు నవీన్, శివ, చెన్నకేశవులు, మహమ్మద్ ఆరీఫ్ ఎన్‌కౌంటర్‌పై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరుతూ పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు (పిల్) దాఖలయ్యాయి. అయితే ఈ పిటిషన్లలో తమను కూడా ప్రతివాదులుగా చేర్చుకోవాలని, తమ వాదనలు వినాలని కోరుతూ పోలీసులు, దిశ తండ్రితోపాటు మరికొందరు మధ్యంతర పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అంతకుముందు విచారణ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. పోలీసులపై ఐపీసీ సెక్షన్ 302కు బదులు 307 కింద కేసు నమోదు చేయడం సుప్రీంకోర్టు ఉత్తర్వులకు విరుద్ధమన్నారు. పోలీసుల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. నాలుగేళ్ల క్రితం జరిగిన ఈ ఘటనపై సిట్ నివేదిక ఇచ్చిందన్నారు. మళ్లీ ఇప్పుడు కోర్టు జోక్యం చేసుకోవడం సరికాదని, అది వారి వృత్తితోపాటు వ్యక్తిగత జీవితంపైనా ప్రతికూల ప్రభావం చూపుతుందని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. ‘ఒకసారి దర్యాప్తు పూర్తయి నివేదిక సమర్పించాక మళ్లీ ఎఫ్ఐఆర్ నమోదు చేయమనే పరిధి, అధికారం మేజిస్ట్రేట్‌కు ఉండదు. అయితే సీఆర్‌పీసీ సెక్షన్ 482, రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 కింద విచక్షణాధికారం మేరకు కేసును కొట్టివేయడానికి, సీబీఐ దర్యాప్తునకు ఆదేశించే పరిధి ఈ కోర్టుకు ఉంటుంది. పిటిషనర్లు సీబీఐ దర్యాప్తును కోరుతున్నారు. నిబంధనల మేరకు కోర్టు ముందుకొచ్చిన పిటిషన్‌ను వినాలి. అలాగే పారదర్శక విచారణ కోసం పోలీసుల వాదనలనూ వింటాం’అని చెప్పింది.

ఆరు వారాల్లో సమాచార కమిషనర్లను నియమిస్తాం

- హైకోర్టుకు వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అత్యంత కీలకమైన సమాచార ప్రధాన కమిషనర్ (సీఐసీ), సమాచార కమిషనర్(ఐసీ) నియామకానికి కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉందని, దీనికి ఆరు వారాలు సమయం కావాలని హైకోర్టును రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ప్రభుత్వం మారిన నేపథ్యంలో అధికారులు, ప్రభుత్వ, ప్రతిపక్ష నేతలతో కమిటీ ఏర్పాటు కావాల్సి ఉందని పేర్కొంది. దీంతో హైకోర్టు తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది. కొన్ని నెలలుగా సీఐసీ, ఐసీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రభుత్వం నియామకం చేపట్టడం లేదని పేర్కొంటూ హైకోర్టులో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ పిల్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటై కొద్ది రోజులే అయినందున సీఐసీ, ఐసీలను ఎంపిక చేసే కమిటీ ఏర్పాటుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు నివేదించారు.

పీజీ ఇంకా ఈజీ

▶ మొదటి పేజీ తరువాయి

అమలు చేయబోతున్నారు. ఏకీకృత విద్యా విధానం అమలు చేయడం, స్కోర్ బ్యాంకులు ఏర్పాటు చేయడం ఎన్ఈపీలో భాగం. దీనివల్ల విదేశాలకు వెళ్లినా ఆన్‌లైన్ ద్వారా విద్యార్థి స్థాయిని లెక్కగట్టే వీలుంది. టెన్త్ వరకు ఒక గ్రేడ్, ప్లస్ టూకు మరో గ్రేడ్, డిగ్రీ, పోస్టు-గ్రాడ్యుయేషన్‌కు ఇంకో గ్రేడ్ ఇస్తారు. దీన్నిబట్టి స్కిల్, అన్ స్కిల్ విభజన చేస్తారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మూడేళ్ల డిగ్రీతో పాటు పీజీ కూడా చేసే సమీకృత విధానం అందుబాటులోకి తెస్తారు. అంటే నాలుగేళ్ల డిగ్రీ చేసిన విద్యార్థి ఏడాది పీజీ చేస్తే సరిపోతుంది.

ఆన్‌లైన్‌లోనూ అవకాశం

ఏడాది పీజీ కోర్సులను ఆన్‌లైన్ ద్వారా కూడా చేసే వెసులుబాటు కొత్త విధానంలో తీసుకురాబోతున్నారు. నాలుగేళ్ల డిగ్రీలో అవసరమైన సాంకేతిక అంశాలను చేరుస్తారు. ముఖ్యంగా అన్ని గ్రూపుల్లో కంప్యూటర్ అనుసంధాన సిలబస్‌ను ప్రవేశపెట్టాలన్నది యూజీసీ ఆలోచన. డిగ్రీలో అవసరమైన పారిశ్రామిక భాగస్వామ్య ఇంటర్న్‌షిప్ ఉంటుంది. విద్యార్థి ఈ దశలోనూ ప్రాక్టికల్ నాలెడ్జ్ పొందుతారు. ఈ కారణంగా పోస్టు గ్రాడ్యుయేషన్ ఫీల్డ్ వర్క్ కొంత తగ్గుతుంది. కాబట్టి ఆన్‌లైన్ ద్వారా పీజీ చేసినా విద్యార్థిలో నాణ్యత తగ్గే అవకాశం లేదని యూజీసీ విశ్లేషిస్తోంది. ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి తేవడం వల్ల ఇతర దేశాల్లో పీజీ కోర్సులను చేసే వీలుందని యూజీసీ వర్గాలు అంటున్నాయి. పీజీ విద్యలో ఇది గుణాత్మక మార్పు తెస్తుందని చెబుతున్నాయి.

జెడ్పీ చైర్‌పర్సన్‌లుగా ఎస్టీలను నియమించాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో మహాధర్నా



మాట్లాడుతున్న ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

ఆసిఫాబాద్: కుమురంభీం ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ చైర్‌పర్సన్‌లుగా ఎస్టీలను నియమించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కుమురంభీం జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌లోని కలెక్టరేట్ ఎదుట బీఎస్పీ, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ...పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఏజెన్సీలో ఎస్టీలకు రిజర్వ్ చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ స్థానాల్లో జనరల్ అభ్యర్థులను తాత్కాలిక చైర్మన్‌లుగా నియమించడం గిరిజనుల హక్కులను కాలరాయడమేనన్నారు. దీనిపై ఈ నెల 18న రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. కుమురంభీం, కొత్తగూడెం జిల్లాలకు జెడ్పీ చైర్‌పర్సన్‌లుగా గిరిజనులను ఎన్నుకోని పక్షంలో జనవరి 10 తర్వాత బీఎస్పీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు.

తల్లీకూతురు ఆత్మహత్య

- మందమర్రి పట్టణంలో ఘటన



ధనలక్ష్మి, జీవని, సిద్ధు

మందమర్రి రూరల్: మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో బుధవారం తల్లీకూతురు ఆత్మహత్య చేసుకున్నారు. మందమర్రి పోలీసుస్టేషన్ పరిధిలోని దీపక్ నగర్ నలంద కాలనీలో మహేందర్ దేవర మురుగన్ తన భార్య ధనలక్ష్మి (36), కూతురు జీవని(16), కుమారుడు సిద్ధుతో కలసి నాలుగేళ్లుగా అద్దెకు ఉంటున్నాడు. తమిళనాడు రాష్ట్రం మధురై జిల్లా ఉస్లాంబట్టి గ్రామం నుంచి వలస వచ్చి స్థానికంగా అప్పడాల తయారీ వ్యాపారం చేస్తూ జీవిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఐదు, ఆరు గంటల సమయంలో రోజూ మాదిరిగానే మురుగన్ అప్పడాలు చేసుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లగా.. తల్లీ ఇద్దరు పిల్లలు ఇంట్లోనే ఉన్నారు. బుధవారం ఉదయం సిద్ధు నిద్రలేచి చూసేసరికి ముందు గదిలో తల్లి ధనలక్ష్మి, అక్క జీవని ఉరేసుకుని వేలాడుతూ కనిపించారు. ఈ సమాచారం అందుకున్న మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సిద్ధును వివరాలు అడిగి తెలుసుకున్నారు. మురుగన్ మంగళవారం సాయంత్రమే ఇంటి నుంచి బయటకు వెళ్లినట్టు సమాచారం ఉందని, అదే రోజు రాత్రి సుమారు పది గంటల ప్రాంతంలో బెల్లంపల్లి సమీపంలోని ఆకెనపల్లి సెల్ టవర్ పరిధిలో మొబైల్ స్విచ్ఛాఫ్ అయినట్లు రికార్డు అయిందని తెలిపారు. కాగా, వారికి ఏవైనా ఆర్థిక ఇబ్బందులు తలెత్తి ఉండవచ్చని మృతురాలి తల్లిదండ్రులు చెప్పారని ఆయన అన్నారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఆత్మహత్యగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘటనపై పలు అనుమానాలు

తల్లీకూతురు ఒకే చోట ఉరేసుకుని చనిపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మురుగన్ మంగళవారం నుంచి కనిపించకుండా పోవడం, మొబైల్ స్విచ్ఛాఫ్ కావడంతో ఏం జరిగి ఉంటుందోననే అనుమానాలు రేకెత్తుతున్నాయి. మురుగన్ ఎక్కడున్నాడనే విషయమై పోలీసులు ఆరా తీస్తున్నారు.

వెహికిల్స్‌కు నో ఎంట్రీ.. ఎందుకంటే ఇది...

కిస్సింగ్ బ్రిడ్జి

వియత్నాంలో నిర్మాణం ● పర్యాటకుల విశేషాదరణ



వియత్నాంలో అది అనగనగా ఓ వంతెన. కానీ దాన్ని కట్టింది అన్ని వంతెనల మాదిరిగా అటూ ఇటూ దాటడానికి కాదు. ముద్దులు పెట్టుకోవడానికి! అవును. వినడానికే విచిత్రంగా ఉంది కదూ! దక్షిణ వియత్నాంలోని ఫూక్వోక్ ద్వీపం అందమైన బీచ్‌లకు ప్రసిద్ధి. అక్కడి సన్‌సెట్ సిటీలో ఇటీవల నిర్మించిన 800 మీటర్ల పై చిలుకు పొడవైన బ్రిడ్జి అందరినీ ఎంతగానో అలరిస్తోంది. ఇది ముద్దుల బ్రిడ్జి కావడమే ఇందుకు కారణం. దీని డిజైన్‌ను ఇటలీకి చెందిన ఆర్కిటెక్ట్ మార్కో కాసామోంటీ రూపొందించాడు. లగ్జరీ టూరిజం డెవలపర్ సంస్థ సన్ గ్రూప్ నిర్మించింది. ఆడమ్ సృష్టికి సంబంధించి ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు మైకేలాంజిలో సిస్టిన్ చాపెల్‌లో సృజించిన ఫ్రెస్కో పెయింటింగ్ స్ఫూర్తితో దీని డిజైన్‌కు రూపకల్పన చేశారు. రెండు సగాలుగా ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగింది. ఆ పెయింటింగ్‌లోని రెండు చూపుడు వేళ్ల మాదిరిగానే బ్రిడ్జి తాలూకు రెండు సగాలు కూడా పరస్పరం తాకవు. వాటి మధ్య 30 సెంటీమీటర్ల దూరముంటుంది. దూరం నుంచి చూస్తే ఆ రెండు కొనలూ ఒకదాన్నొకటి చుంబించుకుంటున్నట్టుగానే ఉండటం మరో విశేషం! ముద్దులాడాలనుకునే జంటలో ఒకరు ఆ సగం నుంచి, మరొకరు ఈ సగం మీద నుంచుని వీలైనంతగా ముందుకు వంగాలన్నమాట! ఆ మీదట పెదాలకు పని చెబుతూ తమ ప్రేమను వ్యక్తపరుచుకోవచ్చు. పెళ్లికి ప్రపోజ్ చేసుకోవచ్చు. ఈ బ్రిడ్జి పేరు చౌ హోన్. దాని అర్థం కూడా 'పెళ్లికి ప్రపోజ్ చేసుకోవడం' కావడం మరో విశేషం. వారం క్రితం ప్రారంభించిన ఈ బ్రిడ్జి చూస్తుండగానే ఇంటర్నెట్ సెన్సేషన్‌గా మారింది. దాన్ని చూడటానికి, చెరోవైపు నుంచి రొమాంటిక్‌గా ముద్దులాడటానికి జంటలు భారీగా వస్తున్నాయట!

\- సాక్షి, నేషనల్ డెస్క్

రాహుల్ గాంధీ 'భారత్ న్యాయ యాత్ర'

- తూర్పు నుంచి పశ్చిమ భారతదేశానికి బస్సుయాత్ర, పాదయాత్ర
- జనవరి 14న ప్రారంభం
- మణిపూర్‌లో శ్రీకారం.. మార్చి 20న ముంబైలో ముగింపు
- 14 రాష్ట్రాల మీదుగా 67 రోజుల్లో 6,200 కిలోమీటర్లు

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మరో సుదీర్ఘయాత్రకు సన్నద్ధమవుతున్నారు. వచ్చే ఏడాది జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ నూతన జవసత్వాలు అందించే దిశగా రెండో విడత యాత్రకు శ్రీకారం చుట్టబోతున్నారు. 'భారత్ న్యాయ యాత్ర' పేరిట తూర్పున మణిపూర్ నుంచి పశ్చిమాన మహారాష్ట్ర వరకు పాదయాత్ర జరుగనుందని కాంగ్రెస్ వర్గాలు బుధవారం వెల్లడించాయి. వచ్చే ఏడాది జనవరి 14న మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో ప్రారంభం కానున్న ఈ యాత్ర 67 రోజుల పాటు కొనసాగి, మార్చి 20వ తేదీన మహారాష్ట్ర రాజధాని ముంబైలో ముగుస్తుంది. దేశ ప్రజలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయాన్ని అందించడమే ధ్యేయంగా రాహుల్ గాంధీ భారత్ న్యాయ యాత్ర చేపట్టనున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తెలిపారు. ఈ యాత్రను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇంఫాల్‌లో జెండా ఊపి ప్రారంభిస్తారు. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్టానం షెడ్యూల్ ఖరారు చేసింది. రెండో విడత యాత్ర చేపట్టాలని రాహుల్ గాంధీని కోరుతూ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఈ నెల 21న ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించిన సంగతి తెలిసిందే.

చాలావరకు బస్సు యాత్ర.. అవసరమైన చోట పాదయాత్ర

రాహుల్ గాంధీ తన తొలి విడత భారత్ జోడో యాత్రను 2022 సెప్టెంబర్ 7న తమిళనాడులోని కన్యాకుమారిలో ప్రారంభించారు. 12 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల గుండా 136 రోజులపాటు 3,970 కిలోమీటర్లు మేర పాదయాత్ర చేశారు. ఈ ఏడాది జనవరి 30న జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో యాత్ర ముగిసింది. మొదటి యాత్రకు కొంత భిన్నంగా చాలావరకు బస్సు ద్వారా భారత్ న్యాయ యాత్ర చేపట్టనున్నప్పటికీ, అవసరమైన చోట పాదయాత్ర సైతం ఉంటుందని ఏఐసీసీ వర్గాలు వెల్లడించాయి. ఈ యాత్ర 14 రాష్ట్రాల్లోని 85 జిల్లాల మీదుగా మొత్తం 6,200 కిలోమీటర్ల మేర సాగనుంది. మణిపూర్‌లో ప్రారంభమై నాగాలాండ్, అస్సాం, మేఘాలయా, పశ్చిమ బెంగాల్, బిహార్, జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, గుజరాత్ రాష్ట్రాల మీదుగా కొనసాగి మహారాష్ట్రలో ముగియనుంది. భారత్ జోడోయాత్ర 136 రోజులపాటు 3,970 కిలోమీటర్లు జరిగింది. భారత్ న్యాయ యాత్ర 67 రోజుల్లోనే 6,200 కిలోమీటర్లు సాగనుంది.

ఈశాన్య రాష్ట్రాల ప్రజల గాయాలు మాన్పాలన్నదే ఆకాంక్ష

ఇటీవల నెలల తరబడి హింసాత్మక సంఘటనలు చోటుచేసుకుంటున్న మణిపూర్ నుంచి యాత్రను ప్రారంభిస్తుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. బాధితులకు తమ పార్టీ అండగా ఉంటుందన్న సందేశాన్ని ప్రజలకు చేరవేయడమే కాంగ్రెస్ పెద్దల ఉద్దేశమని తెలుస్తోంది. ఈశాన్య రాష్ట్రాల ప్రజల గాయాలను మాన్పాలన్నదే తమ ఆకాంక్ష అని కాంగ్రెస్ అగ్రనేత కె.సి.వేణుగోపాల్ వివరించారు. యాత్ర సందర్భంగా 12 బహిరంగ సభల్లో రాహుల్ ప్రసంగిస్తారు. 100కుపైగా స్ట్రీట్-కార్నర్ సమావేశాలు ఉంటాయి. 13 ప్రెస్ కాన్ఫరెన్స్‌లు సైతం నిర్వహిస్తారు. మహిళలు, యువతతోపాటు అణగారిన వర్గాల ప్రజలతో ముఖాముఖి భేటీ అవుతారు. పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ నెల 28న మహారాష్ట్రలోని నాగపూర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు జైరామ్ రమేశ్ తెలిపారు. ఈ సభకు హమ్ తయ్యార్ హై(మేము సిద్ధంగా ఉన్నాం) అని నామకరణం చేసినట్లు పేర్కొన్నారు.



రెజ్లర్ బజరంగ్ పూనియాతో సరదాగా కుస్తీ పడుతున్న రాహుల్

అఖాడాలో ఒక రోజు...

- రెజ్లర్లతో గడిపిన రాహుల్
- బజరంగ్‌తో సరదా కుస్తీ

చండీగఢ్: అది హరియాణాలోని జజ్జర్ జిల్లా ఛర్రా గ్రామంలోని వీరేంద్ర అఖాడా. ఉదయం ఆరు గంటల సమయం. ఒలింపిక్ పతక విజేత బజరంగ్ పునియా తదితర రెజ్లర్లంతా సాధనలో మునిగిపోయారు. చలి వణికిస్తున్న ఆ సమయంలో విచ్చేసిన ఓ అనుకోని అతిథి వారందరినీ ఆశ్చర్యపరిచారు! తనతో కుస్తీ పట్టాల్సిందిగా బజరంగ్‌ను సవాల్ చేశారు. తన కుస్తీ నైపుణ్యంతో అతడిని, ఇతర రెజ్లర్లను ఆశ్చర్యపరిచిన ఆ అతిథి మరెవరో కాదు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ! ఆకస్మిక యాత్రలకు పెట్టింది పేరైన రాహుల్‌గాంధీ ఈసారి రెజ్లర్ల కార్యస్థలి అయిన 'అఖాడా'ను సందర్శించారు. బుధవారం ఉదయం ఆరింటికి అఖాడాకు వెళ్లిన ఆయన బజరంగ్ పునియా, దీపక్ పునియా తదితర రెజ్లర్లతో కాసేపు సరదాగా గడిపారు. బజరంగ్‌తో సరదాగా కుస్తీ పట్టారు. తనతో బజరంగ్ కుస్తీ పడుతున్న, అతని చేతుల్లో తాను మట్టి కరుస్తున్న ఫొటోలను 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ''ఇప్పుడు మనందరి ముందున్నది ఒకే ఒక్క ప్రశ్న. ఈ ఆటగాళ్లంతా మన దేశ పుత్రులు, పుత్రికలు. కానీ రింగ్‌లో పోటీ పడాల్సిన వాళ్లు వీధులకెక్కి తమ హక్కుల కోసం, న్యాయం కోసం పోరాడుతున్నారు. ఇదంతా చూశాక ఎవరైనా తమ పిల్లలను రెజ్లింగ్ లాంటి క్రీడల్లో ఎలా ప్రోత్సహిస్తారు?. ఈ క్రీడాకారిణులంతా రైతు కుటుంబాల నుంచి వచ్చిన ముక్కుసూటి అమాయక మనుషులు. వారి గౌరవమర్యాదలను వారికి దక్కనిద్దాం. సగర్వంగా దేశానికే సేవ చేయనిద్దాం'' అని ట్వీట్‌చేశారు. లైంగిక వేధింపుల ఉదంతంపై పలువురు మహిళా రెజ్లర్లు చాలా రోజులుగా రెజ్లింగ్ ఫెడరేషన్‌తో పోరాడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారిని రాహుల్ కలిశారు.

> **బాగా కుస్తీ పట్టారు: బజరంగ్**
>
> రెజ్లర్ల రోజువారీ రొటీన్ ఎలా ఉంటుందో స్వయంగా చూసేందుకు రాహుల్ ఆకస్మికంగా తమ అఖాడాకు వచ్చారని దీపక్ పునియా చెప్పారు. ''రాహుల్ నాతో బాగా కుస్తీ పట్టారు. రెజ్లింగ్‌పై ఆయనకున్న అవగాహన మమ్మల్ని ఆశ్చర్యపరిచింది. పలు రెజ్లింగ్ టెక్నిక్‌లు ఆయనకు తెలుసు'' అని బజరంగ్ చెప్పారు. వారిద్దరూ వీరేంద్ర అఖాడాలో రెజ్లింగ్‌లో ఓనమాలు దిద్దుకున్నారు.

సజ్జ రొట్టెలు తిన్నారు

అఖాడాలో రాహుల్ రెండు గంటలకుపైగా గడిపారని స్థానిక కాంగ్రెస్ చెప్పారు. ''ఆటగాళ్లతో కలిసి రాహుల్ సజ్జ రొట్టెలు, ఆకుకూర తిన్నారు. పాలు తాగారు. ఆటగాళ్లు ప్రేమతో ఇచ్చిన స్థానిక కూరగాయలు తనతో పాటు తీసుకెళ్లారు'' అని వెల్లడించారు. రెజ్లింగ్ సమాఖ్య గొడవలను ఆటగాళ్లు రాహుల్ దృష్టికి తెచ్చారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుని చేతిలో లైంగిక వేధింపులకు గురైన మహిళా రెజ్లర్లకు న్యాయం జరగకపోవడం తమను తీవ్ర మానసిక వేదనకు గురి చేస్తోందని బజరంగ్, దీపక్ తదితరులు చెప్పారని వివరించారు. ఆకస్మిక పర్యటనలు రాహుల్‌కు కొత్తేమీ కాదు. ట్రక్కు డ్రైవర్ల సమస్యలు తెలుసుకునేందుకు గత మే నెలలో ఢిల్లీ నుంచి చండీగఢ్‌కు ట్రక్కులో ప్రయాణించారు. జూలైలో హరియాణాలోని సోనేపట్‌లో పంటపొలాల్లో దిగి అక్కడ పొలం పనులు చేసుకుంటున్న మహిళలతో ఆయన మాటలు కలిపారు.

మనసులు గెలవండి

సైనికులకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ పిలుపు

రాజౌరీ/జమ్మూ: జమ్మూ కశ్మీర్ నుంచి ఉగ్రవాదాన్ని సైన్యం కూకటి వేళ్లతో పెకిలించి వేస్తుందని తమకు పూర్తి విశ్వాసముందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. అయితే ఆ క్రమంలో పౌరులను ఇబ్బంది పెట్టే ఎలాంటి పొరపాట్లకూ తావీయొద్దని సైనిక బలగాలకు సూచించారు. విధులు నిర్వహిస్తూనే ప్రజల మనసులూ గెలవడం సైనికుల బాధ్యతని గుర్తెరగాలన్నారు. బుధవారం ఆయన జమ్మూ కశ్మీర్‌లో ఒక్క రోజు పర్యటనలో పాల్గొన్నారు. రాజౌరీ ఆర్మీ క్యాంప్‌లో సైనికులనుద్దేశించి ప్రసంగించారు. కశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఇటీవల నలుగురు సైనికులు ఉగ్ర దాడిలో మరణించడం, విచారణ కోసమని భద్రతా దళాలు తీసుకెళ్లిన ఎనిమిది మంది పౌరుల్లో ముగ్గురు మరణించడం తెలిసిందే. ఆ ముగ్గురు బాధితుల కుటుంబసభ్యులను మంత్రి కలిసి ఓదార్చారు. కుటుంబాలకు పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లతో పాటు భద్రతా పరిస్థితులను మంత్రి సమీక్షించారు.



జమ్మూకశ్మీర్‌లోని ప్రభుత్వ సైనిక వైద్య కళాశాలలో బాధితులను పరామర్శిస్తున్న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



బెంగళూరులో ఇంగ్లిష్ ఫ్లెక్సీని చించివేస్తున్న కార్యకర్త

'కన్నడ' బోర్డుల రగడ

బనశంకరి: వాణిజ్య, వ్యాపార సంస్థల కార్యాలయంపై దర్శనమిచ్చే సైన్‌బోర్డు, నేమ్‌ప్లేట్ల(నామఫలకాల)లో 60 శాతం బోర్డులు కన్నడలోనే ఉండాలనే బృహత్ బెంగళూరు మహానగర పాలిక(బీబీఎంపీ) నిబంధన తాజాగా బెంగళూరు నగరంలో బోర్డుల విధ్వంసానికి దారితీసింది. కన్నడ నగరంలో వ్యాపారం చేసే వారు ఎవరైనా సరే తమ కార్యాలయం బోర్డును కన్నడ భాషలోనే పెట్టుకోవాలంటూ కర్ణాటక రక్షణ వేదిక(ఎన్‌జీ) కార్యకర్తలు బుధవారం బెంగళూరులో ర్యాలీలతో వీరంగం సృష్టించారు. ఇంగ్లిష్‌లో కనిపించిన ప్రతీ సైన్ బోర్డును ధ్వంసంచేశారు. కొన్నింటిపై నలుపు రంగు పూశారు. రంగంలోకి దిగిన పోలీసులు కేఆర్‌వీ కన్వీనర్ టీఏ నారాయణ గౌడను అదుపులోకి తీసుకున్నారు. ఈ వివాదంపై బృహత్ బెంగళూరు మహానగర ఉన్నతాధికారి తుషార్ గిరినాథ్ స్పందించారు. సైన్ బోర్డు, నేమ్‌ప్లేట్లలో 60 శాతం కన్నడలోనే ఉండాలన్న నిబంధనను ఫిబ్రవరి 28 నుంచి అమల్లోకి తెస్తామని, నిబంధనను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆయన అన్నారు.

వంద దాటిన జేఎన్1 కేసులు

న్యూఢిల్లీ: భారత్‌లో కొత్తగా వెలుగుచూసిన జేఎన్1 ఉప వేరియంట్ రకం కరోనా కేసులు మరో 40 బయటపడ్డాయి. దీంతో జేఎన్1 రకం కేసుల సంఖ్య 109కి పెరిగిందని కేంద్ర ఆరోగ్య శాఖ బుధవారం పేర్కొంది. ఈ 109 కేసుల్లో 36 కేసులు ఒక్క గుజరాత్‌లోనే నమోదయ్యాయి. కర్ణాటకలో 34, మహారాష్ట్రలో 9, కేరళలో ఆరు, రాజస్తాన్, తమిళనాడులో చెరో నాలుగు, తెలంగాణలో రెండు కేసులు నమోదయ్యాయి. ఢిల్లీలో తొలిసారిగా ఈ వేరియంట్ కేసు ఒకటి నమోదైంది.

మరింత పటిష్టంగా సహకార సంఘాలు: మోదీ

న్యూఢిల్లీ: గ్రామీణ ప్రజల అభివృద్ధికి తోడ్పడేలా సహకార సంఘాలను మరింత పటిష్టంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో సహకార సంఘాల పాత్ర పెరిగిందని అన్నారు. 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో భాగంగా ప్రధాని మోదీ బుధవారం వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. పంట ఉత్పత్తులను నిల్వ చేసుకొనే సదుపాయం లేక గతంలో రైతులు తక్కువ ధరకే వాటిని విక్రయించుకోవాల్సి వచ్చేదని, తమ ప్రభుత్వం వచ్చాక ఈ పరిస్థితి మారిందని గుర్తుచేశారు.

పొగమంచు గుప్పిట్లో ఉత్తర భారతం

- ఢిల్లీలో రెడ్ అలర్ట్ ప్రకటించిన వాతావరణ శాఖ
- విమానాలు, రైళ్ల రాకపోకలు ఆలస్యం
- ఉత్తరాదిన పలు ప్రాంతాల్లో సున్నాకు పడిపోయిన విజిబిలిటీ లెవెల్

ఢిల్లీ ఎయిర్‌పోర్టులో బుధవారం ఉదయం పొగమంచు వల్ల నిలిచిపోయిన విమానాలు



న్యూఢిల్లీ/బాగ్‌పట్: ఉత్తర భారతదేశం పొగమంచు గుప్పిట్లో చిక్కుకుంటోంది. దారులన్నీ దట్టమైన పొగ మంచుతో మూసుకుపోతున్నాయి. ముందున్న వాహనాలు సైతం కనిపించని పరిస్థితి. దేశ రాజధాని ఢిల్లీలో పొగ మంచుకుతోడు చలి తీవ్ర నానాటికీ పెరుగుతోంది. నగరంలో నగరంలో భారత వాతావరణ శాఖ(ఐఎండీ) రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఢిల్లీలో పొగమంచు కారణంగా బుధవారం 110 విమానాలు ఆలస్యంగా నడిచాయి. కొన్నింటిని ఇతర ఎయిర్‌పోర్టులకు మళ్లించారు. ఢిల్లీకి చేరుకోవాల్సిన 25 రైళ్లు ఆలస్యంగా వచ్చాయి. ఢిల్లీ నుంచి రాకపోకలు సాగించే విమానాలు ఆలస్యంగా నడుస్తుండడంపై ఎయిర్ ఇండియా సంస్థ స్పందించింది. ప్రయాణికులు తమ టికెట్లను ఎలాంటి అదనపు చార్జీలు లేకుండానే రీషెడ్యూల్ లేదా క్యాన్సిల్ చేసుకోవచ్చని సూచించింది. పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో పొగమంచు తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు సమీపంలో విజిబిలిటీ లెవెల్ 25 మీటర్లుగా నమోదైంది. హరియాణా, ఉత్తరప్రదేశ్, పంజాబ్ తదితర రాష్ట్రాల్లోనూ విజిబిలిటీ స్థాయి పడిపోయింది. ఆగ్రా, బరేలీ, భటిండాలో విజిబిలిటీ లెవెల్ సున్నాకు పడిపోవడం గమనార్హం. పొగ మంచు, కాలుష్యం వల్ల ఉత్తరాదిన వాయు నాణ్యత కూడా క్షీణిస్తోంది. తాజాగా సగటు వాయు నాణ్యత 381గా రికార్డయ్యింది. ఇది 'వెరీ పూర్' కేటగిరీలోకి వస్తుందని అధికారులు చెప్పారు. రాబోయే రోజుల్లో మరింత తగ్గే అవకాశం ఉందని వెల్లడించారు. ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రత 7 డిగ్రీలు, గరిష్ట ఉష్ణోగ్రత 24 డిగ్రీలుగా నమోదైంది.

పొగమంచు వల్ల 8 మంది మృతి

విపరీతమైన పొగమంచు వల్ల దారి కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రహదారులపై వాహనాలు ఒకదాన్ని ఒకటి ఢీకొంటున్నాయి. ఫలితంగా ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో మంగళవారం అర్ధరాత్రి తర్వాత, బుధవారం ఉదయం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో 8 మంది మరణించారు. మరో 25 మందికిపైగా గాయాలపాలయ్యారు. బరేలీ జిల్లాలోని హఫీజ్‌గంజ్‌లో మోటార్ సైకిల్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలు మృతిచెందారు. మరొకరు గాయపడ్డారు.

ముస్లిం లీగ్ జమ్మూకశ్మీర్(ఎంఏ)పై కేంద్రం ఐదేళ్ల నిషేధం

న్యూఢిల్లీ: వేర్పాటువాద నేత మసరత్ ఆలం భట్ నేతృత్వంలోని ముస్లిం లీగ్ జమ్మూ కశ్మీర్(మసరత్ ఆలం)ను ఐదేళ్లపాటు నిషేధిస్తున్నట్లు కేంద్ర హోం శాఖ బుధవారం ప్రకటించింది. ఈ సంస్థ ఉగ్రవాదులకు సాయపడుతూ దేశ వ్యతిరేక, ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు కేంద్రం తన నోటిఫికేషన్‌లో స్పష్టంచేసింది. '' దేశ ఐక్యత, సార్వభౌమత్వం, సమగ్రతను భంగపరిచే ఎలాంటి సంస్థలు, శక్తులనైనా కేంద్రం ఊరికే వదిలిపెట్టదు. చట్టవ్యతిరేక కార్యకలాపాల(నిరోధక)(ఉపా) చట్టం కింద ఈ సంస్థపై చట్టవ్యతిరేక సంస్థగా ప్రకటిస్తున్నాం. ఈ సంస్థ సభ్యులు కశ్మీర్‌లో భారత వ్యతిరేక చర్యల్లో నిమగ్నమయ్యారు. ఉగ్రవాదులకు సాయపడుతూ, జనాన్ని ఉగ్రవాదం వైపు ఆకర్షితులను చేస్తున్నారు. జమ్మూకశ్మీర్‌లో ఇస్లామిక్ రాజ్యస్థాపనకు ప్రయత్నిస్తున్నారు'' అని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. సయ్యద్ అలీ షా గిలానీ మరణం తర్వాత అతివాద హురియత్ కాన్ఫెరెన్స్‌కు మసరత్ చైర్మన్‌గా ఉన్నారు. 2010లో కశ్మీర్ అల్లర్లకు బాధ్యుల్లో భట్ కూడా ఒకరు. దీంతో అదే ఏడాది భట్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా ముఫ్తీ మొహమ్మద్ సయీద్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే భట్‌ను విడిపించారు. బీజేపీ ఒత్తిడితో అరెస్ట్ చేసి జైలులో పడేశారు.

జలాంతర్గామి నుంచి ద్వారక దర్శనం

భగవాన్ శ్రీకృష్ణుడు పరిపాలించిన నగరం ద్వారక. హిందువులకు పరమ పవిత్రమైన ఈ పురాతన నగరం వేలాది సంవత్సరాల క్రితం అరేబియా సముద్రంలో మునిగిపోయింది. నగర ఆనవాళ్లు ఇప్పటికీ సముద్రంలో భద్రంగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. సముద్ర గర్భంలోని ద్వారకను స్వయంగా దర్శించే అరుదైన అవకాశం భక్తులకు, పర్యాటకులకు లభించనుంది. జలాంతార్గమిలో ప్రయాణించి, ద్వారకను దర్శించుకోవచ్చు. ఈ మేరకు గుజరాత్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఉపరితలం నుంచి 300 అడుగుల మేర లోతుకి వెళ్లి ద్వారకను చూడొచ్చు. సముద్ర జీవులను కూడా తిలకించవచ్చు. ఈ సదుపాయం వచ్చే ఏడాది జన్మాష్టమి లేదా దీపావళి నుంచి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే, దీనిపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. జలాంతర్గామి యాత్ర రెండు నుంచి రెండున్నర గంటలపాటు ఉంటుందని సమాచారం. ఈ సబ్‌మెరైన్ బరువు 35 టన్నులు. లోపల పూర్తిగా ఏసీ సౌకర్యం కల్పిస్తారు. ఒకేసారి 30 మంది ప్రయాణించవచ్చు. ఇందులో భక్తులు 24 మంది మాత్రమే ఉంటారు. మిగిలిన ఆరుగురు జలాంతర్గామిని నడిపించే సిబ్బంది, సహాయకులు. భక్తులకు ఆక్సిజన్ మాస్క్, ఫేస్ మాస్క్, స్కూబా డ్రెస్ అందజేస్తారు. అయితే, ద్వారక దర్శనానికి ఎంత రుసుము వసూలు చేస్తారన్న గుజరాత్ ప్రభుత్వం ప్రకటించలేదు. జలాంతర్గామిలో ప్రయాణం అంటే చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే. సామాన్యుల కోసం ప్రభుత్వం రాయితీ ఇచ్చే అవకాశం లేకపోలేదు. ద్వారక కారిడార్ అభివృద్ధికి గుజరాత్ ప్రభుత్వం డాక్ షిప్‌యార్డ్ కంపెనీతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది.

\- సాక్షి, నేషనల్ డెస్క్

ఎంఫిల్‌కు గుర్తింపు లేదు

విద్యార్థులను హెచ్చరించిన యూజీసీ

న్యూఢిల్లీ: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నిబంధనల ప్రకారం ఎంఫిల్ కోర్సులకు ఎలాంటి గుర్తింపు లేదని, ఆ కోర్సుల్లో ఎవరూ చేరొద్దని విద్యార్థులను యూజీసీ హెచ్చరించింది. ఏ ఒక్క విశ్వవిద్యాలయం కూడా విద్యార్థులను ఎంఫిల్ కోర్సుల్లో చేర్చుకోకూడదని అన్ని విశ్వవిద్యాలయాలకు యూజీసీ ఆదేశాలిచ్చింది. '' ఎంఫిల్(మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ) ప్రోగామ్స్ కింద కొన్ని విశ్వవిద్యాలయాలు విద్యార్థులను చేర్చుకుంటున్నట్లు వార్తలొచ్చాయి. యూజీసీ(పీహెచ్‌డీ పట్టాకోసం కనీస ప్రమాణాలు, ప్రక్రియ) నియమావళిలోని 14వ నిబంధన ప్రకారం ఎంఫిల్ డిగ్రీకి ప్రస్తుతం ఎలాంటి గుర్తింపు లేదు'' అని యూజీసీ కార్యదర్శి మనీశ్ జోషి బుధవారం వెల్లడించారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి కొనసాగుతున్న ఎంఫిల్ అడ్మిషన్ల ప్రక్రియను వెంటనే ఆపేయాలని అన్ని యూనివర్సిటీలకు యూజీసీ ఆదేశాలిచ్చింది. 2022 నవంబర్ నుంచి ఎంఫిల్ కోర్సులను యూజీసీ రద్దుచేసిన విషయం తెల్సిందే. అయినాసరే కొన్ని వర్సిటీలు నియమాలకు తిలోదకాలిచ్చి అక్రమంగా ఎంఫిల్ కోర్సుల పేరిట విద్యార్థులను చేర్చుకుంటూ కోట్లు వసూలుచేస్తున్నట్లు వార్తలొచ్చాయి. దీంతో యూజీసీ బుధవారం స్పందించింది. '' పీహెచ్‌డీ రెగ్యులేషన్స్‌కు సంబంధించిన నోటిఫికేషన్ రావడానికి ముందే గతంలో ప్రారంభమైన ఎంఫిల్ కోర్సులు మాత్రం అలాగే కొనసాగుతాయి. అంటే ఇప్పటికే చేరిన పాత విద్యార్థులు మాత్రమే ఆ కోర్సులు పూర్తిచేసేందుకు అనుమతి ఇస్తున్నాం'' అని జోషి స్పష్టతనిచ్చారు.

ప్రాణం తీసిన రెండు జంటల గొడవ

వేరొకరి స్నేహితురాలిని కారుతో తొక్కించి చంపిన నిందితుడు

జైపూర్: రెస్టారెంట్‌లో రెండు జంటలు పడిన గొడవ చివరకు ఒక యువతి మృతికి దారితీసింది. వేరొకరి స్నేహితురాలిని నిందితుడు తన కారుతో తొక్కించి చంపేసిన ఘటన రాజస్తాన్‌లోని జైపూర్‌లో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. ఘటన వివరాలను పోలీసులు వెల్లడించారు. జైపూర్‌లోని ఎస్ఎల్ మార్గ్‌లో రాజ్‌కుమార్ అనే వ్యక్తి తన రెస్టారెంట్‌కు తన స్నేహితురాలు ఉమతో కలిసి వచ్చాడు. ఇద్దరూ కలిసి రాత్రి 11 గంటలప్పుడు భోజనం చేస్తుండగా అదే రెస్టారెంట్‌కు వస్త్రదుకాణ వ్యాపారి అయిన మంగేశ్ తన స్నేహితురాలితో వచ్చి మద్యం తాగడం మొదలెట్టాడు. రెండు జంటలూ సమీప టేబుళ్లపై కూర్చున్న సమయంలో ఉమను చూస్తూ మంగేశ్ అసభ్యంగా మాట్లాడటం మొదలెట్టాడు. వారించేందుకు వెళ్లిన రాజ్‌కుమార్‌ను.. 'మనం పరిచయస్తులమే' అంటూ మాట కలిపి నలుగురూ కలిసి భోజనం చేసేందుకు ఒప్పించాడు. ఈ సమయంలో ఉమను మంగేశ్ అసభ్యంగా తాకడంతో గొడవ మొదలైంది. దీంతో తెల్లవారుజామున ఐదింటికి రాజ్‌కుమార్, ఉమ రెస్టారెంట్ బయటికొచ్చి క్యాబ్ కోసం వేచిచూస్తుండగా మంగేశ్ జంట మళ్లీ అక్కడికొచ్చి గొడవపడింది. తర్వాత వీరావేశంతో మంగేశ్ తన కారును వీరిద్దరి మీదకు పోనిచ్చాడు. మీద నుంచి కారు దూసుకెళ్లడంతో నలిగిపోయి ఉమ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. రాజ్‌కుమార్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. పరారీలో ఉన్న మంగేశ్ కోసం పోలీసులు గాలింపు మొదలెట్టారు.

తమిళనాడు డీజీపీ ఆఫీస్‌కు 'బాంబు' బెదిరింపు

సాక్షి, చెన్నై: చెన్నై డీజీపీ కార్యాలయానికి బుధవారం రాత్రి వచ్చిన ఒక ఈ మెయిల్ పోలీసులను పరుగులు తీయిస్తోంది. చెన్నైలో 30 చోట్ల బాంబులు పెట్టామని, సాహసం చేసి కని పెట్టండి అని వచ్చిన ఆ బెదిరింపు మెయిల్‌తో పోలీసులు సోదాలను ముమ్మరం చేశారు. కొత్త సంవత్సరం వేడుకల సమయం ఆసన్నం అవుతోండటంతో చెన్నై నగరంలో ఇప్పటికే భద్రతను కట్టుదిట్టం చేసే విధంగా కమిషనర్ సందీప్‌రాయ్ రాథోర్ ఆదేశాలు ఇచ్చారు. 400 చోట్ల సోదాలు జరిపే విధంగా , 15 వేల మంది సిబ్బంది విధుల్లో ఉండే రీతిలో చర్యలు చేపట్టారు. ఈ పరిస్థితులలో బుధవారం రాత్రి డీజీపీ కార్యాలయానికి ఓ ఈ మెయిల్ వచ్చింది. చెన్నైలో 30 చోట్ల బాంబులు పెట్టినట్టు, బెసెంట్ నగర్, ఎలియట్స్ బీచ్‌లలో బాంబులు పెట్టినట్లు ఆ మెయిల్‌లో పేర్కొన్నారు. దీంతో బాంబ్, డాగ్ స్క్వాడ్ ఆయా ప్రాంతాల్లో క్షుణ్ణంగా గాలిస్తున్నాయి. నగరంలో తీవ్రవాదుల హిట్ లిస్టులో ఉన్నట్టుగా గతంలో వెలుగు చూసిన ప్రాంతాలలో భద్రతను కట్టుదిట్టం చేసి సోదాలు ముమ్మరం చేశారు.

ఎండు కొబ్బరి కనీస మద్దతు ధర పెంపు

సాక్షి, న్యూఢిల్లీ: 2024 సీజన్‌కు సంబంధించి కొబ్బరి కనీస మద్దతు ధరను పెంచుతూ కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకుంది. బుధవారం ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) సమావేశంలో కనీస మద్దతు ధర పెంపుపై నిర్ణయాలు తీసుకున్నారు. చక్కని, మోస్తరు నాణ్యత(ఎఫ్ఏక్యూ) కలిగిన కురిడీ కొబ్బరి కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.250 పెంచారు. దీంతో క్వింటాల్ కురిడీ కొబ్బరి ధర రూ.12,000కు పెరిగింది. ఇక ఎండు కొబ్బరి కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.300 పెంచారు. దీంతో క్వింటాల్ ఎండు కొబ్బరి కనీస మద్దతు ధర రూ.11,160కి చేరుకుంది. ఎండు కొబ్బరిని కొబ్బరి నూనె కోసం వాడుతారు. కురిడీ కొబ్బరిని డ్రైఫ్రూట్‌గా వినియోగిస్తారు. కేరళ, తమిళనాడు ఎండు కొబ్బరిని అధికంగా ఉత్పత్తిచేస్తున్నాయి. కురిడీ కొబ్బరిని కర్ణాటక అధికంగా ఉత్పత్తి చేస్తోంది. ప్రస్తుత 2023 సీజన్‌లో రికార్డు స్థాయిలో రూ.1,493 కోట్ల విలువైన 1.33 లక్షల మెట్రిక్ టన్నుల కొబ్బరిని సేకరించి సుమారు 90వేల మంది కొబ్బరి రైతులకు ప్రయోజనం చేకూర్చినట్లు కేంద్రం తెలిపింది.

భారత్ బ్రాండ్ బియ్యం.. కిలో రూ.25 !

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణాన్ని కిందకు దించి, సామాన్యులకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించే లక్ష్యంతో 'భారత్ రైస్' పేరిట బియ్యం విక్రయాలు మొదలుపెట్టాలని కేంద్రం యోచిస్తోంది. కిలో బియ్యాన్ని ఎంత ధరకు అమ్మాలనేది ఇంకా నిర్ణయం కాలేదని ఆహార మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి ఒకరు మీడియాతో చెప్పారు. ప్రభుత్వం ప్రస్తుతం ఓపెన్ మార్కెట్ సేల్ స్కీమ్(ఓఎంఎస్ఎస్) కింది ఎఫ్‌సీఐ వారు ఇప్పటికే నాణ్యమైన బియ్యాన్ని కిలో రూ.29 చొప్పున విక్రయిస్తున్నారు. దాంతో భారత్ బ్రాండ్ బియ్యాన్ని కూడా ఇదే ధరకు విక్రయిస్తారా లేదంటే ఇంతకంటే తక్కువ రేటుకు విక్రయిస్తారా అనేది తెలియాల్సి ఉంది. అయితే రూ.25 లెక్కన విక్రయించాలని కేంద్రం భావిస్తోందని బుధవారం జాతీయ మీడియాలో వార్తలొచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 'భారత్' బ్రాండ్ పేరిట గోధుమ పిండి, పప్పులను నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార్ ఔట్‌లెట్‌ల ద్వారా అమ్ముతున్న విషయం తెల్సిందే.

సాక్షి
హైదరాబాద్
గురువారం । 28 । డిసెంబర్ । 2023



మొక్కలు నాటుతున్న మానస వారణాసి

బ్యూటీ పల్స్

నగరానికి చెందిన 3 వైద్య కళాశాలల సంయుక్తాధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని షాదన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆవరణలో నిర్వహిస్తున్న పల్సేషన్ ఈవెంట్ సందడిగా సాగుతోంది. వార్షిక అంతర్– కళాశాలల సాంస్కృతిక, సాహిత్య, సామాజిక కార్యక్రమాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన హరితహారంలో ప్రముఖ నటి, మాజీ మిస్ ఇండియా మానస వారణాసి పాల్గొని మొక్కలు నాటారు. బైక్ ఎ థాన్ సైకిల్ ర్యాలీని మిస్ సూపర్నేషనల్ ప్రజ్ఞ అయ్యగారి జెండా ఊపి ప్రారంభించారు. కళాశాల యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
– సాక్షి, సిటీబ్యూరో



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రజ్ఞ అయ్యగారి

న్యూస్‌రీల్

31న రాత్రి 10 గంటల నుంచి ఓఆర్ఆర్, ఫ్లైఓవర్ల మూసివేత

రాయదుర్గం: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు పలు ఆంక్షలు విధించారు. డిసెంబర్ 31వ తేదీన ఓఆర్ఆర్ సహా పీవీ ఎక్స్‌ప్రెస్ వే, ఫ్లైఓవర్లన్నీ మూసివేయనున్నట్లు బుధవారం ప్రకటించారు. నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డుపై రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు విమానాశ్రయం వెళ్లే వాహనాలకు తప్ప ఇతర లైట్ మోటార్ వాహనాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు విమానాశ్రయం వెళ్లే వాహనాలకు తప్ప ఇతర వాహనాలకు అనుమతి లేదు. ప్రయాణికులు తమ ప్రణాళికలను తదనుగుణంగా రూపొందించుకొని సహకరించాలని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

జేవీఆర్ పార్కులో ఉచిత యోగా, ధ్యాన కేంద్రం



యోగా చేస్తున్న కమిషనర్ రొనాల్డ్ రాస్, మేయర్ విజయలక్ష్మి

వెంకటేశ్వరకాలనీ: వాకర్లు, సందర్శకులు, కాలనీవాసులు ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకునే దిశగా బంజారాహిల్స్‌లోని జలగం వెంగళ్‌రావు పార్కులో హార్ట్‌ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్ సహకారంతో ఉచిత యోగా, ధ్యాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రేతో కలిసి గ్రేటర్ మేయర్ విజయలక్ష్మి ఉచిత యోగా, ధ్యాన కేంద్రాన్ని ప్రారంభించారు. మేయర్, కమిషనర్ యోగాసనాలు వేశారు. అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని స్థానికులంతా వినియోగించుకోవాలన్నారు.

ఇక తెల్లవార్లూ డ్రంక్ అండ్ డ్రైవ్

బంజారాహిల్స్: ఇక తెల్లవార్లూ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంగా రెండు షిఫ్టులలో అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు వేర్వేరు చోట్ల వాహనదారులకు శ్వాస పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రణాళికలు రూపొందించారు. వెస్ట్‌జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మధురానగర్, పంజగుట్ట, బోరబండ, ఎస్ఆర్‌నగర్, మాసబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మంగళవారం రాత్రి 10 గంటల నుంచి బుధవారం ఉదయం 4 గంటల వరకు ఎనిమిది చోట్ల డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డైమండ్ హౌజ్, ఫిలింనగర్ విజేత సూపర్‌మార్కెట్ వద్ద నిర్వహించిన డ్రంక్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 24 మంది మందుబాబులు పట్టుబడ్డారు. ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు ఎస్ఆర్‌నగర్ ఐసీఐసీఐ వద్ద రాత్రి 10 నుంచి ఒంటి గంట వరకు, జూబ్లీహిల్స్ చిరంజీవి బ్లడ్ బ్యాంక్ వద్ద అర్ధరాత్రి ఒంటిగంట నుంచి ఉదయం 4 గంటల వరకు నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 26 మంది పట్టుబడ్డారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు స్టడీ సర్కిల్, గ్రీన్ బావర్చి వద్ద నిర్వహించిన తనిఖీల్లో 13 మంది పట్టుబడ్డారు. పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు రాత్రి 10 నుంచి ఒంటిగంట వరకు గ్రీన్‌ల్యాండ్స్ వద్ద, బంజారాహిల్స్ పార్క్ హయత్ వద్ద రాత్రి ఒంటిగంట నుంచి ఉదయం 4 గంటల వరకు నిర్వహించిన తనిఖీల్లో 19 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు.

ఫిబ్రవరిలో తెలుగు వర్సిటీ స్నాతకోత్సవం

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవాన్ని వచ్చే ఫిబ్రవరి మూడో వారంలో నిర్వహించనున్నట్లు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయాల కులపతి డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఎంఫిల్, పీహెచ్‌డీ పట్టాలను, ఆయా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలను అందించనున్నట్లు తెలిపారు. గత మూడేళ్లలో విశ్వవిద్యాలయం నిర్వహించిన వివిధ కోర్సుల పరీక్షలలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు డిగ్రీ సర్టిఫికెట్లు పొందనున్నట్లు వెల్లడించారు.

ఉస్మానియాలో కోవిడ్ నియంత్రణకు నోడల్ అధికారి

అఫ్జల్‌గంజ్: కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆస్పత్రిలో ఆర్ఎంఓలు, నర్సింగ్ అధికారులు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. జనరల్ మెడిసిన్ విభాగం నుంచి నోడల్ అధికారిని నియమించారు. రోగులందరూ కోవిడ్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా.. ఉస్మానియా ఆస్పత్రిని బుధవారం వైద్యారోగ్య శాఖ డైరెక్టర్, కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సందర్శించారు.

రెగట్టా.. రయ్ రయ్



తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని హుస్సేన్‌సాగర్‌లో రెగట్టా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ టోర్నీలో పలువురు సెయిలర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇక్కడి ఫలితాలతో వచ్చే నెల ముంబైలో జరగనున్న నేషనల్స్‌లో రాష్ట్రం తరఫున పోటీ పడే సెయిలర్లను ఎంపిక చేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. – సాక్షి, సిటీబ్యూరో

వార్డులు 150 600 లొకేషన్లు
నేటి నుంచే 'ప్రజాపాలన'

- ఏర్పాట్లు చేసిన జీహెచ్ఎంసీ
- పాల్గొననున్న ప్రజాప్రతినిధులు
- దరఖాస్తుల స్వీకరణకు రంగం సిద్ధం

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల హామీలకనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న అభయహస్తంలో భాగంగా గ్యారంటీల అమలుకు దరఖాస్తులు స్వీకరించే 'ప్రజాపాలన' కార్యక్రమం గురువారం ఉదయం నుంచి ప్రారంభం కానుంది. వచ్చే నెల 6వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరగనుండగా, మధ్యలో డిసెంబర్ 31, జనవరి 1 తేదీల్లో మాత్రం ఈ కార్యక్రమం ఉండదు. జీహెచ్ఎంసీ పరిధిలోని 30 సర్కిళ్లలో ఉన్న 150 వార్డుల్లో ఈ కార్యక్రమం నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. జనం రద్దీ ఎక్కువగా ఉంటే ఎదురయ్యే ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకొని ప్రాంతాల వారీగా దరఖాస్తులు స్వీకరిస్తారు. ఏ రోజు ఏ ఏరియావారి దరఖాస్తులు స్వీకరిస్తారో స్థానికులకు తెలిసేలా ఒక సెంటర్ వద్ద నుంచి మైకుల ద్వారా ప్రచారం చేయడంతో పాటు అక్కడికి వచ్చే ప్రజలకు దరఖాస్తు ఫారాలు అందజేస్తారు. వీలును బట్టి ప్రజల ఇళ్లకు కూడా వెళ్లి పంపిణీ చేస్తారు. వాటిని భర్తీ చేసి, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ ప్రతులను జతపరిచి తమకు సూచించిన కేంద్రానికి వెళ్లి



దరఖాస్తును అందజేయాలి. దరఖాస్తుదారు ఫొటోను కూడా అతికించాలి. దరఖాస్తులందని వారి కోసం సెంటర్లలోనూ కొన్ని దరఖాస్తులు ఉంచనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

వార్డుకు నాలుగు సెంటర్లు

- ప్రతి వార్డులో నాలుగు సెంటర్లలో ఈ కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ప్రతి సెంటర్‌లో కనీసం నాలుగు కౌంటర్లు, వీటికి తోడు అవసరమైన వారికి సహకరించేందుకు, వివరాలు తెలిపేందుకు మరో హెల్ప్ డెస్క్ ఉంటుంది. మూడు కౌంటర్లలో దరఖాస్తులు స్వీకరించి, నంబరు, స్టాంపు వేసి రసీదు ఇస్తారు. భవిష్యత్‌లో స్టేటస్ తెలుసుకునేందుకు రసీదు నంబరు భద్రపరచుకోవాల్సిందిగా అధికారులు తెలిపారు. ఒక కౌంటర్‌లో ప్రజలకు సంబంధించిన ఇతరత్రా ఫిర్యాదులు స్వీకరిస్తారు.
- రేషన్ కార్డులు లేని వారి దరఖాస్తులు కూడా అక్కడే స్వీకరిస్తారు. రేషన్‌కార్డులే కాకుండా ప్రజలు తమ ఏ ఫిర్యాదునైనా లిఖితపూర్వకంగా ఇస్తే స్వీకరిస్తారు. ప్రజాభవన్‌లో స్వీకరించే ఫిర్యాదులన్నింటినీ స్థానికంగానే తీసుకుంటారు. మహిళలు, వికలాంగులు, వయోధికులకు ప్రత్యేక క్యూ లైన్లు, ఉంటాయి. టెంట్లు, తాగునీరు, తదితర సదుపాయాలుంటాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించాల్సిందిగా ప్రభుత్వం సూచించింది.



ప్రజాపాలన లోగోను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

అవసరమైన వారి కోసం..

దరఖాస్తును సరిగా నింపడం తెలియకపోయినా, నింపడంలో సందేహాలున్నా హెల్ప్‌డెస్క్‌లో సంప్రదిస్తే సహకరిస్తారు. ప్రతి కౌంటర్‌లో దరఖాస్తు స్వీకరించేందుకు ఇద్దరేసి ఉద్యోగులతో పాటు హెల్ప్‌డెస్క్‌లో దాదాపు పదిమంది ఉంటారు. రద్దీని, అవసరాన్ని బట్టి ఎక్కువ మందిని నియమిస్తారు. ఒక ప్రాంతానికి చెందిన వారు తమకు కేటాయించిన నిర్ణీత పూటలో దరఖాస్తు అందజేయలేకపోతే.. తర్వాత కూడా స్వీకరిస్తారు. అయితే సెంటర్లలో రద్దీ లేని పరిస్థితుల్లోనే వాటిని స్వీకరిస్తారు. అన్ని రోజులూ రద్దీ ఉన్నట్లయితే చివరి రోజున తప్పనిసరిగా స్వీకరిస్తారు.

తిరస్కరణలుండవు ..

దరఖాస్తులో తప్పులున్నాయని కానీ, అటాచ్‌మెంట్లు లేవని కానీ, ఇతరత్రా కారణాలు చూపి కానీ ఏ దరఖాస్తునూ తిరస్కరించరు. అవసరమైనవి కావాలని చెబుతారు. అవి ఇవ్వలేమని తెలిపినా స్వీకరించి రసీదు నంబరు ఇస్తారు.

ఉర్దూలోనూ దరఖాస్తులు

తెలుగుతో పాటు ఉర్దూలోనూ దరఖాస్తులు అందుబాటులో ఉంచుతున్నట్లు అధికారులు తెలిపారు. ఉర్దూలోనూ దరఖాస్తులు భర్తీ చేయవచ్చన్నారు.

ప్రజాప్రతినిధులకు ఆహ్వానం

కార్యక్రమం ప్రారంభోత్సవానికి స్థానిక కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తదితర ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తారు. వారు కూడా ప్రజలకు అర్థమయ్యేలా తమవంతుగా సహకరించవచ్చు. ఇప్పటికే కొన్ని వార్డుల్లో కార్పొరేటర్లు తమ పరిధిలోని ప్రజలకు సమాచారమిచ్చారు.

తాగునీటి సదుపాయం కల్పించండి

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ప్రజా పాలన కార్యక్రమంలోభాగంగా దరఖాస్తులు స్వీకరించే వార్డు సభల వద్ద తాగునీరు సరఫరాకు ఏర్పాట్లు చేయాలని జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి సంబంధిత జనరల్ మేనేజర్లను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, ఇతర సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు.

ఇక నుమాయిష్ జోష్

- జనవరి 1న ప్రారంభించనున్న సీఎం
- శరవేగంగా కొనసాగుతున్న ఏర్పాట్లు
- 46 రోజుల పాటు కొనసాగనున్న ఎగ్జిబిషన్

అబిడ్స్: అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)కు సమయం ఆసన్నమైంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జనవరి 1న 83వ నుమాయిష్ ప్రారంభానికి ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల ఉత్పత్తులతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలు ఉత్పత్తులు, ప్రభుత్వాల స్టాళ్ల ఏర్పాటు చేయనున్నారు. ఎగ్జిబిషన్ ఫిబ్రవరి 15వ తేదీ వరకు 46 రోజుల పాటు కొనసాగనుంది. ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ సుమారు 2,400 స్టాళ్లు కొలువుదీరనున్నాయి.

ఒకేచోట అన్ని వస్తువులు..

ఎగ్జిబిషన్‌లో అన్ని రకాల వస్తువులు ఒకేచోట లభ్యమవుతాయి. నగరంలో దొరకని పలు రాష్ట్రాలకు చెందిన ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయి. దుస్తులు, బెడ్‌షీట్లు, కిచెన్‌వేర్ , మహిళల కోసం పలు విధాల వంట సామగ్రి, వివిధ రకాల దుప్పట్లు, బెడ్‌షీట్లు, కశ్మీరీ డ్రై ఫ్రూట్స్‌తో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులు, వివిధ రకాల కొత్త తరహా ఫర్నిచర్స్, పలు విధాల ఉపయోగపడే పలు రకాల సామగ్రి అందుబాటులో ఉంటాయి.



వినోదానికి సిద్ధమవుతున్న చుక్ చుక్ రైలు

సందర్శకులకు కనువిందు చేస్తాం..



ఎగ్జిబిషన్‌కు వచ్చే సందర్శకులకు ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాం. క్రీడా పోటీలు, వినోదాత్మక కార్యక్రమాలు చేపడతాం . సందర్శకుల కోసం ఆహ్లాదకర వాతావరణంలో ఏర్పాట్లు చేస్తాం.
– ఏనుగుల రాజేందర్ కుమార్, ఎగ్జిబిషన్ సొసైటీ కోశాధికారి



చురుగ్గా స్టాళ్ల ఏర్పాటు పనులు

టికెట్ ధర రూ.40..

ఎగ్జిబిషన్‌ను సుమారు 22 లక్షల మంది సందర్శించనున్నట్లు అంచనా. ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఎగ్జిబిషన్ సొసైటీ సీసీ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేస్తోంది. ఎగ్జిబిషన్‌కు వచ్చే గోషామహల్, అజంతా గేట్, గాంధీభవన్, గేట్ల వద్ద మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేసి సందర్శకులను లోపలికి అనుమతిస్తారు. టికెట్ ధర రూ.40. వినోదాత్మకమైన పలు విభాగాలు అందుబాటులో ఉంటాయి.

తెలంగాణ విద్యావ్యాప్తికి కృషి




ఎగ్జిబిషన్ నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విద్యారంగ వ్యాప్తికి కృషి చేస్తున్నాం. ముఖ్యంగా మహిళా కళాశాలలు, పాలిటెక్నిక్, ఫార్మసీ, ఇంజినీరింగ్, డిగ్రీ, ఐటీఐ కళాశాలలను స్థాపించి విద్యావ్యాప్తికి నిరంతరం పాటుపడుతున్నాం.
– బి.హన్మంతరావు, ఎగ్జిబిషన్ కార్యదర్శి

33 సబ్ కమిటీల ద్వారా ఏర్పాట్లు..



33 సబ్ కమిటీల ద్వారా ఎగ్జిబిషన్‌ను విజయవంతంగా కొనసాగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఎగ్జిబిషన్ లోపల, బయట సందర్శకులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఎగ్జిబిషన్ సబ్ కమిటీల ప్రతినిధులు తగిన చర్యలు తీసుకుంటారు.
– వనం సత్యేందర్, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు

ధన్‌ఖడ్‌కు ఘన స్వాగతం



దివంగత మాజీ న్యాయమూర్తి జస్టిస్ కొండా మాధవరెడ్డి శత జయంతి ఉత్సవాల సందర్భంగా బుధవారం నగరానికి వచ్చిన ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌కు బేగంపేట్ ఎయిర్ పోర్టులో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఆధార్ అగచాట్లు!

- ఆరు గ్యారంటీలకు ఈ నంబర్‌తో లింక్
- అప్‌డేషన్ కోసం ఉరుకులు పరుగులు
- కేంద్రాల ఎదుట జనం బారులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం తలపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలకు అర్హత సాధించేందుకు 'ఆధార్' తప్పనిసరిగా కావడంతో కొత్తగా నమోదు, అప్‌డేషన్ కోసం ఉరుకులు పరుగులు ప్రారంభమయ్యాయి. ఆధార్ అనుసంధానం గుర్తింపులో ఎటువంటి ఇబ్బందులూ రాకుండా, సులభంగా ప్రక్రియ పూర్తి అయ్యేందుకు అప్‌డేషన్ చేయాల్సిందే. దీంతో ముందు జాగ్రత్త చర్యలో భాగంగా ఆధార్ కేంద్రాల ఎదుట భారీ సంఖ్య జనం బారులు తీరుతున్నారు. వివాహం కావడం, ఇంటి పేరు, కేరాఫ్, చిరునామా, ఉద్యోగ, ఉపాధి రీత్యా, నివాసం, మొబైల్ నంబర్ మారడంతో అప్‌డేషన్ ఆవశ్యకత ఎదురైంది. తాజాగా ఆరు గ్యారంటీల నేపథ్యంలో ఆధార్ నవీకరించుకునేందుకు పోటెత్తుతున్నారు.

అన్నింటికీ ఇదే ఆధారం..



అన్నింటికీ 'ఆధార్' ఆధారమవుతోంది. పూరి గుడిసెల్లో నివసించే నిరుపేదల నుంచి విలాసవంతమైన భవంతుల్లో జీవించే సంపన్నుల వరకు తప్పనిసరిగా మారింది. ఇప్పుడు ప్రతి ఒక్కరికీ తప్పకుండా కావాల్సింది ఆధార్ కార్డు. ఎందుకంటే.. ప్రతి పౌరుడికి భారత ప్రభుత్వం కేటాయించే విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటుంది. అది బహుళ ప్రయోజనకారిగా మారి ప్రతిదానికీ ఆధారంతో పాటు అనుసంధానమవుతోంది. ప్రభుత్వ పనులైనా.. ప్రైవేటు పనులు ముందుకు సాగాలంటే ఆధార్ నంబర్ ఉండాల్సిందే.. ప్రతి కుటుంబానికి నిత్యావసరమైన వంట గ్యాస్, మొబైల్ సిమ్ కనెక్షన్ నుంచి పిల్లల స్కూల్‌లో అడ్మిషన్, స్థిర, చర ఆస్తుల రిజిస్ట్రేషన్లు. ప్రభుత్వ పథకాలైన రేషన్ కార్డు, సామాజిక పింఛన్, స్కాలర్ షిప్‌తో పాటు బ్యాంకింగ్, బీమా తదితర అన్నింటికీ ఆధార్ తప్పనిసరి. పన్నులు తదితర పనులకూ ఆధార్ అవసరమే..

అంచనా జనాభా కంటే..

- విశ్వనగరంగా విస్తరిస్తున్న హైదరాబాద్‌లో అంచనా జనాభా కంటే ఆధార్ నమోదు సంఖ్య దాటింది. ఇతర రాష్ట్రాలు నుంచి బతుకుదెరువు కోసం వలస వచ్చి స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్న వారితో ఆధార్ నమోదు సంఖ్య ఎగబాకుతోంది. మహా నగరంలో ఏటా జనాభా వృద్ధి రేటు 8 నుంచి 12 శాతానికిపైగా పెరుగుతోంది. 2023 చివరి నాటికి అంచనా జనాభా ప్రకారం 1.50 కోట్లకు చేరగా.. దానికి మించి ఆధార్ నంబర్లు సంఖ్య జారీ అయినట్లు యూఐడీఏఐ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.
- మహానగరానికి వలస వస్తున్నవారిలో సుమారు 34 శాతం ఇక్కడే స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో జనాభాకు అనుగుణంగా ఆధార్ నమోదు సంఖ్య పెరుగుతున్నట్లు తెలుస్తోంది. గతేడాది కాలంగా ఆధార్ నమోదు సంఖ్య బాగా ఎగబాకింది. ఆధార్ విశిష్ట గుర్తింపు సంఖ్య పొందిన వారిలో మహిళలు పురుషులతో సమానంగా ఉన్నట్లు యూఐడీఏఐ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

సైబర్ నేరాలు పెరిగాయి

- ఈ ఏడాది 2,562 సైబర్ మోసాలు
- 2022తో పోలిస్తే 25 శాతం ఎక్కువ
- 22.45 లక్షలు ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు
- రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: ఈ ఏడాది రాచకొండలో 2,562 సైబర్ నేరాలు జరిగాయి. 2022లో 2,049 కేసులతో పోలిస్తే 25 శాతం ఎక్కువ. 42 మంది నిందితులను అరెస్టు చేశారు. పార్ట్‌టైం జాబ్, ఇన్వెస్ట్‌మెంట్ సైబర్ నేరాలే ఎక్కువగా జరుగుతున్నాయి. 834 పార్ట్‌టైం జాబ్ ఫ్రాడ్స్ జరగగా.. 168 క్రిప్టో, ఇన్వెస్ట్‌మెంట్, 159 ఫిషింగ్ మోసాలు, 38 లోన్ ఫ్రాడ్స్, 24 లాటరీ మోసాలు జరిగాయి. నిందితుల బ్యాంకు ఖాతాలలోని రూ.89.92 లక్షల సొమ్మును స్తంభింపజేసి, వాటిని బాధితులకు తిరిగి అప్పగించారు. ఈ వివరాలను రాచకొండ సీపీ బుధవారం ఇక్కడ విడుదల చేసిన వార్షిక నివేదికలో వెల్లడించారు.

మత్తు దిగాల్సిందే..

మద్యం తాగి వాహనం నడిపే మందుబాబుల మత్తు వదిలిస్తున్నారు. ఈ ఏడాది రాచకొండ పరిధిలో 22,45,221 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదు కాగా.. న్యాయస్థానం రూ.3.89 కోట్ల జరిమానాలు విధించింది. 16,594 డ్రంకెన్ డ్రైవ్ (డీడీ) కేసులలో 2,900 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు కాగా.. 271 మందికి శిక్షలు ఖరారయ్యాయి. ఎంవీ యాక్ట్ అత్యధికం హెల్మెట్ లేని కేసులే. 12.80 లక్షలు హెల్మెట్ లేని కేసులున్నాయి. 1.84 లక్షలు రాంగ్ సైడ్ డ్రైవింగ్, 1.17 లక్షలు అతివేగం, 1.21 లక్షలు నంబరు ప్లేట్ సరిగా లేని కేసులున్నాయి. ఈ ఏడాది 3,321 రోడ్డు ప్రమాదాలు జరగగా.. 633 మంది మరణించారు. 3,205 మందికి గాయాలయ్యాయి. 282 మాదక ద్రవ్యాల కేసులు నమోదయ్యాయి. వీటిల్లో 698 మంది నేరస్తులను అరెస్టు చేశారు. 12 మందిపై పీడీ యాక్ట్‌లు నమోదు చేశారు.

రూ.50 వేలు పోగొట్టుకున్నా స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేయొచ్చు

రాయదుర్గం: సైబర్ నేరగాళ్ల వలలో పడి రూ. 50 వేలు పోగొట్టుకున్నా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సూచించారు. సైబర్ నేరాలు, కేసుల ఎఫ్ఐఆర్‌ల విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల దృష్ట్యా బుధవారం పలు సూచనలు చేశారు. ముఖ్యంగా గతంలో సైబర్ క్రైమ్స్ ఆర్థిక నేరాల విషయంలో రూ.1.50 లక్షల కన్నా ఎక్కువ మొత్తం డబ్బు పోగొట్టుకున్న సందర్భంలో ప్రజలు సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేసేవారని అలాగే రూ.1.50 లక్షల కన్నా తక్కువ డబ్బు పోగొట్టుకున్న సందర్భంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రజలు ఫిర్యాదు చేసేవారని గుర్తు చేశారు. ఇటీవల కాలంలో సైబర్ క్రైమ్స్ నేరాలు ఎక్కువ అవుతుండడం, ప్రజలు ఇబ్బందులు పడడం, త్వరితగతిన సైబర్ క్రైమ్స్ ఆర్థిక నేరాల కేసుల దర్యాప్తు కోసం సైబరాబాద్ సీపీ పలు సూచనలు చేశారు. ఏదైనా సైబర్‌క్రైమ్స్, ఆన్‌లైన్‌లో రూ.50వేల వరకు పోగొట్టుకుంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

నేరం చేస్తే శిక్ష ఖాయం!

- నేర నిరూపణలో రాష్ట్రంలోనే రాచకొండ టాప్
- శిక్షలలో గత ఐదేళ్లుగా అగ్రస్థానంలోనే
- ఈ ఏడాది 30,148 కేసులు నమోదు
- 2023లో నేర నిరూపణ 89 శాతం
- రాచకొండ వార్షిక నివేదికలో వెల్లడి

ఏ నేరాలు ఎన్నంటే..

నేరం	కేసులు
సొత్తు కోసం హత్యలు	5
దోపిడీలు	8
రాబరీ/చైన్ స్నాచింగ్	125
ఇళ్లలో చోరీలు	767
వాహన చోరీలు	1,292
దొంగతనాలు	1,272
హత్యలు	66
కిడ్నాప్‌లు	420
అత్యాచారాలు	327
వరకట్న మరణాలు	16
గృహ హింసలు	1,582
పోక్సో	1,061



మట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు

సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ పోలీసులు నేరస్తుల పాలిట సింహస్వప్నంలా మారారు. నేరస్తుడు ఎంతటి వాడైనా సరే పక్కాగా ఆధారాలు సేకరించి కచ్చితంగా శిక్ష పడేలా చేస్తున్నారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలోనే నేర నిరూపణలో రాచకొండ పోలీసు కమిషనరేట్ అగ్రస్థానంలో నిలవడమే ఇందుకు ఉదాహరణ. గతేడాది దర్యాప్తులో ఉన్న కేసులు (యూఐ) 5,978, ఈ ఏడాది నమోదైన 30,148 కేసులతో కలిపి మొత్తం 36,126 కేసులు నమోదయ్యాయి. వీటిలో 75 శాతం అంటే 27,210 కేసులు పరిష్కృతమయ్యాయి. 2019లో రాచకొండలో 52 శాతంగా ఉన్న నేర నిరూపణ శాతం..ఈ ఏడాది 89 శాతానికి పెరిగింది. 2020లో 71 శాతం, 2021లో 72 శాతం, 2022లో 94 శాతం కన్విక్షన్ రేటు ఉంది.

లోక్ అదాలత్‌లోనూ నంబర్ వనే..

జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలోనూ రాష్ట్రంలోనే రాచకొండ ప్రథమ స్థానంలో నిలిచింది. మూడు నేషనల్ లోక్ అదాలత్‌లలో కలిపి కమిషనరేట్ పరిధిలో మొత్తం 8,981 ఐపీసీ, ఎస్ఎల్ఎల్ కేసులు, 87,131 ఈ-పెట్టీ కేసులు, 2,892 మోటారు వాహన చట్టం కేసులు పరిష్కృతమయ్యాయి. ఈ ఏడాది 227 వివాదాస్పద కేసులలో న్యాయస్థానం శిక్షలు ఖరారు చేసింది. ఇందులో 20 మంది నేరస్తులకు జీవిత కాలం శిక్ష ఖరారు కాగా.. 20 ఏళ్ల జైలు 11 మందికి, 10 ఏళ్లు 9 మందికి, ఏడేళ్లు ఆరుగురికి, ఐదేళ్లు 18 మందికి, నాలుగేళ్లు ఒక్కరికి, మూడేళ్లు 19 మందికి, రెండేళ్లు 17 మందికి, ఏడాది జైలు 32 మందికి, ఏడాది లోపు కారాగారం, జరిమానా 94 మంది నేరస్తులకు విధించింది. 50 మంది నేరస్తులపై పీడీ యాక్ట్‌లను నమోదు చేశారు.



వార్షిక నివేదిక విడుదల చేస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు, ఇతర పోలీసు అధికారులు

తెలిసిన వాళ్లే తోడేళ్లు

- ఈ ఏడాది మహిళలపై 327 అత్యాచారాలు
- ఇందులో 280 కేసులలో నిందితులు స్నేహితులే
- 15 మంది కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారే..

మహిళలపై నేరాలు:

నేరం	2022	2023
వరకట్న హత్యలు	5	6
వరకట్న మరణాలు	16	16
ఆత్మహత్యలకు ప్రేరణ	4	2
గృహ హింస	1704	1582
హత్యలు	4	12
అత్యాచారం	372	327
అపహరణ	110	116
వేధింపులు	673	744
పోక్సో	442	317

సాక్షి, సిటీబ్యూరో: రాచకొండలో మహిళలపై ఆగడాలు ఆగడం లేదు. నిత్యం ఏదో ఒక చోట హత్యలు, అపహరణకు, అత్యాచారాలకు గురవుతూనే ఉన్నారు. మహిళలపై జరిగే దారుణాలలో నిందితులు తెలిసిన వాళ్లే ఉంటుండటం అత్యంత దారుణం. ఈ ఏడాది కమిషనరేట్ పరిధిలో 327 అత్యాచారం కేసులు నమోదు కాగా.. ఇందులో 280 మంది నిందితులు బాధితుల స్నేహితులేనని పోలీసుల విచారణలో తేలింది. 12 మంది నేరస్తులు ఇరుగు పొరుగు వాళ్లు కాగా.. ముగ్గురు కుటుంబ సభ్యులే ఉండటం గమనార్హం. ఇక 32 మంది నిందితులు ఇతరులు ఉన్నారని రాచకొండ వార్షిక నివేదిక వెల్లడించింది.

మహిళలపై తగ్గిన నేరాలు..

ఈ ఏడాది రాచకొండలో మహిళలపై నేరాలు కాస్త తగ్గాయి. గతేడాది స్త్రీలపై 3,330 నేరాలు జరగగా.. ఈ ఏడాది 6.25 శాతం తగ్గి 3,122 నేరాలు జరిగాయి. అయితే వరకట్న హత్యలు, హత్యలు, అపహరణలు, వేధింపులు మాత్రం పెరిగాయి. ఆత్మహత్యకు ప్రేరణ, గృహ హింస, అత్యాచారాలు, పోక్సో నేరాలు మాత్రం తగ్గాయి. ఈ ఏడాది 744 మంది మహిళలు వేధింపులకు గురి కాగా.. 116 మంది కిడ్నాప్, ఆరుగురిపై వరకట్న హత్యలు, 12 మంది హత్యకు గురయ్యారు. 21 బాల్య వివాహాలను షీ టీమ్స్ పోలీసులు అడ్డుకున్నారు. 231 మంది పోకిరీలపై ఎఫ్ఐఆర్‌లు, 558 మందిపై ఈ-పెట్టీ కేసులు నమోదు చేశారు. 634 మందికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

నారగోని రాములు మరణం తీరని లోటు

సాక్షి, సిటీబ్యూరో: ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా, ఉప పర్యవేక్షణాధికారిగా పనిచేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల మన్ననలు పొందిన నారగోని రాములు మృతి ఉపాధ్యాయ ఉద్యమానికి, సమాజానికి తీరని లోటు అని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన రాములకు నివాళులు అర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, మోతుకూరి నరహరి, రమణయ్య శాస్త్రి, మస్తాన్‌రావు, దేవదాస్, వరప్రసాద్, సింహాచలం, జిల్లా అధ్యక్షుడు రాజారావు, ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్, జిల్లా కార్యదర్శి విశాలి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నారగోని రాములుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి తదితరులు

విలాసాలకు బానిసై...

- దొంగతనాల బాటపట్టిన మహిళ
- మూడుసార్లు జైలు, 16 కేసులు



నిందితురాలు సునీత

బంజారాహిల్స్: మూడుసార్లు జైలుకు వెళ్లి వచ్చింది..16 దొంగతనం కేసుల్లో నిందితురాలు...రోజూ బిర్యానీ తిననిదే నిద్రపట్టదు..జల్సాల కోసం గోవా, పాండిచ్చేరి బీచ్‌లకు వెళ్లి సరదాగా గడిపి వస్తుంటుంది. అటు బిర్యానీ తినాలన్నా, ఇటు గోవా బీచ్‌కు వెళ్లాలన్నా డబ్బులు కావాలి కదా.. ఇందుకోసం దొంగతనాలకు తెరలేపింది. ఇళ్లల్లో పనిమనిషిగా చేరుతూ యజమాని కళ్లు గప్పి అందినంత ఊడ్చుకుపోతుంది. కరడుగట్టిన ఈ మహిళా దొంగను బంజారాహిల్స్ క్రైం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్ డీఐ జాకీర్ హుస్సేన్ తెలిపిన వివరాల ప్రకారం..మెహిదీపట్నం అయోధ్యనగర్‌లో నివాసం ఉండే ఎరువ మేరీ సునీతారెడ్డి(45) నల్లకుంటలోని హెల్త్‌కేర్ హాస్టల్‌లో ఉంటూ కేర్ టేకర్‌గా పని చేస్తున్నది. అయితే జల్సాలకు అలవాటుపడి పనిచేస్తున్న ఇంటికే కన్నం వేస్తూ అందినంత ఎత్తుకెళ్తూ జల్సా చేస్తోంది. ఇటీవల ఖైరతాబాద్‌లో నివసించే కంబంపాటి వెంకటకృష్ణ ఇంట్లో పనికి కుదిరింది. పనిలో చేరిన మూడో రోజూ ఆ ఇంటి యజమాని వెంకటకృష్ణ తన తల్లి కె.లక్ష్మిని తీసుకొని బంజారాహిల్స్‌లోని స్టార్ ఆస్పత్రికి వైద్య పరీక్షలకు వచ్చారు. పరీక్షలు చేసే క్రమంలో లక్ష్మి ఒంటిమీద ఉన్న నగలన్నీ ఓ కర్చీఫ్‌లో కట్టి కేర్ టేకర్‌గా వచ్చిన సునీతకు ఇచ్చారు. తల్లిని తీసుకొని ఆయన వైద్య పరీక్షలకు వెళ్లిన సమయంలో ఇదే అదునుగా సునీత 16 తులాల బంగారు ఆభరణాలతో అక్కడి నుంచి ఉడాయించింది. వీటి విలువ రూ.4.80 లక్షలు ఉంటుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన బంజారాహిల్స్ క్రైం పోలీసులు ఇక్కడి సీసీ ఫుటేజీలను ఆరు రోజుల పాటు గమనిస్తూ నిందితురాలు వెళ్లిన ప్రాంతాన్ని గుర్తించారు. సుమారుగా వంద సీసీ కెమెరాలు ఈ సందర్భంగా వడపోశారు. ఎట్టకేలకు నిందితురాలు పోలీసులకు చిక్కగా ఆభరణాలు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆరు నెలల క్రితమే ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం కేసులో జైలు శిక్ష అనుభవించి బెయిల్‌పై విడుదలైన ఆమె మళ్లీ ఈ దొంగతనాలకు శ్రీకారం చుట్టింది. పంజగుట్ట, తిరుమలగిరి, మాదాపూర్, బంజారాహిల్స్, సైఫాబాద్, ఆబిడ్స్, జూబ్లీహిల్స్, ఉప్పల్, బేగంపేట, గాంధీనగర్, తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆమెపై దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి.

ఎర్రచందనం తరలిస్తున్న లారీ పట్టివేత?



మేడ్చల్ రూరల్: కొబ్బరి బోండాల లారీలో ఏపీ నుండి యూపీకి ఎర్రచందనం తరలిస్తున్న లారీని మేడ్చల్‌లో ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ఔటర్ రింగురోడ్డు వద్ద యూపీకి చెందిన లారీ (యూపీ24ఏటీ4535)ని తనిఖీ చేయగా..లోపల ఎర్రచందనం దుంగలు ఉంచి..పైన కొబ్బరి బోండాలు ఉంచి తరలిస్తున్నట్లు గుర్తించారు. డ్రైవర్‌తో సహా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. అటవీ శాఖ అధికారులకు లారీ, ముగ్గురిని అప్పగించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న అటవీ శాఖ పోలీసులు ఎర్రచందనమా కాదా అనేది పరీక్షలు నిర్వహించిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. కాగా పట్టుబడిన లారీలో వందకు పైగా దుంగలు లభ్యమవ్వడంతో వాటి విలువ భారీగానే ఉండవచ్చని సమాచారం.

ఆన్‌లైన్ గేమ్స్‌కు ఆకర్షితురాలై..

- లిఫ్ట్ అడిగి..డబ్బులు దోచుకుంటున్న మహిళ
- అదుపులోకి తీసుకున్న పోలీసులు



నిందితురాలు బొడిగె అర్చన

బంజారాహిల్స్: ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసైన ఓ మహిళ ఈ ఆట కోసం అడ్డదారులు తొక్కుతూ పోలీసులకు చిక్కింది. హయత్‌నగర్ సమీపంలోని బాచారం గ్రామానికి చెందిన బొడిగె అర్చన (35) ఫోర్ ర్యాబిట్ ఆన్‌లైన్ గేమ్ ఆడుతూ సుమారుగా రూ.10 లక్షలు పోగొట్టుకుంది. అయినాసరే ఆమె మారకుండా ఈ ఆటకు బానిసై డబ్బుల కోసం దారి తప్పింది. ఇందుకోసం ఆమె బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌ప్రాంతాలకు బస్సులో వచ్చి దిగి నడుచుకుంటూ వెళ్తూ అటు నుంచి వచ్చే స్కూటరిస్టులను లిఫ్ట్ అడుగుతుంది. మహిళ కదా అని దయతలిచి కొంత మంది లిఫ్ట్ ఇచ్చి ఆమెను ఎక్కించుకొని వెళ్తుండగానే తన పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నావంటూ ఆ స్కూటరిస్ట్‌తో గొడవకు దిగుతుంది. నీ మీద పోలీసులకు కేసు పెడతా అంటూ బెదిరింపులకు పాల్పడుతుంది. చాలా మంది ఈ బెదిరింపులకు భయపడి ఆమె అడిగినంత ఇచ్చుకుంటూ బతుకుజీవుడా అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయేవారు. ఈ తరహా మోసాలకు అలవాటుపడ్డ అర్చన ఎప్పటిలాగే మూడు రోజుల క్రితం బంజారాహిల్స్‌లో నడుచుకుంటూ వెళ్తూ లిఫ్ట్ అడిగింది. జంగయ్య అనే స్కూటరిస్ట్‌ను లిఫ్ట్ అడగగా ఆయన ఎక్కించుకొని కొద్దిదూరం పోగానే తనను తాకుతున్నాడంటూ గొడవకు దిగింది. రూ.20 వేలు డిమాండ్ చేసింది. సాగర్ సొసైటీ చౌరస్తాలో ఓ ఏటీఎం నుంచి డబ్బులు డ్రా చేసి ఇచ్చాడు. వెంటనే పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాడు. పోలీసులు రంగంలోకి దిగి ఏటీఎం వద్ద టవర్ డంప్ తీసుకొని ఆ సమయంలో ఏటీఎంలో డబ్బులు డిపాజిట్ చేసిన వారి వివరాలు సేకరించి సాంకేతికత ఆధారంగా ఆమె సెల్‌ఫోన్ నెంబర్‌ను ట్రేస్ చేశారు. అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఇప్పటి వరకు 35 నుంచి 40 మందిని ఇలా లిఫ్ట్ పేరుతో ఎక్కి మోసగించినట్లుగా తెలుస్తున్నది. పోలీసులు ఆమెను మరింత లోతుగా విచారిస్తున్నారు. కాగా అర్చన తండ్రి మాజీ ఎస్ఐ అని, బాబాయి మాజీ ఏఎస్ఐ అని తెలిసింది.

చోరీ చేసి.. డైరీలో రాసి..

- గజదొంగ శంకర్ పట్టివేత
- వందకు పైగా దొంగతనాలు..
- చోరీల వివరాలు డైరీలో రాసుకున్న వైనం..




నిందితుడు శంకర్ నాయక్

లాలాపేట: దాదాపు వందకు పైగా దొంగతనాలకు పాల్పడిన ఓ గజ దొంగను ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు చాకచక్యంగా పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. బుధవారం ఏసీపీ సైదయ్య, ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులతో కలిసి ఓయూ పీఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తూముకుంట గ్రామం, నాగర్లబండ తండాకు చెందిన రత్‌లావత్ శంకర్ నాయక్(28) బీఫార్మసీ చదివాడు. ఆ తర్వాత చెడు అలవాట్లకు బానిసై నేరాల బాటపట్టాడు. ఈ క్రమంలో 2012లో అటెంప్ట్ మర్డర్ కేసులో అరెస్టై జైలుకెళ్లి వచ్చాడు. ఆ తర్వాత నుంచి దొంగతనాలను ప్రారంభించాడు. రాత్రి వేళలో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి..రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక దొంగతనాలకు పాల్పడ్డాడు. గతేడాది సెప్టెంబర్‌లో నగరంలోని మేడిపల్లి పీఎస్ పరిధిలో చోరీకి పాల్పడి పోలీసులకు చిక్కడంతో అతనిపై పీడీ యాక్ట్ నమోదైంది. ఇలా అతనిపై వివిధ ప్రాంతాల్లో మొత్తం వందకు పైగా కేసులు నమోదయ్యాయి. తాజాగా ఓయూ పీఎస్ పరిధిలోని హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 5లో నివాసం ఉంటున్న లగిశెట్టి రాజు కుటుంబం ఈ నెల 17న జనగామకు వెళ్లి..20న తిరిగి వచ్చేసరికి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు 19 తులా బంగారు ఆభరణాలు, కొన్ని యూఎస్ డాలర్లు, కొంత నగదు కనిపించలేదు. విచారణ చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ఈ నెల 20న అమీర్‌పేటలో ఓ బంగారం దుకాణం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న శంకర్‌ను పట్టుకుని విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద 20 తులాల బంగారు గొలుసులు, 3 డైమండ్ రింగ్స్, ద్విచక్ర వాహనం, దొంతనం చేసిన వివరాలను రాసుకున్న డైరీ, 3 సెల్‌ఫోన్లు, పలు బంగారు దుకాణాల్లో నగలు కుదువపెట్టిన రశీదులు స్వాధీనం చేసుకున్నారు. శంకర్‌నాయక్ తాను చేసిన చోరీల వివరాలను ఓ చీటిపై రాసి చోరీ ప్రాంతంలో పెట్టడంతో పాటు డైరీలో పక్కాగా రాసి ఉంచడాన్ని చూసి పోలీసులు అవాక్కయ్యారు. ఎక్కడెక్కడ..ఎంతమేర చోరీలు చేసిందీ శంకర్ వివరాలతో రాసి పెట్టాడు.

నాడు తండ్రి.. నేడు కొడుకు

పదహారేళ్లకు మరో 'పరుగు'!.

- 2007 నాటి 'పాస్‌పోర్ట్స్ కేసు'లో నిందితుడిగా షకీల్
- అప్పట్లో అతడి కోసం ముమ్మరంగా సాగిన గాలింపు
- తాజాగా బారికేడ్స్ ప్రమాదంలో కుమారుడు సాహిల్
- ఇతడి కోసం వెతుకుతున్న పోలీసులు
- రెండు కేసులూ నగర కమిషనరేట్‌లో పరిధిలోనే
- గతేడాది నాటి జూబ్లీహిల్స్ యాక్సిడెంట్ పైనా నజర్



సాక్షి, సిటీబ్యూరో: అప్పట్లో మహ్మద్ షకీల్ ఆమీర్ అలియాస్ బోధన్ షకీల్... ఇప్పుడు ఆ మాజీ ఎమ్మెల్యే కుమారుడు సాహిల్... హైదరాబాద్ పోలీసులు వాంటెడ్‌గా మారారు. 2007 నాటి నకిలీ పాస్‌పోర్ట్స్ కేసులో షకీల్, తాజాగా ప్రజాభవన్ వద్ద చోటు చేసుకున్న బీఎండబ్ల్యూ కారు ప్రమాదం, తదనంతర నాటకీయ పరిణామాల కేసులో సాహిల్ నిందితులుగా ఉన్నారు. పదహారేళ్ల క్రితం తండ్రి కోసం పరుగులు పెట్టిన సిటీ కాప్స్ ఇప్పుడు కుమారుడి కోసం వెతుకుతున్నారు. సాహిల్ దుబాయ్‌కి పారిపోవడంతో అతడిపై ఎల్‌ఓసీ జారీ చేశారు. పంజగుట్ట ప్రమాదం నేపథ్యంలో వెస్ట్‌జోన్ పోలీసులు గతేడాది జూబ్లీహిల్స్ పరిధిలో జరిగిన మరో యాక్సిడెంట్ ఫైల్‌ను బయటకు తీస్తున్నారు.

ముప్పతిప్పలు పెట్టిన షకీల్...

మనుషుల అక్రమ రవాణాలో భాగమైన నకిలీ పాస్‌పోర్ట్స్ స్కామ్ 2007లో వెలుగులోకి వచ్చింది. అమెరికా సహా కొన్ని దేశాల్లో గుజరాతీయులకు ఎంట్రీ ఉండేది కాదు. దీంతో ఆ రాష్ట్రానికి చెందిన వాళ్ళను అక్రమంగా దేశం దాటించడానికి దేశ వ్యాప్తంగా ముఠాలు ఏర్పడ్డాయి. వీరు కొందరు ప్రజాప్రతినిధులతో ఒప్పందాలు చేసుకుని గుజరాతీయులను వాళ్ళ కుటుంబీకులుగా మార్చారు. ఆయా ప్రతినిధుల సిఫారసుల ఆధారంగా మారు పేర్లతో గుజరాతీయులకు పాస్‌పోర్టులు అందించారు. సుదీర్ఘకాలం జరిగిన ఈ స్కామ్‌లో ఢిల్లీలో ఎంపీ బాబూభాయ్ కటారా అరెస్టుతో వెలుగులోకి వచ్చింది. నగరంలో నమోదైన కేసులో బోధన్ షకీల్ నిందితుడిగా మారాడు. అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించిన ఈ కేసులో షకీల్ కోసం హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు ముమ్మరంగా గాలించి పట్టుకున్నారు.

కారు కేసులో కుమారుడి కోసం...

నకిలీ పాస్‌పోర్ట్స్ స్కామ్ జరిగిన దాదాపు పదహారేళ్ల తర్వాత 'బీఎండబ్ల్యూ కారు' కేసు చోటు చేసుకుంది. పంజగుట్ట ఠాణా పరిధిలోని ప్రజాభవన్ వద్ద ఆదివారం తెల్లవారుజామున ప్రమాదం జరగడం, నిర్లక్ష్యంగా వాహనం నడిపి, ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం వంటి అంశాలతో ముడిపడి ఉన్న ఈ కేసు నుంచి సాహిల్‌ను తప్పించడానికి పోలీసులు ప్రయత్నించడంతో ఉన్నతాధికారులు జోక్యం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే పంజగుట్ట ఇన్‌స్పెక్టర్ బి.దుర్గారావును సస్పెండ్ చేశారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి పరారీలో ఉన్న సాహిల్ కోసం పంజగుట్టతో పాటు వెస్ట్‌జోన్ పోలీసులు ముమ్మరంగా గాలిస్తు అతడిపై ఎల్‌ఓసీ జారీ చేశారు. షకీల్ ప్రస్తుతం దుబాయ్‌లో ఉన్నాడని, అక్కడ నుంచే కుమారుడని తప్పించే కథ మొత్తం నడిపి, అతడినీ అక్కడికే రప్పించుకున్నాడని ఆరోపణలు ఉన్నాయి.

నాటి కేసులోనూ గోల్‌మాల్ జరిగిందా?

తాజాగా పంజగుట్ట పరిధిలో జరిగిన ఈ ప్రమాదం కేసు గతేడాది నాటి జూబ్లీహిల్స్ యాక్సిడెంట్‌ను మరోసారి తెరపైకి తెచ్చింది. 2022 మార్చి 17 రాత్రి దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్ వైపు నుంచి జూబ్లీహిల్స్ దూసుకువచ్చిన మహేంద్ర థార్ కారు రోడ్డుపై బుడగలు విక్రయించే వారిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన కాజల్ చౌహాన్, సారికా చౌహాన్, సుష్మ భోస్లే గాయపడగా.. కాజల్ కుమారుడు అశ్వతోష్ (రెండు నెలలు) మృతి చెందాడు. ఈ థార్ కారుపై ఎమ్మెల్యే షకీల్ స్టిక్కర్ ఉండటంతో అప్పట్లో సాహిల్‌పై ఆరోపణలు వచ్చాయి. మరుసటి రోజు స్పందించిన షకీల్ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. జూబ్లీహిల్స్‌లో ప్రమాదానికి కారణమైన కారు తన సోదరుడిదని (కజిన్), తానూ అప్పుడప్పుడు వాడుతుంటానని పేర్కొన్నారు. సోదరుడి కుటుంబం కారులో ప్రయాణిస్తుండగా జూబ్లీహిల్స్ రోడ్ నం.45 వద్ద సిగ్నల్ సమీపంలో బెలూన్లు అమ్ముకునే యువతికి కారు వల్ల గాయమైందని, ఆ భయంలో ఆమే పసిపాపను పడేయడంతో దుర్ఘటన జరిగిందని చెప్పుకొచ్చారు. ఆ ఉదంతం చాలా బాధాకరమంటూ జరిగిన విషయాన్ని తాను తన కజిన్‌తో మాట్లాడి తెలుసుకున్నానని షకీల్ పేర్కొన్నారు. పసిపాపను కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకోవాలని చెప్పానని అన్నారు. ఈ కేసులో పోలీసులు సైతం సాహిల్‌కు క్లీన్‌చిట్ ఇచ్చేశారు. తాజాగా పంజగుట్ట కేసులో చోటు చేసుకున్న నాటకీయ పరిణామాల నేపథ్యంలో ఉన్నతాధికారులు నాటి జూబ్లీహిల్స్ కేసును తిరగదోడుతున్నారు. అప్పట్లో జరిగిన ప్రమాదంలోనూ సాహిల్ పాత్ర ఉందా? ఏదైనా గోల్‌మాల్ జరిగిందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తామని పశ్చిమ మండల డీసీపీ ఎస్ఎం విజయ్‌కుమార్ మీడియాకు వెల్లడించారు.

తెలంగాణ ప్రజావేదికకు కార్పొరేషన్ చైర్మన్ ఇవ్వండి


సీడబ్ల్యూసీ మెంబర్ సయ్యద్ నసీర్ హుస్సేన్‌ను కలిసిన బండి సదానంద్ గౌడ్

బంజారాహిల్స్: ఇటీవల జరిగిన తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి తాము పని చేశామని, పార్టీ అధికారంలోకి రావడం తమకు ఎంతో ఆనందంగా ఉందని తెలంగాణ ప్రజా వేదిక అధ్యక్షుడు బండి సదానందం అన్నారు. బుధవారం ఆయన న్యూఢిల్లీలో రాజ్యసభ సభ్యుడు, సీడబ్ల్యూసీ సభ్యుడు, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఆఫీస్ ఇంచార్జి సయ్యద్ నసీర్ హుస్సేన్ ను కలిసి తనకు తెలంగాణ పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మెన్ గా అవకాశం కల్పించాలని వినతి పత్రం అందించారు. పర్యాటక శాఖతో పాటు ఇతర ప్రజా సేవ చేసే కార్పొరేషన్లు ఎన్నో ఉన్నాయని అందులోనైన అవకాశం కల్పించాలని కోరారు.

ఘనంగా అయ్యప్ప స్వామి మహాపడిపూజ


గౌరీ శంకర్ కాలనీలో మహాపడిపూజలో పాల్గొన్న కాంగ్రెస్ నేత పి.విజయారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని గౌరీ శంకర్ కాలనీలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమంలో ఖైరతాబాద్ కాంగ్రెస్ నేత పి. విజయా రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు పెద్ద సంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్‌లో సందడి చేస్తున్న తారలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో ఇండియన్ డిజైనర్స్ హాఫ్ ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌ను బుధవారం సినీ తారలు స్రవంతి చొక్కారపు, ఊర్మిళా చౌహాన్ ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా 75 మంది డిజైనర్లు అరుదైన వస్త్ర కలెక్షన్లు, ఆభరణాలను వివాహాది శుభకార్యాల కోసం ప్రత్యేకంగా రూపొందించి ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు. బనారస్ సిల్క్ చీరలు, హ్యాండీ క్రాఫ్ట్స్ ఈ ప్రదర్శనలో విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ నెల 27, 28 తేదీల్లో ఈ ప్రదర్శన ఉంటుంది. కొనుగోళ్ళపై స్పెషల్ బహుమతులు కూడా ఉన్నాయని లక్కీ విజేటర్లకు కూడా బహుమతులు ఉంటాయని వారు తెలిపారు.

కేలండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌కాలనీ సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీహాల్‌లో బుధవారం అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర కేలడర్‌ను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్, మధురానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కళ్యాణ చక్రవర్తి, పాల్గొన్నారు.

ప్రజాపాలన ఏర్పాట్ల పర్యవేక్షణ


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్

వెంగళరావునగర్: ప్రజాపాలనకు సంబంధించిన దరఖాస్తులను ఎవరైనా విక్రయిస్తున్నట్టుగా తెలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ హెచ్చరించారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన నాలుగు సెంటర్లను బుధవారం ఆమె అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఆయా సెంటర్లలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బారికేడ్లు, కౌంటర్లు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. డీఎంసీ సేవా ఇస్లావత్, ఈఈ రాజ్‌కుమార్, డీఈ రామచంద్రరాజు పాల్గొన్నారు.

29 నుంచి ఎగ్జిబిషన్


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అలీప్ ప్రతినిధులు

పంజగుట్ట: అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (అలీప్) ఆధ్వర్యంలో ఎస్‌ఎమ్‌ఎమ్‌ఈ సహకారంతో ఈ నెల 29 నుండి 31 వరకు అలీప్ వీకార్ట్ 'ఉద్యమీ ఉన్నతీ' పేరుతో నెక్లెస్‌రోడ్డు లోని, పీపుల్స్‌ప్లాజా గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు అలీప్ సెక్రటరీ వి.శ్రీదేవి తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో మొత్తం 72 స్టాల్స్ ఉంటాయన్నారు.


ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఐలయ్యను బుధవారం ఎర్రగడ్డకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, గ్రేటర్ జనరల్ సెక్రెటరీ రవిగౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నేతలు క్రిష్టయ్య, పుటం స్వామి, సుదర్శన్, మల్లేష్, కృష్ణ, నర్సింగ్, రవి, మధు పాల్గొన్నారు. - శ్రీనగర్‌కాలనీ

తెల్లకార్డు లేకున్నా తెల్లకాగితం చాలు

ఎమ్మెల్యే దానం నాగేందర్


సమావేశంలో మాట్లాడుతున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: ప్రజాపాలన సభల కేంద్రాల వద్ద అవసరమైన కుర్చీలు, తాగునీరు, విద్యుత్, టెంట్లు, ఏర్పాటు చేయాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు. ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమం అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయ సమావేశం బుధవారం ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో జరిగింది. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ ధోత్రే, ఖైరతాబాద్ సర్కిల్–17 ప్రజాపాలన నోడల్ అధికారి దేవానంద్, జూబ్లీహిల్స్ సర్కిల్–18 నోడల్ అధికారి కిషన్‌తో పాటు సర్కిల్–18 డీఎంసి ప్రశాంతి, కార్పొరేటర్లు విజయారెడ్డి, మన్నె కవితారెడ్డి, సంగీతా యాదవ్, వెల్దండ వెంకటేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ ప్రజల నుంచి మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ళు, గృహజ్యోతి, చేయూత పథకాలకు దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. సభల వద్ద ప్రజలకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ కేంద్రంలో వికలాంగులకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం జోనల్ కమిషనర్ వెంకటేష్ ధోత్రే మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తుదారుడికి నాలుగు నుంచి అయిదు నిమిషాల సమయం కేటాయించాలన్నారు. పారదర్శకంగా అధికారులు విధులు నిర్వహించాలన్నారు. రేషన్ కార్డు లేని వారి దరఖాస్తులు కూడా తీసుకోవాలన్నారు. తెల్లకాగితం మీద వారి దరఖాస్తులను రాయించి తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులన్నింటిని స్వీకరించాలని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించవద్దని సూచించారు. లబ్ధిదారులు అర్హత అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి షిఫ్ట్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండో షిఫ్ట్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారని అధికారులు తెలిపారు. దీన్ని విజయవంతం చేసే బాధ్యత ప్రతీ అధికారిపై ఉందన్నారు. నియోజక వర్గ వ్యాప్తంగా 16 కేంద్రాల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కేంద్రాలకు ఒకేసారి జనం రాకుండా ఉండేలా ఒక్కో రోజు ఒక్కో బస్తీ, ఒక్కో కాలనీ వచ్చే విధంగా ముందుగానే ప్రణాళికలు రూపొందించినట్లు వారికి మాత్రమే దరఖాస్తు ఫారాలు అందించేలా కార్పొరేటర్లు సహకరించాలని సూచించారు.

ప్రజా పాలన కేంద్రాలివే..

- ◆ వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలో బంజారాహిల్స్ రోడ్‌నెం. 7లోని మీ సేవా కేంద్రం, దేవరకొండ బస్తీ కమ్యూనిటీ హాల్, సుఖ్‌దేవ్‌నగర్ కమ్యూనిటీ హాల్, దూద్‌ఖానా బస్తీ కమ్యూనిటీ హాల్.
- ◆ బంజారాహిల్స్ డివిజన్ పరిధిలో బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని సీఎంటీసీ భవనం, ఉదయ్‌నగర్ కమ్యూనిటీ హాల్, ఎన్బీ నగర్ కమ్యూనిటీ హాల్, ప్రేమ్‌నగర్ కమ్యూనిటీ హాల్.
- ◆ జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలో జూబ్లీహిల్స్ వార్డు కార్యాలయం, ఫిలింనగర్ బీజేఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్, జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్, గౌతంనగర్ కమ్యూనిటీ హాల్.
- ◆ ఖైరతాబాద్ డివిజన్ పరిధిలో శ్రీనివాస్ నగర్ కమ్యూనిటీ హాల్, వెంకటరమణ కాలనీ మహిళా భవన్, దూద్‌ఖానా బస్తీ కమ్యూనిటీ హాల్ అంగన్‌వాడీ, పంజగుట్ట కుమ్మరి బస్తీ కమ్యూనిటీ హాల్.
- ◆ సోమాజిగూడ డివిజన్ పరిధిలో జలమండలి కార్యాలయం పంజగుట్ట ఆఫీసర్స్ కాలనీ, పోచమ్మ బస్తీ కమ్యూనిటీ హాల్, పెద్ద మల్లేష్ యాదవ్ కమ్యూనిటీ హాల్, అంబేద్కర్‌నగర్ కమ్యూనిటీ హాల్

పార్కులో మంచినీటి వసతికి ఏర్పాట్లు చేయండి


వెంగళ్‌రావు పార్కులో పర్యటిస్తున్న కమిషనర్ రొనాల్డ్ రోస్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్‌నెం. 1లోని జలగం వెంగల్ రావు పార్కులో జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్ పలు విభాగాల అధికారులతో కలిసి బుధవారం ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా వాకింగ్ వచ్చిన వాకర్లతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్కులోకి మురుగు నీరు రాకుండా తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. పార్కులో ఉన్న మరుగుదొడ్లను పునర్నిర్మించాలని సూచించారు. అదే విధంగా పార్కులో మంచినీటి వసతికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వెంకటేష్ ధోత్రే, యూబీడీ అధికారులు శ్రీనివాస్, బాలయ్య, ఎంటమాలజీ అధికారులు రజిని, రజిత, ఈఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ పార్కు పరిశీలన..

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45లోని జీహెచ్‌ఎంసీ పార్కును బుధవారం గ్రేటర్ కమిషనర్ రొనాల్డ్ రోస్, ఖైరతాబాద్ జోనల్‌కమిషనర్ వెంకటేష్ ధోత్రే సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈఈ విజయ్‌కుమార్, బాలయ్య, తదితరులతో మాట్లాడిన అధికారులు ఇక్కడి సౌకర్యాలపై ఆరా తీశారు. ఇంకా ఏమేం కావాలో స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పార్కును మరింత సుందరీకరించే దిశలో ప్రణాళికలు రూపొందించాల్సిందిగా సూచించారు. స్థానికుల సహకారంతో పచ్చదనాన్ని మరింతగా పెంపొందించాలన్నారు.

కర్బన ఉద్గారాలు తగ్గించడం పరిశ్రమ లక్ష్యం కావాలి

నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ డైరెక్టర్ మోహన్ రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: కర్బన ఉద్గారాలను తగ్గించాలని పరిశ్రమలు నిర్ణయించాయని నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) కే మోహన్ రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా నైవేలి సంస్థ కూడా సౌర, పవన విద్యుత్ ఉత్పాదనతో పాటు పర్యావరణ మైనింగ్‌కు పెద్ద పీట వేస్తుందని తెలిపారు. ఈక్రమంలో ఇండియన్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజనీర్స్ (ఐఐఐఈ)తో ఒప్పందం చేసుకున్నామని పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఇకపై ఏ ఖనిజ పరిశ్రమైనా సరే రెండు వంతుల వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంటే మూడు వంతులు పర్యావరణానికి మేలు చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పరిశ్రమలపై ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో పర్యావరణానికి మేలు చేసే పద్ధతులను అమలు పర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఐఐఐఈ హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షులు ఎం ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. గతంలో తాము ఎన్‌టీపీసీ, కోల్ ఇండియా, బీహెచ్ఈఎల్ వంటి ప్రముఖ సంస్థలతో ఒప్పందం చేసుకొని పర్యావరణ అనుకూల చర్యలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఏవీవీ ప్రసాద్ రాజు, చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్ సుదర్శన్ రెడ్డి, ఆర్ శ్యాం సుందర్, సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ కుమార్ సుర్, సీనియర్ అధికారులు పవన్ కుమార్ ఆదుర్తి కృష్ణ, కేఎం మంజునాథ, డాక్టర్ ఏ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆర్ట్ సొసైటీ ఆవిర్భావం



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ ప్రతినిధులు

పంజగుట్ట: కళాకారులను అందర్నీ ఒక్క వేదికపైకి తీసుకువచ్చేందుకు తెలంగాణ ఆర్ట్ సొసైటీ ప్రారంభిస్తున్నట్లు సొసైటీ ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సొసైటీ ఆవిర్భావ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు ఎస్.మధుమోహన్, విద్య వెంకట్, డి.వి.రమణలు మాట్లాడారు. ప్రస్తుత తరుణంలో టెక్నాలజీ పెరిగి కళాకారులకు ప్రాధాన్యత తగ్గుతుందని దీంతో వారి ఆర్థిక పరిస్థితి దుర్భరమౌతోందని ఆవేదనవ్యక్తం చేశారు. కళాకారుల ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ ఆర్థికస్థితి గతులను మెరుగుపరుచుకుని రాబోయే తరాలను కూడా ఉత్తేజపరచడం సంఘం లక్ష్యమన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.21, నల్లవంకాయ.55, పొడుగువంకాయ.45, బెండకాయ.50, పచ్చిమిర్చి.45, బజ్జిమిర్చి.50, క్యాప్సికం.70, పచ్చి కాకరకాయ.71, పందిరిబీర.45, క్యాబేజీ.16, క్యారెట్.40, దొండకాయ.50, గుండు బీన్సీస్.45, గింజ చిక్కుడు.70, గోకరకాయ.55, కీర.13, దోసకాయ.28, బీట్‌రూట్.25, ఉల్లిగడ్డ.20, ఆలుగడ్డ.21, చామగడ్డ.45, మొరంగడ్డ.23, కందగడ్డ.45, గుమ్మడికాయ.13, క్యాలిఫ్లవర్.23, సొరకాయ.17, పొట్లకాయ.18, అరిటికాయ.09, మునగకాయ.4-6, ఉల్లిపారక.35.

మాతృభాషను గౌరవించాలి


తెలుగు వెలుగు పురస్కారాన్ని అందిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

బంజారాహిల్స్: మాతృభాషను గౌరవించాలని, సంస్కారాన్ని పెపొందించుకోవాలని మాజీ భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు అన్నారు. జూబ్లీహిల్స్‌లో ఇట్‌క్లా సంస్థ 28వ వార్షికోత్సవం పురస్కరించుకుని తెలుగు వెలుగు పురస్కారాలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై అవార్డులను ప్రదానం చేశారు. ఆయా రంగాల్లో నిష్ణాతులైన సూపర్ సీనియర్ సిటీజన్‌లకు వెంకయ్యనాయుడు సత్కరించి తెలుగు వెలుగు పురస్కారాన్ని అందించారు. ఇట్ క్లా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కె.ధర్మారావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బంజారాహిల్స్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి(40) మృతి చెందిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రీతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని కమాన్ వద్ద గత నెల 10వ తేదీన ఓ వ్యక్తి(40) రోడ్డు దాటుతుండగా అటు వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో గాయాలపాలైన వ్యక్తిని బంజారాహిల్స్ పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సదరు వ్యక్తి మృతి చెందగా పోలీసులు ఆ వ్యక్తి గురించి అన్ని ప్రాంతాలు వాకబు చేశారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో ఫొటో ఆధారంగా ఆరా తీసినా ఉపయోగం లేకుండా పోయింది. మృతదేహం గాంధీ మార్చురీలో ఉందని గుర్తుపట్టిన వారు 8712660451 నెంబర్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

డాక్టర్ అంజయ్య సేవలు మరువలేనివి

కవాడిగూడ: రజకులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించిన మహోన్నత వ్యక్తి, రజక (ధోబి) అభివృద్ధి సంస్థ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మండలపు అంజయ్య సేవలు మరువలేనివని, వారి ఆశయ సాధన కోసం యువత పాటుపడాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు ఎం.పి డాక్టర్ కె. లక్ష్మణ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌లు పిలుపునిచ్చారు. డాక్టర్ ఎం అంజయ్య ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని లోయర్ ట్యాంక్‌బండ్‌లోని షిర్డి సాయిబాబా ఆలయం వద్ద తెలంగాణ రజక (ధోబి) అభివృద్ధి సంస్థ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ అంజయ్య నిత్యం సమాజ శ్రేయస్సు కోసం పరితపించేవారని గుర్తుచేశారు. తెలంగాణ రజక (ధోబి) అభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మరాజు కృష్ణమూర్తి, వర్కింగ్ చైర్మన్ మందలపు గాంధీ పాల్గొన్నారు.

నేరెళ్ల వేణుమాధవ్‌కు నివాళి

చిక్కడపల్లి: మిమిక్రీని శాస్త్రీయ కళగా తెలుగు విశ్వవిద్యాలయంలో బోధనాంశంగా నెలకొల్పేందుకు నేరెళ్ళ వేణుమాధవ్ చేసిన కృషి విస్మరించలేమని ప్రముఖ నటుడు, మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం శ్రీ త్యాగరాయగానసభలో మిమిక్రీ ఆర్టిస్ట్స్ ఫేర్ అసోసియేషన్ గానసభ సంయుక్త నిర్వహణలో ప్రముఖ మిమిక్రీ కళాకారుడు డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ జయంతి సందర్భంగా మిమిక్రీ పోటీలు నిర్వహించారు. సుమారు వందకు పైగా కళా కారులు పోటీలో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా శివారెడ్డి పాల్గొని తన నటనకు దోహదపడిందని వివరించారు. సంస్థ అధ్యక్షుడు చంద్రముఖి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీసీ కులగణనను చేపట్టాలి

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు బీసీ కులగణనను వెంటనే చేపట్టాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడ, మోతీమార్కెట్‌లోని బీసీ మహాసభ కార్యాలయంలో అయన మాట్లాడుతూ బీసీల జనాభా ప్రకారం ఎన్నికలలో రిజర్వేషన్లు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ నేతలు డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, భూషన్ భాస్కర్, ప్రదీప్ గౌడ్, నల్లెల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శైలజ

వెంగళరావునగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్నిశాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 ప్రత్యేక అధికారి శైలజ పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్ ఆవరణలోని మంజీర కమ్యూనిటీహాల్‌లో బుధవారం పోలీస్, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ తదితర శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శైజల మాట్లాడుతూ దరఖాస్తుల స్వీకరణ మొదటి ప్రాధాన్యతను మహిళలకు, వికలాంగులకు, వృద్ధులకు ఇవ్వాలని సూచించారు. గురు, శుక్రవారాల్లో ప్రజల నుంచి విశేషస్పందన వచ్చే అవకాశం ఉన్నందున తాకిడిని తట్టుకోవడానికి స్లిప్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.

◆ ఒక్కో డివిజన్‌కు నాలుగు సెంటర్ల చొప్పున ఏర్పాటు చేశామని, సెంటర్‌కు నోడల్ అధికారి, 10 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారని తెలియజేశారు. అదేవిధంగా ఒక సెంటర్‌కు 500 దరఖాస్తుల చొప్పున నాలుగు సెంటర్లలో కలిపి 2 వేల దరఖాస్తులు రోజుకు స్వీకరిస్తామన్నారు.

యూసుఫ్‌గూడ బస్తీ దవాఖానా

◆ రహమత్‌నగర్ డివిజన్ ప్రజలకు రహమత్‌నగర్ కమ్యూనిటీహాల్, బ్రహ్మశంకర్‌నగర్ కమ్యూనిటీ హాల్, ఎస్‌పీఆర్‌హిల్స్ ప్రభాత్‌నగర్ కమ్యూనిటీ హాల్, హబీబ్‌ఫాతిమానగర్ కమ్యూనిటీహాల్.

◆ ఎర్రగడ్డ డివిజన్ ప్రజలకు ఫాతిమానగర్ కమ్యూనిటీహాల్, సుల్తాన్‌నగర్ కమ్యూనిటీహాల్, ప్రేమ్‌నగర్ కమ్యూనిటీహాల్, శాస్త్రీనగర్ కమ్యూనిటీహాల్.

◆ బోరబండ డివిజన్ ప్రజలకు బోరబండలోని వార్డు కార్యాలయం, బంజారానగర్ కమ్యూనిటీ హాల్, సాయిబాబానగర్ కమ్యూనిటీహాల్, ఎస్‌ఆర్ ఆర్‌పురం సైట్–1లోని షహీద్ తుర్రేబాజ్ ఖాన్ కమ్యూనిటీహాల్‌లలో ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

సర్కిల్–19లో ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ కేంద్రాలు....

◆ వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ప్రజలకు జవహర్‌నగర్ ఎస్‌సి హాస్టల్, మధురానగర్ కమ్యూనిటీహాల్, ఐసీఐసీఐ బ్యాంకు సమీపంలోని కళ్యాణ్‌నగర్ వెంచర్–1, ఈస్ట్ రహమత్‌నగర్ అంబేద్కర్‌నగర్ కమ్యూనిటీహాల్.

◆ యూసుఫ్‌గూడ డివిజన్ ప్రజలకు వెంకటగిరిలోని కమ్యూనిటీహాల్, శ్రీకృష్ణానగర్‌లోని కమ్యూనిటీహాల్, కమలాపురి కమ్యూనిటీహాల్

న్యాయశాఖ ఉన్నత స్థానాల్లో ముస్లింలకు ప్రాధాన్యం ఇవ్వాలి


సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ..

పంజగుట్ట: న్యాయశాఖలో ఉన్నత స్థానాల్లో ముస్లిం మైనార్టీలకు జనాభా ప్రాతిపాదికన స్థానం కల్పించాలని ది ఆల్ ఇండియా అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ మిర్జ నిస్సార్ అహ్మద్ బేగ్ ప్రభుత్వాన్ని కోరారు. గత 76 సంవత్సరాల్లో అడ్వకేట్ జనరల్, అడిషనల్ అడ్వకేట్ జనరల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పదవులు ముస్లింలకు ఇవ్వలేదని కేవలం గవర్నమెంట్ ప్లీడర్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కే పరిమితం చేశారని ఆవేదనవ్యక్తం చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నిరంగాల్లో మైనార్టీలకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. న్యాయశాఖలో కూడా తగు న్యాయం చెయ్యాలని జనాభా దామాషా ప్రకారం న్యాయశాఖ ఉన్నత స్థానాల్లో తమకు స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

వలంటీర్ల ఆగ్రహజ్వాలల్లో
పచ్చపత్రికల దహనం

- ఈనాడు, ఆంధ్రజ్యోతి తప్పుడు కథనాలు రాస్తున్నాయి
- ఎల్లోమీడియాకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్ల నిరసనలు


నాగలదిన్నెలో ఈనాడు, ఆంధ్రజ్యోతి పేపర్లను దహనం చేస్తున్న వలంటీర్లు

నందవరం/హుకుంపేట/పెదకూరపాడు/కోళ్లపాలెం/కపిలేశ్వరపురం: ఏపీలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా సేవాభావంతో నిరంతరం పనిచేస్తున్న వలంటీర్లు.. తమపై వస్తున్న తప్పుడు కథనాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము సమ్మె చేస్తామన్నామని, ఆడుదాం ఆంధ్రాలో పాల్గొనడంలేదని ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. తప్పుడు వార్తలు రాస్తున్న ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల ప్రతుల్ని పలుచోట్ల దహనం చేశారు. పలు ప్రాంతాల్లో వివిధ పద్ధతుల్లో నిరసన తెలిపారు. ఈనాడు రామోజీ, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఏబీఎన్, ఈటీవీ, టీవీ 5 చానళ్లు అసత్య ప్రసారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. తమకు సమ్మె, నిరసనలు చేసే ఆలోచనలే లేవని ముక్తకంఠంతో నినదించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ఇంటింటికి చేరవేస్తున్న తమపై ఈనాడు, ఆంధ్రజ్యోతి తప్పుడు ప్రచారం చేస్తున్నాయంటూ వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి మంచిపేరు వస్తుండటంతో ఈ విధమైన అక్కసు వెళ్లగక్కుతున్నాయని చెప్పారు. తమకు ఎలాంటి సమ్మె, నిరసనలు చేసే ఉద్దేశం లేదని, అసత్యవార్తలతో వలంటీర్ల ఐక్యతను దెబ్బతీయలేరని స్పష్టం చేశారు.

..ఏఐటీయూసీ జయభేరి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాతినిధ్యం నిలుపుకోగలిగింది. 2012, 2017లోసత్తా చాటిన బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ ఈఎన్నికల్లో ఖాతా తెరవలేదు.

పోలింగ్ సరళి ఇలా...!: గురువారం ఉదయం నుంచే కార్మికులు బారులుదీరారు. అన్ని ఏరియాల్లో కలిపి ఉదయం 8గంటల వరకు 14.62 శాతం పోలింగ్ నమోదుకాగా, 9గంటలకు 27.05 శాతం, 10గంటలకు 38.67శాతం, 11గంటలకు 49.89శాతం, 12గంటలకు 59.33శాతం, మధ్యాహ్నం 1గంటకు 67.67శాతం 2గంటలకు 75.41శాతం, 3గంటల వరకు 85.92 శాతం, 4గంటలకు 93.09 శాతం , పోలింగ్ ముగిసే సాయంత్రం 5గంటల వరకు మొత్తంగా 94.15 శాతంగా నమోదైంది.

ఎవరు 'ప్రాతినిధ్యం'... ఎవరు గుర్తింపు సంఘం

సింగరేణివ్యాప్తంగా ఉన్న 11ఏరియాలు ఉండగా, ఆయా ఏరియాల్లో అత్యధికంగా ఓట్లు సాధించిన యూనియన్‌ను ప్రాతినిధ్య సంఘంగా గుర్తిస్తారు. పదకొండు ఏరియాల్లోనూ అత్యధికంగా ఓట్లు లభించిన యూని యన్‌ను గుర్తింపు సంఘంగా ప్రకటిస్తారు. సింగరేణిలో ఏడోసారి నిర్వహించిన ఎన్నికల్లో 11 ఏరియాల్లో 6 చోట్ల ఐఎన్‌టీయూసీ 5 చోట్ల గెలిచి ఏఐటీయూసీ ప్రాతినిధ్య సంఘాలుగా విజయం సాధించాయి. మొత్తంగా సింగరేణివ్యాప్తంగా అత్యధిక ఓట్లు సాధించి ఏఐటీయూసీ సంఘం గుర్తింపు సంఘంగా విజయకేతనం ఎగురవేసింది.


సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో ఐఎన్‌టీయూసీ విజయంతో కార్మికుల సంబరాలు

2017లో ఇలా: కేవలం రెండు డివిజన్లకే పరిమితమై ఏఐటీయూసీ ఈసారి ఐదు చోట్ల గెలవగా, ప్రాతినిధ్యం లేని ఐఎన్‌టీయూసీ ఆరుచోట్ల గెలవగా, 9 డివిజన్లలో ప్రాతినిధ్యమున్న టీబీజీకేఎస్ ఈసారి అడ్రస్ లేకుండా పోయింది.

ఆయా ఎన్నికల్లో గుర్తింపు ఇలా

1998	- ఏఐటీయూసీ
2001	- ఏఐటీయూసీ
2003	- ఐఎన్‌టీయూసీ
2007	- ఏఐటీయూసీ
2012	- టీబీజీకేఎస్
2017	- టీబీజీకేఎస్
2023	- ఏఐటీయూసీ

ఆయా ఏరియాల్లో ఇలా...

ఏరియా	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం	ప్రాతినిధ్యం	మెజారిటీ
రామగుండం-1	5,384	5,044	93.68	ఏఐటీయూసీ	417
రామగుండం-2	3,556	3,369	94.74	ఏఐటీయూసీ	333
రామగుండం-3	3,884	3,612	93.00	ఐఎన్‌టీయూసీ	104
భూపాలపల్లి	5,410	5,123	94.70	ఐఎన్‌టీయూసీ	826
బెల్లంపల్లి	996	959	96.29	ఏఐటీయూసీ	122
మందమర్రి	4,835	4,515	93.38	ఏఐటీయూసీ	469
శ్రీరాంపూర్	9,127	8,491	93.03	ఏఐటీయూసీ	2,166
కొత్తగూడెం	2,326	2,207	94.88	ఐఎన్‌టీయూసీ	233
ఇల్లందు	614	604	98.37	ఐఎన్‌టీయూసీ	46
మణుగూరు	2,450	2,378	97.06	ఐఎన్‌టీయూసీ	02
సీఓఆర్‌పీ	1,191	1,145	96.14	ఐఎన్‌టీయూసీ	324
మొత్తం	39,773	37,447	94.15		

అమెరికాలో రోడ్డు ప్రమాదం..
ఐదుగురు ఏపీ వాసుల దుర్మరణం

మృతులంతా ముమ్మిడివరం ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పినతండ్రి కుటుంబ సభ్యులు

అమలాపురం టౌన్: అమెరికాలోని టెక్సాస్‌లో జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన పొన్నాడ నాగేశ్వరరావు కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. ఇందులో మృతుడు నాగేశ్వరరావు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్‌కు స్వయానా పినతండ్రి. నాగేశ్వరరావు(65)తో పాటు ఆయన భార్య సీతామహాలక్ష్మి(60) కుమార్తె పోతాబత్తుల నవీన గంగ(38), ఆమె కుమారుడు కృతిక్(11), కుమార్తె నిషిధ(9) మృత్యువాత పడ్డారు. నాగేశ్వరరావు అల్లుడు పోతాబత్తుల లోకేశ్ తీవ్రంగా గాయపడి అక్కడే ఓ ఆస్పత్రిలో అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నారు. టెక్సాస్ జాతీయ రహదారిపై నాగేశ్వరరావు కుటుంబం కారులో వెళుతోంది. పక్కనే వస్తున్న ట్రక్కు, కారు బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ విషయాన్ని టెక్సాస్‌లోని ఓ న్యూస్ చానల్ ప్రకటించింది.


అమెరికా టెక్సాస్‌లో రోడ్డు ప్రమాద దృశ్యం

ట్రక్కులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి కూడా మరణించినట్టు పేర్కొంది. అమలాపురంలో పొన్నాడ నాగేశ్వరరావు టింబర్ డిపో వ్యాపారిగా కోనసీమలో గత మూడున్నర దశాబ్దాలుగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. మూడో కుమార్తె నవీన గంగ కుటుంబం అమెరికాలో స్థిరపడింది. రెండు నెలల కిందట అమలాపురం వచ్చిన నవీన గంగ తిరిగి ఆ దేశానికి వెళుతూ తన తండ్రి నాగేశ్వరరావు, తల్లి సీతామహాలక్ష్మిని వెంట తీసుకుని వెళ్లింది. మంగళవారం సాయంత్రం ఓ పిక్నిక్ స్పాట్‌కు వెళ్లే సమయంలో వారిని మృత్యువు కబళించింది.

రాంగోపాల్ వర్మను చంపుతాం

తామంతా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అనుచరులమంటూ బెదిరింపు

బంజారాహిల్స్ (హైదరాబాద్): ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మను చంపుతామంటూ నినాదాలు చేయడమే కాకుండా ఆయన అంతు చూస్తామంటూ బెదిరిస్తూ కార్యాలయం ముందు దిష్టిబొమ్మ దగ్ధం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ రాంగోపాల్ వర్మ పీఏ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నం.71లోని రాంగోపాల్‌వర్మ కార్యాలయం వద్దకు ఈనెల 25న రాత్రి 12 నుంచి 15 మంది వరకు వచ్చి నినాదాలు చేస్తూ బెదిరింపులకు గురిచేస్తూ ఆర్జీవీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారని తెలిపారు. ఆ సమయంలో తమతో పాటు ఆర్జీవీ గన్‌మెన్, ఇతర సిబ్బంది అడ్డుకోవడానికి యత్నించగా తమపై దాడికి పాల్పడ్డారని పీఏ జిలాని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తామంతా ఏపీ మాజీ సీఎం చంద్రబాబు, నారా లోకేశ్, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అనుచరులమని చెప్పారన్నారు. వారి నుంచి ఆర్జీవీకి ప్రాణహాని ఉందని పేర్కొన్నారు.

నా తల నరికే వ్యాఖ్యలను బాబు, పవన్, లోకేశ్‌లు సమర్థిస్తున్నట్టే..



సాక్షి, అమరావతి: 'నా తల నరికితే రూ.కోటి ఇస్తానని అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొలికపూడి శ్రీనివాసరావు చెప్పిన మాటలను 24 గంటలు గడిచినా చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్‌లు ఖండించలేదు. అంటే ఆయన మాటలను వారు సమర్థిస్తున్నట్టే భావించాలి' అని ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ పేర్కొన్నారు. టీవీ 5 చానల్లో ఓ డిబేట్‌లో కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యూహం సినిమా తీసిన రామ్‌గోపాల్ వర్మ తలనరికి తెస్తే రూ.కోటి ఇస్తానని ఆఫర్ ఇవ్వడం కలకలం సృష్టించింది. దీనిపై ఈ సినిమా నిర్మాత దాసరి కిరణ్‌కుమార్‌తో కలసి దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డికి బుధవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం బయట మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తనను చంపడానికి శ్రీనివాసరావు టీవీలో ప్రత్యక్ష ప్రసారం అవుతున్న డిబేట్‌లోనే ఓపెన్ ఆఫర్ ఇచ్చారన్నారు. ఆయన మాటలతో కిరాయి హంతకులు, ఇతరులు ఎవరైనా ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కొలికపూడి శ్రీనివాసరావుతో పాటు ఆ డిబేట్‌కు వ్యాఖ్యాత సాంబశివరావు, టీవీ 5 చానల్ యజమాని బీఆర్ నాయుడుపై డీజీపీకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

గ్రూప్-2 పరీక్షలు మళ్లీ వాయిదా

▶ మొదటి పేజీ తరువాయి

నిర్ణయమే కీలకమవుతుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సైతం బుధవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షలపై సమీక్షించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అంతలోనే టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం.

గతేడాది డిసెంబర్‌లో విడుదలైన నోటిఫికేషన్..

రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో 783 గ్రూప్-2 ఉద్యోగ ఖాళీలకు టీఎస్‌పీఎస్సీ గతేడాది డిసెంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించగా... రాష్ట్రవ్యాప్తంగా 5.5 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం టీఎస్‌పీఎస్సీ గ్రూప్-2 పరీక్షలను ఈ ఏడాది ఆగస్టు 29, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. కానీ టీఎస్‌పీఎస్సీలో ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో పలు రకాల పరీక్షలు రద్దు కాగా, కొన్ని పరీక్షలు రీషెడ్యూల్ అయ్యాయి. ఆ తర్వాత గ్రూప్-2 పరీక్షలను నవంబర్ 2,3 తేదీల్లో నిర్వహించనున్నట్లు కమిషన్ ప్రకటించింది. పరీక్షల సన్నద్ధతకు సమయం కావాలంటూ అభ్యర్థులు ఆందోళన చేయడం, ఈలోగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పరీక్షల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతాయని భావించిన కమిషన్ అధికారులు వచ్చే జనవరి 6, 7 తేదీలకు వాయిదా వేశారు. తాజాగా కమిషన్ చైర్మన్, సభ్యులు లేకపోవడంతో గ్రూప్-2 పరీక్షలు మరోమారు వాయిదా పడ్డాయి.

మళ్లీ మేడిగడ్డ, అన్నారం మునుగుతాయి

- సలహాదారుడు పెంటారెడ్డి హెచ్చరిక
- పంప్‌హౌజ్‌ల కంట్రోల్ యూనిట్‌ను ఎత్తైన ప్రాంతానికి తరలిస్తేనే నష్ట నివారణ
- నిర్మాణసమయంలో ఎత్తు తగ్గించడం వల్లనే పంప్‌హౌజ్‌లు మునిగాయని ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ, అన్నారం పంప్‌హౌజ్‌లు మళ్లీ నీటమునిగే ప్రమాదముందని రాష్ట్ర నీటిపారుదల శాఖ సలహాదారులు పెంటారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన జలసౌధలో మీడియాతో మాట్లాడారు. పంప్‌హౌజ్‌లకు సంబంధించిన కంట్రోల్ యూనిట్‌ను ఎత్తైన సురక్షిత ప్రాంతానికి తరలిస్తేనే మళ్లీ నష్టం జరగకుండా నివారించవచ్చని సూచించారు. మేడిగడ్డ పంప్‌హౌజ్‌ను 126 మీటర్ల ఎత్తులో కట్టడానికి తొలుత అనుమతిస్తే తర్వాత 120 మీటర్లకు తగ్గించి జెన్‌కో నుంచి డిజైన్లకు ఆమోదం తీసుకున్నారని ఆరోపించారు. అన్నారం పంప్‌హౌజ్‌ను తొలుత 131 మీటర్ల ఎత్తులో కట్టడానికి అనుమతిస్తే 125 మీటర్లకు తగ్గించారని తెలిపారు. ఎత్తును తగ్గించడంతోనే పంప్‌హౌజ్‌లు మునిగినట్టు ఆరోపించారు. 2022లో మునిగిన తరహాలోనే మళ్లీ ఈ రెండు పంప్ హౌజ్‌లు మునుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యారేజీల గరిష్ట నిల్వ మట్టం(ఎఫ్ఆర్ఎల్) కంటే ఎక్కువ ఎత్తులో పంప్‌హౌజ్‌లను కట్టాల్సి ఉండగా, తక్కువ ఎత్తులో నిర్మించడంతోనే సమస్యలొచ్చాయన్నారు.

నాటి మంత్రి ఒత్తిడితో భూగర్భంలో నిర్మించారు

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కూడా పంప్‌హౌజ్‌లను భూఉపరితలంలో నిర్మించాలని సిఫారసు చేస్తే, నాటి మంత్రి ఒత్తిడితో భూగర్భంలో నిర్మించారని ఆరోపించారు. మోటార్లు ఎఫ్ఆర్ఎల్‌కి తక్కువ ఎత్తులో పెట్టినా పెద్దగా నష్టం ఉండదని, కంట్రోల్ ప్యానెళ్లు, స్టార్టర్లు మాత్రం ఎత్తులో ఉండాల్సిందేనన్నారు. పటేల్ కంపెనీ తీరుతోనే కల్వకుర్తి లిఫ్టులోని పంప్‌హౌజ్ నీటమునిగి భారీ నష్టం జరిగిందని ఆరోపించారు.

నగర వార్తలు

కృత్రిమ మేధతో ఆరోగ్యరంగంలో సానుకూల మార్పులు
- మంత్రి శ్రీధర్ బాబు



సాక్షి,సిటీబ్యూరో: ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సానుకూల మార్పులకు దోహదం చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు-వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో బుధవారం ఆరోగ్యరంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావం అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. డిజిటల్ యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆరోగ్య రంగంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు, దీని ద్వారా వేగంగా రోగనిర్ధారణ చేయగల సామర్థ్యం సమకూరడంతో పాటు రోగి కోలుకునేందుకు దోహదం చేసే పలు వ్యవస్థల మధ్య సమన్వయం సాధ్యపడుతుందన్నారు. ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి, మాట్లాడుతూ.. టెక్నాలజీ వేగంగా మార్పు చేర్పులకు గురవుతోందని, ఏఐ ద్వారా రోగులకు ఉత్తమమైన సేవలను అందించడానికి వీలవుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఏఐ ఆధారిత ఆరోగ్య సంరక్షణ సేవలను రూపొందించడానికి ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు సహకరిస్తామన్నారు. అంతర్జాతీయ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అమెరికన్ సొసైటీ ఆఫ్ ఏఐ ఎండోస్కోపీ భావి అధ్యక్షుడు డాక్టర్ ప్రతీక్ శర్మ తదితర ప్రముఖులు మాట్లాడారు. ఈ సదస్సులో వైద్యులు, సాంకేతిక నిపుణులు, ఏఐ పరిశోధకులు పాల్గొన్నారు.

ఒకే వేదికపై 500 రకాల భారతీయ స్వీట్స్

మరోసారి ప్రపంచ రికార్డు కోసం సీఏఐ ప్రయత్నం

సనత్‌నగర్: ఒకే వేదికపై దాదాపు 500 రకాల భారతీయ స్వీట్స్‌ను ప్రదర్శించి ఔరా అనిపించారు. దేశంలోని ఆయా రాష్ట్రాల్లో ముఖ్యమైన స్వీట్స్ తయారుచేసి ప్రదర్శించారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని బేగంపేటలోని కలనరీ అకాడమీ ఆఫ్ ఇండియా (సీఏఐ) ఇందుకు వేదికయ్యింది. 'ఇండియా డిజర్ట్' పేరుతో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, తూర్పు నుంచి పడమర వరకు అన్ని రాష్ట్రాల స్వీట్స్ వీక్షకుల నోరూరించాయి. ఈ సందర్భంగా కలనరీ అకాడమీ ఆఫ్ ఇండియా చెఫ్ అక్షయ్ కులకర్ణి మాట్లాడుతూ.. 350 మంది విద్యార్థులు, పాకశాస్త్ర నిపుణులు 72 గంటల పాటు శ్రమించి వీటిని తయారుచేసినట్లు చెప్పారు. ఇంతకుముందు కూడా ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించి ఆరు ప్రపంచ రికార్డులు సాధించామని, ఇప్పుడు ఏడోసారి ప్రపంచ రికార్డుకు ప్రయత్నం చేసినట్లు వివరించారు. భారతీయ సంప్రదాయ స్వీట్స్‌ను తయారుచేసి వాటిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ ప్రయత్నం చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కలనరీ అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మన్, ప్రిన్సిపాల్ సుధాకర్ ఎస్.రావు, అతీక్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.


ఇండియా డిజర్ట్ పేరుతో ప్రదర్శనకు ఉంచిన స్వీట్స్

ఓయూ-ఎన్‌టీపీసీల మధ్య అవగాహన ఒప్పందం

సాక్షి, సిటీబ్యూరో: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం మైనింగ్ విభాగానికి తనవంతు ఆర్థిక సహకారం అందించేందుకు ఎన్‌టీపీసీ ముందుకొచ్చింది. ఈ మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఎన్‌టీపీసీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. మైనింగ్ విభాగం నూతన భవన నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించనున్నట్లు పేర్కొంది. ఎన్‌టీపీసీ సౌత్‌హెడ్ ఛటోపాధ్యాయ, వర్సిటీ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ ఎంఓయూపై సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీపీసీ హెచ్ఆర్ జీఎం ఎస్ఎన్ పానిగ్రహి, మైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ శివరాం వెంకటేష్ పాల్గొన్నారు. యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు లబ్ధి పొందనున్నారు.




బీసీ అధికారులపై వేధింపులు మానుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: తెలంగాణలో బీసీ అధికారులపై వేధింపులు వెంటనే మానుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన బుధవారం కాచిగూడలో జరిగిన బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అప్కా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నవీన్‌కుమార్ ఐపీఎస్‌ను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని బీసీ అధికారులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. బుధవారం ఉదయం నవీన్‌కుమార్ తన నివాసం బంజారాహిల్స్ నుంచి డ్యూటీకి వెళ్తుండగా మఫ్టీలో 15మంది పోలీసులు ఎలాంటి కారణం లేకుండా, ఎలాంటి విషయం చెప్పకుండా అరెస్ట్ చేసి సీసీఎస్‌కి తరలించారన్నారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఒక బీసీ అధికారిని అరెస్ట్ చేయడం దారుణమన్నారు. నీతి, నిజాయితీగా పని చేస్తున్న బీసీ అధికారి డాక్టర్ నవీన్ కుమార్ ప్రమోషన్ ఆపడానికి ఎన్నో ఎత్తుగడలు వేస్తున్నారని ఆయన ఆరోపించారు. అక్రమ మార్గంలో బీసీలపై కేసులు పెట్టడం, బీసీలను అణిచివేయడం తగదని హెచ్చరించారు. బీసీలు ఇప్పుడిప్పుడే చదువుకొని ఐఏఎస్, ఐపీఎస్‌లో 50 శాతం ఉండాల్సిన జనాభాలో 9శాతం కూడా లేకపోవడం సిగ్గు చేటని పేర్కొన్నారు. ఐపీఎస్‌లుగా పనిచేస్తున్న బీసీల్లో ఒక్కరిద్దరు ఉన్నా కూడా అగ్రకులాలు ఓర్వలేక ప్రమోషన్లు వస్తే తట్టుకోలేక పోతున్నారని ఆరోపించారు. మరోసారి బీసీల పట్ల ఇలాంటి సంఘటనలు జరిగితే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంచి పాలన కొనసాగిస్తున్నారని, కొందరు వ్యక్తిగత కారణాలతో, ఈర్ష్య, ద్వేషాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావడం తగదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు నీలం వెంకటేష్, వేముల రామకృష్ణ, బి.సాహిత్, కృష్ణ యాదవ్, అంజి, పృథ్వీగౌడ్ ఉదయ్ నేత, అనంతయ్య, మధుసూదన్, నిఖిల్, మట్ట జయంతి, కరుణశ్రీ, వాణి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఈ- కేవైసీ కోసం క్యూ..


జగద్గిరిగుట్టలో బారులు తీరిన వినియోగదారులు

సాక్షి, సిటీబ్యూరో: వంటగ్యాస్ కనెక్షన్లకు ఈ-కేవైసీ చేయించేందుకు వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల ముందు బారులు తీరుతున్నారు. ఈ-కేవైసీ పూర్తి చేసుకోకపోతే త్వరలో ప్రభుత్వం అమలు తలపెట్టిన రూ.500 సబ్సిడీ సిలిండర్ వర్తించదన్న పుకార్లతో వినియోగదారుల్లో ఆందోళ మొదలైంది. దీంతో గ్యాస్ ఏజెన్సీల ముందు భారీగా పెద్ద ఎత్తున క్యూ కడుతున్నారు. గ్యాస్ ఏజెన్సీలు మాత్రం చమురు సంస్థల ఆదేశాలతో మాత్రమే ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు. రూ.500 సిలిండర్‌తో సంబంధం లేదని, అలాంటి ఆదేశాలు రాలేదని డీలర్లు వాఖ్యానిస్తున్నారు.

డ్రగ్స్ విక్రేత అరెస్టు

శంషాబాద్ రూరల్: నిషేధిత మత్తు పదార్థాలను విక్రయించేందుకు యత్నిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, డ్రగ్స్‌ను సీజ్ చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా వాసి వెల్పుల సత్యనారాయణ శంషాబాద్ పట్టణంలోని ఆర్‌బీ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. బుధవారం ప్లాస్టిక్ కవర్‌లో మత్తు పదార్థాలతో తొండుపల్లి వద్ద నిలబడి ఉన్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని అతన్ని విచారించారు. తనిఖీ చేయగా.. రెండు చిన్న సంచుల్లో 14 గ్రాముల మత్తుపదార్థం దొరికింది. కాచిగూడలోని మల్లేష్ అనే వ్యక్తి నుంచి ఈ డ్రగ్‌ను రూ.3500 గ్రాము చొప్పున కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ డ్రగ్‌ను ఇతను విద్యార్థులకు గ్రాముకు రూ.6 వేల నుంచి రూ.6,500లకు అమ్ముతుంటాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల్లో కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వేముల వీరేశం, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు భారీ మెజార్టీతో విజయం సాధించినందుకు మొక్కు చెల్లింపులో భాగంగా జనవరి మూడు నుంచి ఏడు వరకు వందమంది విద్యార్థులతో ఉస్మానియా యూనివర్సిటీ నుండి నల్లగొండ జిల్లా చెరువుగట్టు ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు టీపీసీసీ రాష్ట్ర నాయకులు నోముల శేషు యాదవ్ ప్రకటించారు. ఈ మేరకు బుధవారం రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతులమీదుగా పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్, వంగపల్లి రమేష్, బొంగు వెంకటేష్ గౌడ్, వెంకటాచారి, శ్రీనివాస్, నరసింహ, లింగాచారి తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు బీజేపీ చేస్తున్న మోసంపై ప్రచారం చేస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

- పిడమర్తి రవి

పంజగుట్ట: మాదిగలకు బీజేపీ చేస్తున్న మోసాన్ని అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో తిరిగి ప్రచారం చేస్తామని తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి హెచ్చరించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ సమావేశాలు ముగిశాయని, కాని ఇప్పటికీ ఎస్సీ వర్గీకరణ బిల్లు మాత్రం బీజేపీ పార్లమెంట్‌లో పెట్టలేదని, ఇంకా సంప్రదింపు స్థాయిలో ఉన్నట్లు కమిటీ వేయడం బీజేపీ మాదిగలకు మోసం చేస్తుందని స్పష్టంగా అర్థమయ్యిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ మోసానికి వ్యతిరేకంగా జనవరి 2 నుంచి అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీజేపీ చేసిన మోసాన్ని ఎండగడతామని హెచ్చరించారు. ఫిబ్రవరిలో జరిగే ఆఖరు పార్లమెంట్ సమావేశాల్లో అయినా బీజేపీ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత, మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు ఆమోదించాలని డిమాండ్ చేశారు. మాదిగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో చలో ఢిల్లీ కార్యక్రమం చేపడతామన్నారు. అప్పుడు కూడా బిల్లు పెట్టకపోతే మార్చ్ 1 నుంచి మాదిగల జంగ్ యాత్ర తెలంగాణ రాష్ట్రం మొత్తం చేసి బీజేపీ ఓటమే లక్ష్యంగా ముందుకు పోతామన్నారు. ఈ సందర్భంగా మాదిగ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నక్క మహేష్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో వివిధ మాదిగ సంఘాల నాయకులు గద్ద యాదయ్య, మైస ఉపేందర్, బి.బాబూరావు, గోవిందరావు, కనక వంశీ, హరికృష్ణ పాల్గొన్నారు.

స్టాళ్లలో సందడి

లాలాపేట: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభోత్సవం సందర్భంగా బుధవారం లాలాపేటలోని ప్రొ. జయశంకర్ స్టేడియంలో వివిధ కేంద్ర ప్రభుత్వ స్టాల్‌లను ఏర్పాటు చేశారు. ఎస్‌బీఐ, హిందూస్థాన్ పెట్రోలియం, ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్ స్టాల్, మెడికల్ అండ్ హెల్త్ స్టాల్, ఆధార్ అప్డేట్ తదితర స్టాల్‌లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా లబ్ధిదారుల నుంచి అప్పటికప్పుడే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌లు చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల కోసం పెద్ద ఎత్తున స్థానికులు తరలి వచ్చారు. దీంతో స్టాలన్నీ ప్రజలతో కిట కిటలాడాయి. స్వయంగా వైద్యురాలైన రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందరరాజన్ అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్‌లను సందర్శించారు. మెడికల్ హెల్త్ స్టాల్‌లోని వైద్యులు, వైద్య సిబ్బందితో కొంచెం సేపు మాట్లాడారు. ఎస్‌సీడీ స్క్రీనింగ్‌పై వివరాలను అడిగి తెలుసుకున్నారు. టీబీ పేషంట్లకు మందులు, ఆహార పదార్థాల కి ట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటి, డీఐఓ డాక్టర్ శ్రీకళ, ఎస్పీహెచ్ఓ డాక్టర్ జయశ్రీ, డాక్టర్ వీరస్వామి, డా, సరిత, వైద్య సిబ్బంది సత్యవతి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


మెడికల్ స్టాల్‌ను పరిశీలిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

నేటి నుంచి హ్యాపీనెస్ కప్ క్రికెట్ టోర్నీ


సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ సెలెబ్రిటీ క్రికెట్ లీగ్ (ఐసీసీఎల్) ఆధ్వర్యంలో నేటి నుంచి హ్యాపీనెస్ కప్ టోర్నమెంట్ జరుగుతుంది. దేశంలోని దివ్యాంగులైన ప్రొఫెషనల్ ప్లేయర్లు ఈ టోర్నీలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. భారత అంగవైకల్య క్రికెట్ కౌన్సిల్ (డీసీసీఐ), భారత దివ్యాంగుల క్రికెట్ సంఘం (పీసీసీఏఐ) ఈ ఈవెంట్‌కు మద్దతు తెలిపాయి. ప్రతిభకు వైకల్యం శాపం కాదని చేతలతో నిరూపించేందుకు ఈ తరహా టోర్నీని గత మూడేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఎల్బీస్టేడియంలో గురువారం నుంచి 30వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీలో ఈ సారి రెగ్యులర్‌గా పాల్గొనే 3 జట్లతో (టైటాన్స్, కింగ్స్, రాయల్స్)పాటు... ఆఖరి రోజు మహిళా దివ్యాంగుల జట్ల (ఫైటర్స్, స్ట్రయికర్స్) మధ్య మ్యాచ్ నిర్వహించనున్నట్లు ఐసీసీఎల్ తెలిపింది. ఈ మ్యాచ్‌లను ఎవరైనా ఉచితంగా వీక్షించవచ్చు. ఎలాంటి ఎంట్రీ ఫీజు, టిక్కెట్లు లేవని భారత క్రికెట్‌ను ప్రోత్సహించినట్లే ఈ దివ్యాంగుల టోర్నీకి మద్దతు తెలిపి వారి ప్రదర్శనకు నైతిక స్థైర్యం ఇవ్వాలని ఐసీసీఎల్ కోరింది. బుధవారం జరిగే ప్రారంభోత్సవ వేడుకకు తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి టోర్నీని లాంఛనంగా ప్రారంభిస్తారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 28-12-2023

2023 - తెలంగాణ మహిళ

తమను తాము బాగు చేసుకోవడంతోపాటు తమ చుట్టూ ఉన్న పరిస్థితులను కూడా తీర్చిదిద్దితే ఎలా ఉంటుందో ఈ యేడాది తెలుగు మహిళ నిరూపించింది. విభిన్న రంగాలలో విశేషమైన కృషి చేసి, ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచిన తెలంగాణ మహిళను మరోసారి స్ఫురణకు తెచ్చుకుందాం. రాబోయే సంవత్సరానికి ప్రేరణగా వీరితో కలిసి మరెన్నో అడుగులు వేద్దాం.

ఈ ఏడాది స్ఫూర్తి వీరే!





ఊరంతా బాగు // మీనాక్షి గాడ్గె, సర్పంచ్

మూడేళ్లక్రితం వరకు ఒక మామూలు పల్లె అది. కానీ, నేడు దేశ వ్యాప్తంగా వార్తల్లో నిలిచే స్థాయికి ఎదిగింది. దానికి కారణం సర్పంచ్ మీనాక్షి గాడ్గె. ఆమె కృషి, పట్టుదల అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరా గ్రామాన్ని అద్భుతమైన గ్రామంగా తీర్చిదిద్దాయి. ఇంటర్మీడియెట్ వరకు చదివిన మీనాక్షి ఏకగ్రీవంగా సర్పంచ్ పదవికి ఎన్నియ్యింది. మరుగుదొడ్లు కట్టించడం, తాగునీరు ప్రతి ఇంటికి అందేలా చేయడమే కాకుండా ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత ఏర్పాటు చేసి వాన నీరు ఆ గుంటలో పోయేలా చేసిందామె. వాగుపైన వంతెన కట్టించింది. పక్కా రోడ్ల నిర్మాణం, సైడు కాలవల శుభ్రత, స్కూల్‌కు కొత్త భవనం, ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధనను ఏర్పాటు చేయించింది. ఊళ్లో సంపూర్ణ మద్య నిషేధం అమలుతోపాటు హరిత హారంలో భాగంగా పదివేల మొక్కలు నాటించి, వాటి బాధ్యతను గ్రామస్తులే తీసుకునేలా చేసింది. తడి చెత్త నుంచి ఎరువు తయారు చేసి, పంచాయితీకి లాభం చేస్తోంది. సోలార్ గ్రిడ్లు ఏర్పాటు చేసింది. ఊళ్లోనే నర్సరీ ఉంది. ఊళ్లో జరిగే అంగడిలో నగదు రహిత లావాదేవీలు జరుపుతున్నారు. తడిచెత్త- పొడి చెత్త విభజనను ఇప్పుడు ప్రతి ఒక్కరూ పాటిస్తున్నారు. ఇన్ని మార్పులు తీసుకు వచ్చిన మీనాక్షిని కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖ ఈ యేడాది స్వచ్ఛ సుజల్ శక్తి సమ్మాన్ అవార్డ్‌తో సత్కరించింది.

భారతజట్టులో స్థానం

గొంగడి త్రిష (యువ క్రికెటర్)



భద్రాచల వాసి త్రిష అండర్-19 మహిళల వరల్డ్ కప్ -2023 ఫైనల్లో టీమిండియాను జగజ్జేతగా నిలపడంలో కీలకపాత్ర పోషించింది. ఫిట్‌నెస్ కోచ్ అయిన తండ్రి రామిరెడ్డి ద్వారా మూడేళ్ల వయసులోనే క్రికెట్‌లో ఓనమాలు దిద్దిన త్రిష ఎనిమిదేళ్ల వయసులో హైదరాబాద్ అండర్ -16 జట్టులో చేరింది. తర్వాత హైదరాబాద్ స్పోర్ట్స్ అకాడమీలో చేరి, క్రికెటర్‌గా తనను తాను మెరుగుపరుచుకుంటూ భారతజట్టులో స్థానం దక్కించుకుంది. చదువు, ఆటలను బ్యాలెన్స్ చేసుకుంటూ వెళ్లడమే తన ముందున్న లక్ష్యాలు అని చెప్పే త్రిష నవతరపు అమ్మాయిలకు రోల్ మోడల్‌గా నిలుస్తోంది.

సాహసమే ఊపిరి

అన్వితారెడ్డి (పర్వతారోహకురాలు)



రాష్ట్రానికి చెందిన 24 ఏళ్ల అన్వితారెడ్డి పర్వతారోహణలో సరికొత్త రికార్డ్ నెలకొల్పింది. ఎవరెస్టు శిఖరాన్ని ఐదురోజుల్లోనే లక్ష్యాన్ని పూర్తి చేసి వార్తల్లో నిలిచింది. పడమటి అన్వితారెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లావాసి. ప్రస్తుతం భువనగిరిలోని రాక్ క్లైంబింగ్ స్కూల్‌లో శిక్షకురాలిగా పనిచేస్తోంది. ఎంతోమంది ఔత్సాహిక యువతీయువకులకు మెలకువలు నేర్పిస్తూనే అడ్వాన్స్‌డ్ కోర్సులను పూర్తి చేసింది. పర్వతారోహణలో మొదటి ప్రొఫెషనల్ కోచ్‌గానూ గుర్తింపు పొందింది. గతంలో సిక్కింలోని రీనాక్, బీసీరాయ్, కిలిమంజారో, లదాక్‌లోని కడే, ఎల్బ్రూస్ పర్వతాలు అధిరోహించింది. పర్వతారోహణలో ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ, సవాళ్లను అధిగమించే స్థాయికి చేరుకోవడానికి ఎంతో కృషి, సాధన అవసరం. అన్విత ఏర్పరుచుకున్న ఆశయాలు ప్రతి ఆడపిల్లకు ఆదర్శం. అన్విత సాహసాలు ఎందరికో మార్గ నిర్దేశం చేస్తున్నాయి.

అవగాహనే ప్రధానం

రేగట్టె వెంకటరమణ (అంగన్‌వాడీ టీచర్)



జాతీయ స్థాయి ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా తెలంగాణలోని సూర్యాపేట జిల్లా, చివ్వెంల మండలం, ఖాసింపేట గ్రామం నుంచి రేగట్టె వెంకటరమణ ఎంపికయ్యింది. విధుల్లో ఉత్తమ సేవలు అందించినందుకు ఈ అవార్డును అందుకొని వార్తల్లో నిలిచింది వెంకటరమణ. ఇంటింటికీ వెళ్లి మహిళలు, పిల్లల ఆరోగ్యం గురించి కనుక్కోవడం, జాగ్రత్తలు సూచించడం, కౌన్సెలింగ్స్ ఇవ్వడం దినచర్యగా చెబుతుంది. గర్భిణులకు సీమంతాలు, స్కూల్ డే, చిల్డ్రన్ డే వంటి కార్యక్రమాలను పురస్కరించుకొని అందరికీ ఆరోగ్యం కోసం అవగాహన కల్పించడంలో ముందుండే వెంకట రమణ చేస్తున్న కృషిని ప్రభుత్వం గుర్తించింది.

ప్రైవేటుకు దీటుగా

నూగూరి అర్చన (ప్రధానోపాధ్యాయురాలు)



మంచిర్యాల జిల్లా రెబ్బెనపల్లి ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న నూగూరి అర్చన ఈ యేడాది జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను అర్చన తీర్చిదిద్దారు. దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతోపాటు ఆమె సొంత ఖర్చులతో పిల్లలకు నాణ్యమైన విద్యాబోధన చేస్తూ రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాల అంటే అందరూ మెచ్చుకునేలా తీర్చిదిద్దారు. గిరిజన చిన్నారులకు ప్రత్యేకంగా స్కూల్‌కి ఆటోలు ఏర్పాటు చేసి, మరీ చదువుకు ఊతమిస్తున్నారు. అర్చన విద్యాసేవకు ఇప్పటికే మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ పురస్కారం అందుకున్న అర్చన ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

2023కు వీడ్కోలు

365 రోజులు...
జీవితమనే అంతులేని ప్రయాణంలో
2023వ సంవత్సరం ఈ 365 రోజులు
మనకెన్నో జ్ఞాపకాలు, అనుభవాలు,
సంతోషాలు, సవాళ్లు ఇచ్చి ఉంటుంది.
ఈ ప్రయాణం మనం ఒక్కరమేచేయగలమా?
ఎందరో సాయం చేసి ఉంటారు.
వారికి మనస్ఫూర్తిగా థ్యాంక్యూ చెప్పామో లేదో.
ఇప్పుడు చెబుదామా.
కొందరిని తెలిసో తెలియకో హర్ట్ చేసి ఉంటాం.
ఎంత బాధ పడ్డారో ఏమో.. సారీ చెబుదామా.
పాత సంవత్సరం అకౌంట్లు సెటిల్ చేసుకొని
కొత్త సంవత్సరంలోకి అడుగు పెడదామా?

వాళ్లకు సారీ చెప్పారా? వీళ్లతో థ్యాంక్యూ అన్నారా?



ఏదో హెల్త్ ఇష్యూస్ వచ్చి ఉంటాయి. ఎవరినో సలహా అడిగి ఉంటాం. హాస్పిటల్‌కు తోడు రమ్మని చెప్పి ఉంటాం. అప్పు అడిగి ఉంటాం. వారు ఇచ్చి ఉంటారు. ఆ హడావిడిలో వారికి సరైన థ్యాంక్యూ చెప్పి ఉండం. పట్టించుకోరులే అనుకుంటాం. కాని పట్టించుకుంటారు. మనకు ఈ సంవత్సరం ఇంత సాయం చేసిన వారికి ఈ సంవత్సరాంతంలో కాల్ చేసి, లేదా ఇంటికి వెళ్లి, ఈ సంవత్సరం ఫలానా టైమ్‌లో మీరు నాకు ఈ సాయం చేశారు... థ్యాంక్యూ అని చెప్పి చూడండి... వాళ్ల కళ్లల్లో నీళ్లు చిప్పిల్లుతాయి... మీ కళ్లల్లో కూడా. చెబుదామా?

సాయం చేసిన వాళ్లు అవతలి వారి నుంచి కృతజ్ఞతను ఆశించరు కానీ అలాగని కృతజ్ఞత తెలియచేయడం కనీస బాధ్యత కదా! అసలు మేలు చేస్తేనే థ్యాంక్యూ చెప్పాలా? మీ ఇరుగున ఒక ఇల్లు, పొరుగున ఒక ఇల్లు ఉంటుంది. వారితో ఏ తగాదా గొడవా లేకుండానే హ్యాపీగా ఈ సంవత్సరం గడిచిపోయింది. వాళ్లను పలకరించి 'ఈ సంవత్సరమంతా మనం స్నేహంగా ఉన్నాం. అందుకు థ్యాంక్యూ. వచ్చే సంవత్సరం కూడా ఇలాగే ఉందాం' అని చిన్న స్వీట్ ఇచ్చి చూడండి. ఆ మేజిక్ ఎలా ఉంటుందో. మీ ఆఫీస్‌లో కలీగ్స్‌తో 'థ్యాంక్యూ... ఈ సంవత్సరమంతా మనం కలిసి మెలిసి పని చేసినందుకు' అని టీకి పిలవండి... అదీ చిన్న మేజిక్ కాదు. ఒక సంవత్సరం దాటి వచ్చినందుకు ఎందరికో కృతజ్ఞత ప్రకటించాలి. తల్లిదండ్రులకు, తోడ బుట్టిన వారికి, మిత్రులకు... వీరున్నారనే ధైర్యం వల్లే కదా... ప్రతి రోజునూ చులాగ్గా దాటాం.

వీరికి థ్యాంక్స్ చెప్పండి: ఈ సంవత్సరమంతా మనకు ఇంటి సాయం చేసిన పని మనిషికి, కారు డ్రైవర్‌కు, ప్రయాణాలకు టికెట్లు బుక్ చేసిచ్చిన ఏజెంట్‌కు, పిల్లలకు ట్యూషన్ చెప్పిన టీచర్‌కు, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌కు, ఫ్యామిలీ డాక్టర్‌కు... డబ్బు చెల్లించే పని చేయించుకుని ఉండొచ్చు. డబ్బు ఇచ్చినా అలాంటి పని చేసేవారు దొరకనప్పుడు తెలుస్తుంది వారి విలువ. అందుకే థ్యాంక్స్ చెప్పండి. బాగుంటుంది. ఇక మీకు సపోర్ట్‌గా నిలిచిన స్నేహితులకు కాల్ చేసి, వారు ఏ సందర్భంలో ఎంత సపోర్ట్ చేశారో చెప్పి థ్యాంక్స్ చెప్పండి. ఊళ్లో ఉన్న అమ్మా నాన్నలను ఎవరో ఒక పక్కింటి పిన్ని పలకరించి బాగోగులు గమనిస్తుంటుంది. ఆమెకు థ్యాంక్స్ చెప్పండి. మన పిల్లలను రోజూ ఆటకు పిలిచి వారితో స్నేహంగా ఆడుతున్న పిల్లలకూ థ్యాంక్స్ చెప్పండి. వారు ఇంకా విలువైన వారు. అన్నింటికీ మించి మన పట్ల కనికరంగా ఉన్న ప్రకృతికి. కరుణతో ఉన్న రుతువులకి, తిన్న ప్రతి అన్నం ముద్దకి, మీరు విశ్వసించే ఈశ్వరునికి థ్యాంక్స్ చెప్పండి.

వీరితో సారీ చెప్పండి: ఈ సంవత్సరం రెండు మూడుసార్లు కూడా వెళ్లి చూడటం కుదరని తల్లిదండ్రులకు, తోబుట్టువులకు, అన్నదమ్ములకు... 'సారీ.. మీరంటే ఎంతో ప్రేమ... కాని కలవడం కుదరలేదు' అని చెప్పండి. మనసు తేలిక అవుతుంది. ఎందరో స్నేహితులు, బంధువులు శుభకార్యాలకు పిలిచి ఉంటారు. వెళ్లి ఉండరు. వారికి పనిగట్టుకుని ఫోన్ చేసి సారీ చెప్పండి. ఇకపై తప్పక వస్తామని చెప్పండి. బాగా ఆత్మీయులు కొందరు స్వర్గస్తులై ఉంటారు. ఏదో కారణాన వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి ఉండరు. ఇప్పుడు ఫోన్ చేసి వీలైతే కలిసి సహేతుకమైన కారణం చెప్పి సారీ చెప్పండి. కొందరు మీరు చేయదగ్గ సాయం అడిగినా మీరు నిర్లక్ష్యంతో చేసి ఉండరు. వారు బాధ పడిన విషయం కూడా మీకు తెలిసి ఉండదు. గుర్తు తెచ్చుకుని సారీ చెప్పండి. ఎవరికో ఏవో వాగ్దానాలు చేసి తప్పి ఉంటారు. సారీ చెప్పండి. భార్య భర్తను బాధించిన సందర్భాలకు, భర్త భార్యను కష్టపెట్టిన సందర్భాలకు తప్పక ఒకరికొకరు సారీ చెప్పాలి. పిల్లల్ని చిన్నబుచ్చిన సందర్భాలకు కూడా వారికి సారీ చెప్పాలి. చేజారిన బంధాలు, స్నేహాలు... పలచబడిన బాంధవ్యాలు కేవలం 'థ్యాంక్యూ', 'సారీ' అనే రెండు పదాలతో తిరిగి అతుక్కుంటాయి.

రెండు మూడు రోజులు టైమ్ ఉంది. తెమిలి కూచుని ఇతరుల ఒప్పులను, మీ తప్పులను లిస్ట్ చేసుకుని ఎవరికి ఏం చెప్పాలో అది చెప్పి కొత్త సంవత్సరాన్ని ఉత్సాహంగా మొదలెట్టండి.

గెలుపు దారి

మనీమంత్ర కవితాగానం

'కష్టపడగానే సరిపోదు... ఆ కష్టానికి తగిన ఫలితం ఉండాలి. ప్రతిభ ఉండగానే సరిపోదు... దానికి తగిన ప్రతిఫలం ఉండాలి' అంటుంది కవితా షెనాయ్.

అడ్వర్‌టైజింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసిన కవితకు వినియోగదారుల నాడి తెలుసు.

తగిన ప్రతిభ, సామర్థ్యాలు ఉండి కూడా నష్టాలతో చతికిల పడుతున్న కంపెనీలను చూసిన తరువాత 'వోయిరో' స్టార్టప్‌కు శ్రీకారం చుట్టింది.

ఈ సాస్(సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్) స్టార్టప్ దక్షిణ ఆఫ్రికాలోని 'డీఎస్‌టీవీ' చానల్‌తో సహా మనదేశంలోని పెద్ద వోటీటీ ప్లాట్‌ఫామ్‌లు, డిజిటల్ పబ్లిషర్‌లతో కలిసి పనిచేస్తోంది....



కవితా షెనాయ్

మేకప్ ఆర్టిస్ట్, వీడియో ఎడిటర్‌గా మంచి పేరు తెచ్చుకున్న కవిత షినాయ్ ఆ తరువాత ఎడ్వర్‌టైజింగ్ ప్రపంచంలోకి అడుగు పెట్టింది. ఆనంద్ గోపాల్, అనీల్ కారట్, జితిన్ జార్జ్‌లతో కలిసి బెంగళూరు కేంద్రంగా 'వోయిరో' సాస్ స్టార్టప్ మొదలుపెట్టింది. దీనికిముందు కంటెంట్ క్రియేటర్‌లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ఎదుర్కొనే సమస్యలను అర్థం చేసుకోవడానికి తన బృందంతో కలిసి స్వయంగా కంటెంట్ క్రియేట్ చేసేది.

ముంబై యూనివర్శిటీలో ఎకనామిక్స్ చదువుకున్న కవిత మార్కెటింగ్ కమ్యూనికేషన్ కంపెనీ 'లోవ్ లింటస్' తో కలిసి పనిచేసింది. ఆ తరువాత యూట్యూబ్ టీమ్‌తో పనిచేసింది. చదివిన చదువు, పెద్ద సంస్థలతో కలిసి పనిచేసిన అనుభవం 'వోయిరో' ప్రయాణంలో తనకు ఉపకరించాయి.



ఒక స్టార్టప్‌కు తొలి విజయ సంకేతం... నిధుల సమీకరణ. నిధుల సమీకరణకు సంబంధించి 'వోయిరో'కు ఎలాంటి సమస్యలు ఎదురు కాలేదు. ఇక రెండో సవాలు ఇతరులు తమ మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడం. ఎంతోమందితో మాట్లాడి, ఎన్నో సలహాలు తీసుకోవడం ద్వారా రెండో సవాలును కూడా అధిగమించింది. డిజిటల్ పబ్లిషర్స్, వోటీటీ ప్లాట్‌ఫామ్‌ల ఆదాయ వృద్ధికి కంటెంట్‌ను మానిటైజేషన్ చేయడం అనేది కీలకం. మార్కెట్, సాంకేతికత, డేటా అనే మూడురకాల అంశాలలో పట్టు ఉండాలి. అది కవితా షెనాయ్ పని తీరులో కనిపిస్తుంది.

ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది

వ్యాపార ప్రస్థానంలో 'ఇక ముందుకు వెళ్లలేము' అని నిరాశపడే పరిస్థితి రావచ్చు. దీనికి లొంగిపోకుండా పట్టుదలతో ముందుకు వెళితే విజయం మనల్ని వెదుక్కుంటూ వస్తుంది. ఎంత పెద్ద సమస్యకైనా ఒక పరిష్కారం ఉంటుంది. ఆ పరిష్కార మార్గాలను అన్వేషించడంలో మన ఓపిక, కష్టపడేతత్వం గెలుపును నిర్ణయిస్తాయి.

'వోయిరో ప్రారంభానికి ముందు ఇండస్ట్రీ పెద్దల నుంచి కుటుంబసభ్యులు, స్నేహితుల వరకు ఎంతోమంది నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నాం. అవగాహన చేసుకుంటూ, అధ్యయనం చేస్తూ లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. ఓటీటీకి సంబంధించి మార్కెట్ తీరుతెన్నులను విశ్లేషిస్తూ మా పనితీరును మెరుగు పరుచుకుంటూ, పరిధిని విస్తరిస్తూ వెళ్లాం.

– కవితా షెనాయ్, వోయిరో–ఫౌండర్, సీయివో

డిజిటల్ పబ్లిషర్‌లు, వోటీటీ ప్లాట్‌ఫామ్స్‌తో 'వోయిరో'కు సంబంధించి సేల్స్ టీమ్, యాడ్ ఆపరేషన్ టీమ్, ఫైనాన్స్ టీమ్, స్ట్రాటజీ టీమ్ అనే నాలుగు బృందాలు కలిసి పనిచేస్తాయి.

మీడియా కంపెనీలకు రెవెన్యూ అనలటిక్స్‌ను అందుబాటులో తీసుకురావడం నుంచి బలమైన ఏపీఐ (అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్) స్ట్రాటజీని అనుసరించడం వరకు తనదైన దారిలో ప్రయాణిస్తోంది వోయిరో.

కోవిడ్ కల్లోల సమయంలో అన్ని కంపెనీల లాగే 'వోయిరో'కు సమస్యలు ఎదురైనప్పటికి వోటీటీ పరిశ్రమ, కంటెంట్ స్పేస్ పుంజుకోవడంతో పెద్దగా ప్రభావం చూపలేదు.

'మీడియాతో అంటే నాకు ఉన్న ఇష్టం, అభిమానం వోయిరో ఆవిర్భావానికి కారణం అయింది. డిజిటల్ పబ్లిషర్‌లు, కంటెంట్ క్రియేటర్‌లకు వివిధ విషయాలకు సంబంధించి సాంకేతిక పరిజ్ఞానం అవసరం అనే ఉద్దేశంతో ఈ వెంచర్ ప్రారంభించాం. లాభాల కంటే కూడా ఇతరులకు సహాయం చేయాలి, వారి విధానాలలో మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో వోయిరో ప్రారంభించాం. అయితే అది అంత సులువైన విషయం కాదని అర్థమైంది. మా ప్రయాణంలో ఎన్నో విషయాలు నేర్చుకొని ముందుకు వెళుతున్నాం. మీడియా, డిజిటల్ పబ్లిషర్‌లు నష్టపోకుండా మార్గనిర్దేశం చేయడం మా లక్ష్యం' అంటుంది కవిత షెనాయ్.

● ముగ్గు-ముచ్చట



ఎస్.మానస
కడియం, రాజమండ్రి

9 చుక్కలు
మధ్యచుక్క
5 వచ్చేవరకు






ఎస్.శ్రీలత
కరీంనగర్

23 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకు



19 చుక్కలు
19 వరసలు





బెన్నూరి
ఉమాదేవి
సికింద్రాబాద్



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com



ప్రిక్వార్టర్ ఫైనల్లో సహజ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో సింగిల్స్ విభాగంలో హైదరాబాద్ అమ్మాయి సహజ యామలపల్లి శుభారంభం చేసింది. నవీ ముంబైలో జరుగుతున్న ఈ టోర్నీలో బుధవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో సహజ 5-7, 6-1, 6-2తో హైదరాబాద్‌కే చెందిన శ్రీవల్లి రష్మికపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 2 గంటల 29 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ ఆరు ఏస్‌లు సంధించింది. రష్మిక సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసిన సహజ తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయింది.

ఎనిమిదేళ్ల తర్వాత జాతీయ జిమ్నాస్టిక్స్ పోటీల్లో...

భారత మహిళా స్టార్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ ఎనిమిదేళ్ల తర్వాత జాతీయ సీనియర్ చాంపియన్‌షిప్‌లో పోటీపడనుంది. జనవరి 2 నుంచి భువనేశ్వర్‌లో ఈ టోర్నీ జరుగుతుంది. 30 ఏళ్ల దీపా 2016 రియో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంతో సంచలనం సృష్టించింది. ఆ తర్వాత మోకాలి గాయంతో ఆటకు దూరమైంది. పునరాగమనం తర్వాత డోపింగ్ పరీక్షలో పట్టుబడి 21 నెలలపాటు నిషేధానికి గురైంది. నిషేధం గడువు పూర్తి కావడంతో ఆమె మళ్లీ బరిలోకి దిగుతోంది.



రెండో స్థానంలో హంపి



సమర్‌కండ్ (ఉజ్బెకిస్తాన్): ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి రెండో రోజూ అద్భుత ఆటతో ఆకట్టుకుంది. తొలి రోజు నాలుగు రౌండ్ల తర్వాత మూడు పాయింట్లతో 15వ ర్యాంక్‌లో ఉన్న హంపి... రెండో రోజు రెండో స్థానానికి ఎగబాకింది. బుధవారం హంపి మూడు గేముల్లో గెలిచి, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకొని 8 రౌండ్ల తర్వాత 6.5 పాయింట్లతో మో జై (చైనా)తో కలిసి సంయుక్తంగా రెండో స్థానానికి చేరుకుంది. 7 పాయింట్లతో అనస్తాసియా బొద్నారుక్ (రష్యా) అగ్రస్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన యువతార నూతక్కి ప్రియాంక కూడా అద్భుతంగా ఆడింది. తొలి రోజు 2 పాయింట్లతో 61వ ర్యాంక్‌లో ఉన్న ప్రియాంక బుధవారం ఆడిన నాలుగు గేముల్లోనూ గెలిచి 6 పాయింట్లతో 10వ ర్యాంక్‌కు చేరుకోవడం విశేషం. భారత్‌కే చెందిన వైశాలి, దివ్య దేశ్‌ముఖ్ 5 పాయింట్లతో వరుసగా 23, 31వ ర్యాంక్‌లో... ద్రోణవల్లి హారిక 4.5 పాయింట్లతో 40వ ర్యాంక్‌లో ఉన్నారు.

న్యూజిలాండ్‌లో బంగ్లాదేశ్ తొలి టి20 విజయం



నేపియర్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న బంగ్లాదేశ్ జట్టు... టి20 ఫార్మాట్‌లో తొలిసారి న్యూజిలాండ్ గడ్డపై న్యూజిలాండ్‌ను ఓడించింది. గతంలో న్యూజిలాండ్‌లో ఆడిన తొమ్మిది టి20 మ్యాచ్‌ల్లోనూ బంగ్లాదేశ్‌కు ఓటమి ఎదురైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఐదు వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై గెలిచింది. మొదట న్యూజిలాండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 134 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మెహది హసన్ (2/14), ముస్తఫిజుర్ (2/15), షోరిఫుల్ (3/26) న్యూజిలాండ్‌ను కట్టడి చేశారు. అనంతరం బంగ్లాదేశ్ 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 137 పరుగులు సాధించి విజయాన్ని అందుకుంది. లిటన్ దాస్ (36 బంతుల్లో 42 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), మెహది హసన్ (16 బంతుల్లో 19 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు.

ఎల్గర్ అజేయ సెంచరీతో...

'బాక్సింగ్ డే' టెస్టుపై దక్షిణాఫ్రికా ఆధిక్యం కనబరుస్తోంది. రెండో రోజు ఆటలో భారత్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 245 పరుగులకు ఆలౌట్ చేసిన సఫారీ బ్యాటింగ్‌లోనూ సత్తా చాటుకుంది. దక్షిణాఫ్రికా ఆరంభానికి సిరాజ్ తూట్లు పొడిచినప్పటికీ ఓపెనర్ డీన్ ఎల్గర్ (అజేయ) శతకంతో సాఫీగా సాగిపోయింది. రెండు పటిష్టమైన భాగస్వామ్యాలతో సఫారీ తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సంపాదించేందుకు ఎల్గర్ కీలకపాత్ర పోషించాడు.

- దక్షిణాఫ్రికాకు ఆధిక్యం
- తొలి ఇన్నింగ్స్‌లో 256/5
- శతక్కొట్టిన రాహుల్
- భారత్ 245 ఆలౌట్



రాహుల్



ఎల్గర్

సెంచూరి యన్: ఓవర్‌నైట్ బ్యాటర్ కేఎల్ రాహుల్ సెంచరీ మినహా తొలి టెస్టులో రెండో రోజంతా దక్షిణాఫ్రికా హవానే నడిచింది. ఓపెనర్ ఎల్గర్ చక్కని సెంచరీతో సఫారీ భారీ స్కోరుపై కన్నేసింది. తద్వారా దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యాన్ని పెంచుకునేందుకు పట్టుబిగిస్తోంది. బుధవారం రెండో రోజు ఆటలో తొలుత భారత్ తొలి ఇన్నింగ్స్ 67.4 ఓవర్లలో 245 పరుగుల వద్ద ముగిసింది. రాహుల్ (137 బంతుల్లో 101; 14 ఫోర్లు, 4 సిక్స్‌లు) టెస్టుల్లో ఎనిమిదో శతకం సాధించాడు. మొదటి రోజే రబడ 5 వికెట్లు తీయగా, రెండో రోజు మిగిలిన రెండు వికెట్లలో కొయెట్జీ (1/74), బర్గర్ (3/50) చెరొకటి తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా ఆట నిలిచే సమయానికి 66 ఓవర్లలో 5 వికెట్లకు 256 పరుగులు చేసి 11 పరుగుల ఆధిక్యం పొందింది. ఎల్గర్ (140 బ్యాటింగ్; 23 ఫోర్లు), జాన్సెన్ (3 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. బుమ్రా, సిరాజ్ చెరో 2 వికెట్లు పడగొట్టాడు.

శతకం పూర్తయ్యాక ఆలౌట్!

వర్షం, గ్రౌండ్ తడి ఆరడానికి సమయం పట్టడంతో రెండో రోజు కూడా ఆట ఆలస్యంగానే మొదలైంది. ఓవర్‌నైట్ స్కోరు 208/8తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ తొలి సెషన్‌లో 8.4 ఓవర్లు మాత్రమే ఆడగలిగింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు రాహుల్, సిరాజ్ (5) తొమ్మిదో వికెట్‌కు 47 పరుగులు జోడించారు. రాహుల్ సెంచరీకి చేరువయ్యాక కొయెట్జీ 65వ ఓవర్ తొలి బంతికి సిరాజ్‌ను అవుట్ చేశాడు. అదే ఓవర్ ఆఖరి బంతికి భారీ సిక్సర్‌తో రాహుల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కాసేపటికే బర్గర్ అతన్ని బౌల్డ్ చేయడంతో 245 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌కు తెరపడింది.

సిరాజ్ దెబ్బ తీసినా...

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ఆరంభంలోనే సిరాజ్ దెబ్బ కొట్టాడు. ఓపెనర్ మార్క్‌రమ్ (5) కీపర్ క్యాచ్‌తో వెనుదిరిగేలా చేశాడు. అయితే భారత శిబిరానికి ఈ ఆనందం తర్వాత శ్రమించక తప్పలేదు. క్రీజులో ఉన్న మరో ఓపెనర్ ఎల్గర్‌కు జతయిన టోనీ డి జార్జి (28; 5 ఫోర్లు) భారత బౌలర్లను తేలిగ్గా ఎదుర్కొన్నారు. 49/1 స్కోరువద్ద తొలి సెషన్ ముగియగా... రెండో సెషన్‌లోనూ ఈ జోడీ భారత బౌలింగ్ దళాన్ని కష్టపెట్టింది. ఎల్గర్ అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా... సఫారీ స్కోరు వంద దాటింది. ఈ దశలో బుమ్రా రెండు కీలక వికెట్లను (జార్జి, పీటర్సన్) పడగొట్టి టీమిండియాను ఊరడించాడు. దాంతో దక్షిణాఫ్రికా 113 పరుగుల వద్ద 3 వికెట్లను కోల్పోయి ఆత్మరక్షణలో పడింది. అయితే క్రీజులో పాతుకుపోయిన ఎల్గర్‌కు బెడింగ్‌హామ్ చక్కని సహకారం ఇవ్వడంతో మరో భారీ భాగస్వామ్యం దక్షిణాఫ్రికాను నిలబెట్టింది. ఎల్గర్ శతకాన్ని పూర్తి చేసుకోగా... టీ విరామం (194/3) వరకు మరో వికెట్ పడకుండా జాగ్రత్తపడ్డారు. ఆఖరి సెషన్‌లోనూ ఎల్గర్–బెడింగ్‌హామ్ జోడీ భారత బౌలర్లకు పరీక్షపెట్టింది. నాలుగో వికెట్‌కు 131 పరుగులు జోడించాక సిరాజ్ ఓవర్లో బెడింగ్‌హామ్ (56; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) నిష్క్రమించాడు. వెరిన్ (4)ను ప్రసిధ్ అవుట్ చేశాడు. తర్వాత కాసేపటికే బ్యాడ్‌లైట్‌తో ఆటను నిలిపివేశారు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 245 ఆలౌట్;
దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 5; ఎల్గర్ (బ్యాటింగ్) 140; టోని జార్జి (సి) యశస్వి (బి) బుమ్రా 28; పీటర్సన్ (బి) బుమ్రా 2; బెడింగ్‌హామ్ (బి) సిరాజ్ 56; వెరిన్ (సి)రాహుల్ (బి) ప్రసిధ్‌కృష్ణ 4; జాన్సెన్ (బ్యాటింగ్) 3; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (66 ఓవర్లలో 5 వికెట్లకు) 256. వికెట్ల పతనం:** 1-11, 2-104, 3-113, 4-244, 5-249. **బౌలింగ్:** బుమ్రా 16-3-48-2, సిరాజ్ 15-0-63-2, శార్దుల్ 12-2-57-0, ప్రసిధ్‌కృష్ణ 15-2-61-1, అశ్విన్ 8-3-19-0.

తొలి సిరీస్ విజయం లక్ష్యంగా...

- నేడు ఆస్ట్రేలియాతో భారత మహిళల జట్టు తొలి వన్డే
- మధ్యాహ్నం గం. 1:30 నుంచి స్పోర్ట్స్–18లో ప్రత్యక్ష ప్రసారం



ముంబై: ఇటీవల టెస్టు ఫార్మాట్‌లో ఆస్ట్రేలియాపై తొలి విజయం అందుకున్న భారత మహిళల క్రికెట్ జట్టు వన్డే ఫార్మాట్‌లో వరల్డ్ చాంపియన్స్‌పై తొలిసారి సిరీస్ సాధించాలనే లక్ష్యంతో ఉంది. ఈ నేపథ్యంలో ఈ రెండు జట్ల మధ్య గురువారం జరిగే తొలి మ్యాచ్‌తో మూడు వన్డేల సిరీస్ మొదలుకానుంది. గతంలో ఆస్ట్రేలియాతో జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌లలో భారత్‌కు నిరాశ ఎదురైంది. అయితే సొంతగడ్డపై ఈసారి టీమిండియా సిరీస్‌ను సొంతం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. ఇప్పటి వరకు ఆస్ట్రేలియాతో 50 వన్డేలు ఆడిన భారత్ కేవలం 10 మ్యాచ్‌ల్లో నెగ్గి, 40 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో ఈ సీజన్‌లో భారత జట్టు ఇంగ్లండ్, ఆస్ట్రేలియాతో జరిగిన రెండు టెస్టుల్లోనూ గెలుపు రుచి చూసింది. అదే జోరు కొనసాగిస్తూ వన్డేల్లోనూ టీమిండియా సత్తా చాటుకునేందుకు సిద్ధమైంది. బ్యాటింగ్‌లో స్మృతి, షఫాలీ వర్మ, హర్మన్‌ప్రీత్, జెమీమా... బౌలింగ్‌లో రేణుక, పూజ రాణిస్తే భారత్‌కు సిరీస్ విజయం దక్కే అవకాశాలున్నాయి. మరోవైపు వరల్డ్ చాంపియన్ ఆస్ట్రేలియా ఏకైక టెస్టులో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకోవాలనే పట్టుదలతో వన్డే సిరీస్‌లో బరిలోకి దిగనుంది. యాష్లే గార్డ్‌నర్, అలీసా హీలీ, తాలియా, ఎలీస్ పెరీ, బెత్ మూనీ ఆటతీరుపై ఆసీస్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

పాక్ జట్టుకు కమిన్స్ దెబ్బ



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాతో 'బాక్సింగ్ డే' టెస్టులో పాకిస్తాన్ కష్టాల్లో పడింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 55 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 194 పరుగులు సాధించింది. ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ 37 పరుగులిచ్చి 3 వికెట్లు తీసి పాక్‌ను దెబ్బ కొట్టాడు. ఒకదశలో 124/1 వద్ద పటిష్టంగా ఉన్న పాక్ 70 పరుగుల తేడాలో ఐదు వికెట్లు చేజార్చుకుంది. అబ్దుల్లా షఫీక్ (62; 5 ఫోర్లు), షాన్ మసూద్ (54; 3 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ స్కోరుకు పాక్ మరో 124 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 187/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 96.5 ఓవర్లలో 318 పరుగులకు ఆలౌటైంది.

దబంగ్ ఢిల్లీతో జైపూర్ పింక్ పాంథర్స్ మ్యాచ్ 'డ్రా'

చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు రెండో 'డ్రా' నమోదు చేసింది. బుధవారం దబంగ్ ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌ను జైపూర్ 32-32 స్కోరు వద్ద 'డ్రా'గా ముగించింది. విరామ సమయానికి జైపూర్ 11-23తో వెనుకబడి ఉంది. కానీ రెండో అర్ధభాగంలో జైపూర్ తేరుకొని ఢిల్లీని నిలువరించింది. జైపూర్ తరఫున అర్జున్




దేశ్వాల్ 13 పాయింట్లు, అంకుశ్ 7 పాయింట్లు స్కోరు చేశారు. మరో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 33-30తో తమిళ్ తలైవాస్‌పై నెగ్గింది. గురువారం విశ్రాంతి దినం. శుక్రవారం జరిగే మ్యాచ్‌ల్లో పట్నా పైరేట్స్‌తో హరియాణా స్టీలర్స్; యూపీ యోధాస్‌తో బెంగళూరు బుల్స్ ఆడతాయి.

సినిమా

ఆ రోజు గోల గోల చేద్దాం

- రవితేజ



రవితేజ, కావ్యా థాపర్

''మీ అందరి (అభిమానులు) ఉత్సాహం చూస్తుంటే ఆనందంగా ఉంది. 'ఈగల్' వైవిధ్యమైన మాస్ ఫిలిం. వినోదం అద్భుతంగా ఉంటుంది. నాకు విపరీతంగా నచ్చింది.. మీ అందరికీ తెగ నచ్చుతుంది. జనవరి 13న అందరూ థియేటర్స్‌కి వచ్చేయండి.. గోల గోల చేద్దాం'' అన్నారు హీరో రవితేజ. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రవితేజ, కావ్యా థాపర్ జంటగా నటించిన చిత్రం 'ఈగల్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా జనవరి 13న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. దేవ్ జాంద్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'గల్లంతే..' అంటూ సాగే రెండో పాటని సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల సమక్షంలో విడుదల చేశారు. ఈ పాటకు కృష్ణకాంత్ సాహిత్యం అందించగా, కపిల్ కపిలన్, లిన్ పాడారు. కావ్యా థాపర్ మాట్లాడుతూ – ''గల్లంతే..' పాట నాకు చాలా ప్రత్యేకం. రవితేజగారితో నటించడం ఒక గౌరవంగా భావిస్తున్నాను'' అన్నారు. ''రవితేజగారికి నేను పెద్ద అభిమానిని. ఆయన సినిమాకి సంగీతం ఇవ్వడంతో నా కల నెరవేరినట్టు అయింది'' అన్నారు దేవ్ జాంద్. ఈ వేడుకలో కార్తీక్ ఘట్టమనేని, టీజీ విశ్వప్రసాద్, సహ నిర్మాత వివేక్ కూచిబొట్ల, నటుడు నవదీప్ తదితరులు పాల్గొన్నారు.

కోటికి రవితేజ వాయిస్

తేజ సజ్జా, అమృతా అయ్యర్ జంటగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'హను–మాన్'. చైతన్య సమర్పణలో ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా జనవరి 12న విడుదలవుతోంది. ఈ సినిమాలో కోటి పాత్రలో నటించిన వానరానికి హీరో రవితేజ డబ్బింగ్ చెప్పారు. ''రవితేజగారి వాయిస్‌తో కోటి పాత్ర మరింత హ్యూమరస్, ఎనర్జిటిక్‌గా ఉంటుంది. ఇందుకు ఆయనకు కృతజ్ఞతలు'' అని మేకర్స్ అన్నారు.

అలా జడ్జ్ చేయడం బాధగా ఉంది

- సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల



''మంచి మ్యూజిక్ ఇవ్వడానికి ఖరీదైన మ్యూజిక్ పరికరాలు అవసరం లేదు. 'క్షణం', 'మేజర్'లో కొన్ని సీన్లకు మేం ఫోన్‌లో రికార్డ్ చేసిన వాయిస్‌నే వాడాం. ఇక ఇప్పుడు యూట్యూబ్ వ్యూస్, ఇన్‌స్టా రీల్ వ్యూస్‌తో మ్యూజిక్ డైరెక్టర్స్‌ను జడ్జ్ చేయడం కాస్త బాధగా ఉంది. అందుకే ఇప్పుడు నేను సినిమాలు తగ్గించుకున్నాను. ఇండిపెండెంట్ మ్యూజిక్, ఆల్బమ్స్‌పై ఎక్కువ దృష్టి పెడుతున్నాను'' అని అన్నారు సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల. రోషన్ కనకాల, మానస జంటగా రవికాంత్ పేరేపు దర్శకత్వంలో రూపొందిన సినిమా 'బబుల్‌గమ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి మహేశ్వరీ మూవీస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది.

ఈ సందర్భంగా ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ శ్రీచరణ్ పాకాల మాట్లాడుతూ– ''గడిచిన పదేళ్లలో నేను చేయాల్సింది చేశాను. ఇక నన్ను కొత్తగా ఆవిష్కరించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నా. 'బబుల్‌గమ్'తో ఈ ప్రయత్నం మొదలైంది. ఈ సినిమాలో హీరోది డీజే రోల్. నా ఫ్రెండ్స్‌లో ఎక్కువమంది డీజేలు ఉండటంవల్ల ఎలక్ట్రానిక్ మ్యూజిక్‌పై అవగాహన ఉంది. ట్యూన్ కంటే లిరిక్స్ ముఖ్యమని నమ్ముతాను. 'బబుల్‌గమ్' చూశాను. రోషన్ మంచి నటుడు, డ్యాన్సర్. డబ్బింగ్ కూడా బాగా చెప్పాడు. ప్రస్తుతం 'సత్యభామ', 'గూఢచారి 2' సినిమాలకు సంగీతం అందిస్తున్నాను'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''ప్రతి రంగంలోనూ సాంకేతిక విప్లవం వచ్చింది. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వల్ల మ్యూజిక్ కంపోజర్స్‌కు ప్రమాదం ఉండొచ్చు. కానీ 'ఏఐ'ని అప్లై చేయడానికీ హ్యూమన్ టచ్ కావాలి. సప్తస్వరాలు ఏడే. సౌండింగ్ ఎలా ఇస్తున్నామన్నదే ముఖ్యం. 'గూఢచారి' వల్ల కాదు.. 'కృష్ణ అండ్ హిజ్ లీల' సినిమాలోని మ్యూజిక్ నచ్చి నాకు చాన్స్‌లు ఇచ్చినట్లుగా కొందరు నాతో చెప్పారు. నాకదో హ్యాపీ సర్‌ప్రైజ్'' అని చెప్పుకొచ్చారు.

హైదరాబాద్‌లో సరిపోదా...



నాని

'అంటే సుందరానికీ!' చిత్రం తర్వాత హీరో నాని, డైరెక్టర్ వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'సరిపోదా శనివారం'. ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ఎస్‌జే సూర్య కీలక పాత్ర చేస్తున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ''సరిపోదా శనివారం' చిత్రంలో నాని పూర్తిగా యాక్షన్–ప్యాక్డ్ అవతార్‌లో కనిపిస్తారు. హై బడ్జెట్, భారీ కాన్వాస్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. నవంబరులో ఒక షెడ్యూల్ పూర్తి చేశాం. రెండో షెడ్యూల్‌ని హైదరాబాద్‌లో ప్రారంభించాం. ఈ షెడ్యూల్‌లో ఇంటెన్స్ యాక్షన్ బ్లాక్‌తో పాటు నాని, ఇతర ప్రధాన తారాగణంపై కొంత టాకీ పార్ట్‌ని చిత్రీకరించనున్నాం. పాన్ ఇండియా చిత్రంగా రూపొందుతున్న ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, కెమెరా: మురళి జి.

జతనై రమ్మంటావా..

'అచ్చట.. ఇచ్చట... ముద్దొచ్చే ముచ్చట..', 'అందంగా అల్లుకుంటే ఆనందం..' అంటూ సాగుతుంది 'టెనెంట్' చిత్రంలోని 'నా కథలో..' పాట. 'సత్యం' రాజేశ్, మేఘా చౌదరి జంటగా వై. యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ళ చంద్రశేఖర్‌రెడ్డి నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమా నుంచి 'నా కథలో నువ్వున్నావా... నీ కథనే నేనయ్యానా... నా జతగా రానున్నావా... నీ జతనై రమ్మంటావా' అంటూ సాగే 'నా కథలో..' మెలోడీ సాంగ్ లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. ఈ చిత్రం సంగీత దర్శకుడు సాహిత్యసాగర్ ఈ పాటకు లిరిక్స్ అందించగా, ఎస్‌జే సురేంద్రనాథ్, జయశ్రీ పల్లెం పాడారు. ''భార్యాభర్తల అనురాగాన్ని, ఆప్యాయతను తెలిపే పాట ఇది. జీవితం ఆడే వైకుంఠపాళిలో ఎంచుకున్న పాచికల్లాంటి ఆరు పాత్రల మధ్య జరిగే కథే ఈ చిత్రం. మహిళలు ఎంత అప్రమత్తంగా ఉండాలో చెబుతూ, వారిని అలర్ట్ చేసేలా ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు వై. యుగంధర్.



'సత్యం' రాజేశ్, మేఘా చౌదరి




సంజీవ్ మేగోటి, రాశీ, శివ కంఠమనేని

ఎమోషనల్ రాఘవ రెడ్డి

శివ కంఠమనేని హీరోగా, రాశీ, నందితా శ్వేత ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రాఘవ రెడ్డి'. స్పేస్ విజన్ నరసింహా రెడ్డి సమర్పణలో సంజీవ్ మేగోటి దర్శకత్వంలో కేఎస్ శంకర్ రావ్, జి. రాంబాబు యాదవ్, ఆర్. వెంకటేశ్వర్ రావు నిర్మించిన ఈ చిత్రం జనవరి 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నిర్మాత మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ– ''చిన్న సినిమాల వల్లే ఇండస్ట్రీ బతుకుతుంది. ఇండస్ట్రీని బతికించుకునేందుకు 'రాఘవ రెడ్డి'లాంటి సినిమాలను ప్రేక్షకులు విజయవంతం చేయాలి. ఈ సినిమాలో అన్ని రకాల ఎమోషన్స్ కనిపిస్తున్నాయి'' అన్నారు. ''ఇంట్రవెల్ అందరికీ నచ్చుతుంది. క్లైమాక్స్ సీన్స్ ఎమోషనల్‌గా టచ్ అవుతాయి. ఆడియన్స్ కంటతడి పెడతారు'' అన్నారు శివ కంఠమనేని. ''తొమ్మిదేళ్ల గ్యాప్ తర్వాత దర్శకుడిగా 'రాఘవ రెడ్డి' అనే ఓ మంచి సినిమా తీశాను'' అన్నారు సంజీవ్. ''ఈ సినిమాలో కూతురే ప్రపంచంగా బతికే దేవకి పాత్ర చేశాను'' అన్నారు రాశీ. ''ఈ సినిమాలో క్రిమినాలజీ ప్రొఫెసర్ రాఘవ రెడ్డిగా శివగారు నటించారు. యూత్‌కి కావల్సిన ఎలిమెంట్స్‌తో పాటు యాక్షన్, సోషల్ మెసేజ్ కూడా ఉన్నాయి'' అన్నారు నిర్మాతలు.

రీల్స్

వేసవిలో వస్తున్నాడు



కమల్‌హాసన్

హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'ఇండియన్ 2'. వీరి కాంబినేషన్‌లోనే 1996లో వచ్చిన 'ఇండియన్' సినిమాకు ఇది సీక్వెల్. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య, సిద్ధార్థ్, ప్రియా భవానీ శంకర్, రకుల్‌ప్రీత్ సింగ్ కీలక పాత్రధారులు. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఇటీవల చెన్నైలో మొదలైన 'ఇండియన్ 2' భారీ షెడ్యూల్ చిత్రీకరణ ముగిసిందని, ఈ షూటింగ్ షెడ్యూల్‌తో టాకీ పార్టు పూర్తయిందని సమాచారం. బ్యాలెన్స్ ఉన్న రెండు పాటలను కూడా చిత్రీకరిస్తే షూటింగ్ మొత్తం పూర్తవుతుందని టాక్. ఈ చిత్రాన్ని వేసవిలో విడుదల చేయాలనుకుంటున్నారట.

హిట్లర్ యాక్షన్



విజయ్ ఆంటోనీ, రియా సుమన్

విజయ్ ఆంటోనీ, రియా సుమన్ జంటగా నటించిన చిత్రం 'హిట్లర్'. ధన దర్శకత్వంలో డీటీ రాజా, డీఆర్ సంజయ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా త్వరలో తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. తాజాగా ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేశారు. ''ప్రజాస్వామ్యం పేరుతో కొందరు పాలకులు నియంతల్లా వ్యవహరిస్తున్నారు. అలాంటి నియంతను ఎదుర్కొనే ఓ సాధారణ పౌరుడి కథే 'హిట్లర్'. ఈ మూవీలో లవ్ ట్రాక్‌కి కూడా ప్రాధాన్యత ఉంటుంది. యాక్షన్ థ్రిల్లర్ కథతో తీసిన ఈ 'హిట్లర్'లో కిల్లర్‌గా విజయ్ ఆంటోని కొత్త లుక్‌లో, క్యారెక్టరైజేషన్‌లో కనిపిస్తారు'' అని యూనిట్ పేర్కొంది.

సహజత్వానికి దగ్గరగా...



శశి, రోహిత్

ముని, రోహిత్, రాజు, అజిత్, గాయత్రి గుప్తా, సాయి కిరణ్ యాదవ్, పవన్ కృష్ణ ప్రధాన పాత్రల్లో నటించిన క్రైమ్ థ్రిల్లర్ 'డబుల్ ఇంజన్'. దర్శకద్వయం రోహిత్–శశి తెరకెక్కించిన ఈ సినిమాను సిద్దార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. జనవరి 5న ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. ''నలుగురు స్నేహితులు డానీ, మౌళి, నర్సింగ్, గోపీ డబ్బు సంపాదించడం కోసం చేసే ప్రయత్నాలతో థ్రిల్లింగ్ అడ్వెంచరస్ మూవీగా తీశాం'' అని యూనిట్ పేర్కొంది. ''కేవలం వంద ఇళ్లు ఉన్న తోటపల్లి గ్రామం బ్యాక్‌డ్రాప్‌లో సహజత్వానికి దగ్గరగా ఉండే సినిమా ఇది. మా చిత్రం టికెట్ ధర పీవీఆర్‌లో రూ. 112కే అందుబాటులో ఉంటుంది'' అని దర్శకుల్లో ఒకరైన రోహిత్ అన్నారు.

బంపర్ ఆఫర్



ఇంద్రసేన, సంతోష్

ఇంద్రసేన, సంతోష్, ప్రజ్ఞ నయన్, నవీనా రెడ్డి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'బద్మాష్ గాళ్లకి బంపర్ ఆఫర్'. రవి చావలి దర్శకత్వంలో ఎస్. రమేష్ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న రిలీజ్ కానుంది. ''రియల్ ఎస్టేట్ దందా చేసే ఒక వ్యక్తి దగ్గర పని చేసే ఇద్దరు కుర్రాళ్లు డబ్బు కోసం అతన్నే ఎందుకు కిడ్నాప్ చేశారు? వారికి తెలిసిన రహస్యాలు ఏంటి? చివరకు డబ్బు సంపాదించారా? లేదా అనే కథతో రూపొందిన చిత్రమిది'' అన్నారు రవి చావలి.

సాక్షి బిజినెస్
గురువారం
28-12-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
701	213
72,038	21,655

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	15,078	▲	4
డోజోన్స్	37,619	▲	73
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,727	▲	30
డాక్స్	16,739	▲	33
షాంఘై	2,915	▲	16
నికాయ్	33,681	▲	376

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	63,223	▲	116
బంగారం (99.5 స్వచ్ఛత)	62,970	▲	165
వెండి (కిలో)	74,064	▲	768

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.77	83.79
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.49	107.06
€	యూరో	ఎస్‌బీఐ	90.66	93.04
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.84	59.17
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.78	57.73
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.02	63.51
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.23	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.75	23.55
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.52	12.60

ఎస్‌బీఐ డిపాజిట్ రేట్ల పెంపు



ముంబై: బ్యాంకింగ్ దిగ్గజం– స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కొన్ని కాలపరిమితులపై స్థిర డిపాజిట్లపై వడ్డీరేటును 50 బేసిస్ పాయింట్ల వరకూ (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) పెంచింది. బుధవారం నుంచీ కొత్త వడ్డీరేట్లు అమల్లోకి వచ్చినట్లు బ్యాంక్ పేర్కొంది. డిపాజిటర్లకు తగిన 'న్యాయమైన' వడ్డీరేటును అందించాల్సిన అవసరం ఉన్నందున ఈ పెంపు నిర్ణయం తీసుకున్నట్లు చైర్మన్ దినేష్ కుమార్ ఖరా పేర్కొన్నారు. ఇక్కడ బ్యాంక్ నిర్వహించిన ''బ్యాంకింగ్, ఎకనమిక్ కాన్‌క్లేవ్''లో ఆయన మాట్లాడుతూ, డిపాజిట్ రేటు పెంపునకు తగిన వెసులుబాటు ఎస్‌బీఐకి ఉందన్నారు. రుణ రేటు పెరుగుదల, నిధుల సమీకరణ అవసరాల నేపథ్యంలో ఇటీవల కోటక్ మహీంద్రా బ్యాంక్‌తో సహా కొన్ని బ్యాంకులు డిపాజిట్ రేటు నిర్ణయం తీసుకున్నాయి. ఎస్‌బీఐ తాజా నిర్ణయంతో మరికొన్ని బ్యాంకులు ఇదే బాటలో పయనించే అవకాశం ఉంది. ఎస్‌బీఐ తాజా నిర్ణయం ప్రకారం...

- 180–210 రోజుల మధ్య డిపాజిట్ రేటు 5.25 శాతం నుంచి 0.5 శాతం పెరిగి 5.75 శాతానికి చేరింది.
- 7 నుంచి 45 రోజుల మధ్య రుణ రేటు 3 శాతం నుంచి 3.5 శాతానికి ఎగసింది.
- 46 నుంచి 179 రోజుల మధ్య డిపాజిట్ రేటు 0.25 శాతం పెరిగి 4.75 శాతానికి ఎగసింది.
- 211 రోజుల నుంచి ఏడాది వరకూ రేటు 6 శాతానికి చేరింది.
- మూడేళ్ల నుంచి ఐదేళ్ల మధ్య రేటు 6.75 శాతానికి చేరింది.



జోయాలుక్కాస్ గ్రూప్ అధినేత జాయ్ అలుక్కాస్ తన స్వీయ చరిత్ర 'స్ప్రెడింగ్ జాయ్'ను ప్రధాని మోదీకి అందజేశారు.

మళ్లీ రికార్డుల మోత

- సెన్సెక్స్ @ 72000
- 21,650 స్థాయి పైకి నిఫ్టీ
- సరికొత్త శిఖరాలపై సూచీలు
- ఇంట్రాడే, ముగింపుల్లోనూ చరిత్రాత్మక స్థాయిల నమోదు



ముంబై: దేశీయ స్థూల ఆర్థిక వ్యవస్థపై ఆశావహ అంచనాలు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న సానుకూల సంకేతాలతో స్టాక్ సూచీలు బుధవారం సరికొత్త శిఖరాలను అధిరోహించాయి. బ్యాంకింగ్, కమోడిటీ, మెటల్, ఆటో రంగాల షేర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ తొలిసారి 72,000 పాయింట్ల ఎగువన, నిఫ్టీ 21,650 స్థాయిపై ముగిశాయి. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు రోజంతా స్థిరంగా ముందుకు కదిలాయి. సెన్సెక్స్ 71,492 పాయింట్లు వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 783 పాయింట్లు ఎగసి 72,120 వద్ద కొత్త జీవితకాల గరిష్టాన్ని తాకింది. చివరికి 701 పాయింట్లు లాభపడి 72,038 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో నిఫ్టీ 235 పాయింట్లు బలపడి 21,676 వద్ద సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఆఖరికి 213 పాయింట్లు లాభపడి 21,655 వద్ద నిలిచింది. ఆయిల్ అండ్‌గ్యాస్, యుటిలిటీ, విద్యుత్, సేవా రంగ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,926 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.192 కోట్ల షేర్లు విక్రయించారు.

ర్యాలీ ఎందుకంటే...?

ఫెడ్ రిజర్వ్ 2024 మార్చి కంటే ముందుగానే ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు ఉంటుందనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న సానుకూలత దేశీయ మార్కెట్‌కు కలిసొచ్చింది. గత 20 ఏళ్ల ట్రేడింగ్ ట్రెండ్‌ను అనుసరిస్తూ ఈక్విటీ మార్కెట్లలో శాంటా క్లాజ్ ర్యాలీ కొనసాగుతుంది. (డిసెంబర్ చివరి 5 ట్రేడింగ్ సెషన్లు, జనవరి తొలి 2 ట్రేడింగ్ సెషన్లు మార్కెట్ పెరిగితే దానిని శాంటా ర్యాలీగా వ్యవహరిస్తారు). వాల్ స్ట్రీట్‌లో 'సెల్ చైనా, బై భారత్' వ్యూహం జోరుగా సాగుతున్నట్లు కనిపిస్తుంది. అందుకు అనుగుణంగా డిసెంబర్‌లో ఎఫ్ఐఐలు రూ.57,275 కోట్ల ఈక్విటీలను కొన్నారు. రెండో త్రైమాసికంలో అలాగే భారత కరెంట్ ఖాతా లోటు తగ్గడం కలిసొచ్చింది. భారీ భద్రత నడుమ ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకల రాకపోకల పునఃప్రారంభంతో బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ ధర 80 డాలర్ల దిగువకు చేరుకుంది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- చైనా తయారీ రంగం పుంజుకోవడం, డాలర్ బలహీనతతో అంతర్జాతీయంగా బేస్ మెటల్ ధరలు పెరగడం మెటల్ షేర్లకు డిమాండ్ పెంచింది. హిందాల్కో 4%, జేఎస్‌డబ్ల్యూ 3%, సెయిల్, నాల్కో 2% లాభపడ్డాయి. టాటా స్టీల్, వెల్‌స్పాన్ కార్ప్, హిందుస్తాన్ కాపర్, వేదాంతా, జిందాల్ స్టీల్ షేర్లు 1% వరకు పెరిగాయి.
- ఇటీవల ర్యాలీలో వెనకబడిన బ్యాంకింగ్ షేర్లు పుంజుకున్నాయి. పీఎస్‌బీ 4%, బ్యాంక్ ఆఫ్ బరోడా 3%, ఎస్‌బీఐ 2%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.50%, బంధన్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ, కోటక్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఏయూస్మాల్‌ఫైనాన్స్ బ్యాంక్‌లు 1–6% లాభపడ్డాయి.
- 4 రోజుల్లో సెన్సెక్స్ 1,532 పాయింట్ల ర్యాలీతో దలాల్ స్ట్రీట్‌లో రూ.11.11 లక్షల కోట్లు సంపద సృష్టి జరిగింది. దీంతో బీఎస్‌ఈలో మొత్తం కంపెనీల మార్కెట్ విలువ జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.361 లక్షల కోట్లకు చేరింది.

లిస్టింగ్ టైమ్...

హ్యాపీ ఫోర్జింగ్స్ హైజంప్

గత వారమే పబ్లిక్ ఇష్యూకి వచ్చిన హ్యాపీ ఫోర్జింగ్స్ లిస్టింగ్‌లోనే ఇన్వెస్టర్లను మెప్పించింది. ఇష్యూ ధర రూ. 850తో పోలిస్తే బీఎస్ఈలో 18 శాతం ప్రీమియంతో రూ. 1,001 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. తదుపరి 28 శాతం దూసుకెళ్లి రూ. 1,088 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 21% లాభంతో రూ. 1,030 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలోనూ 18 శాతం అధికంగా రూ. 1,000 వద్ద లిస్టయ్యింది. ఆపై రూ. 1,087 వరకూ జంప్‌చేసింది. చివరికి 21% బలపడి రూ. 1,030 వద్ద స్థిరపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ. 9,701 కోట్లుగా నమోదైంది.

ఆర్‌బీజెడ్ జ్యువెలర్స్ ఓకే


ఆభరణాల కంపెనీ ఆర్‌బీజెడ్ జ్యువెలర్స్ లిస్టింగ్ తొలి రోజు ఇన్వెస్టర్లకు లాభాలను పంచింది. అయితే ఇష్యూ ధర రూ. 100తో పోలిస్తే బీఎస్ఈలో యథాతథంగా రూ. 100 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. తదుపరి 5 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకి రూ. 105 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి ఇదే స్థాయిలో రూ. 105 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలోనూ రూ. 100 వద్ద లిస్టయ్యింది. ఆపై రూ. 105 వరకూ ఎగసింది. చివరికి అక్కడే స్థిరపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ. 420 కోట్లుగా నమోదైంది.

క్రెడో బ్రాండ్స్.. గుడ్

మఫ్టీ డెనిమ్ బ్రాండ్ కంపెనీ క్రెడో బ్రాండ్స్ మార్కెటింగ్ లిస్టింగ్ తొలి రోజు ఇన్వెస్టర్లకు లాభాలను పంచింది. అయితే ఇష్యూ ధర రూ. 280తో పోలిస్తే బీఎస్ఈలో స్వల్ప ప్రీమియం (0.7%)తో రూ. 282 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. తదుపరి 16% జంప్‌చేసి రూ. 325 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 12% లాభంతో రూ. 313 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలోనూ నామమాత్ర లాభంతో రూ. 282 వద్ద లిస్టయ్యింది. ఆపై రూ. 325 వరకూ దూసుకెళ్లింది. చివరికి 11% బలపడి రూ. 311 వద్ద స్థిరపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ. 2,009 కోట్లుగా నమోదైంది.

బ్యాంక్‌లపైనే ఆధారపడొద్దు

- నిధుల మార్గాలను విస్తృతం చేసుకోండి
- ఎన్‌బీఎఫ్‌సీలకు ఆర్‌బీఐ సూచన



ముంబై: నిధుల సమీకరణ మార్గాలను విస్తృతం చేసుకోవాలని, బ్యాంక్‌లపై ఆధారపడడాన్ని పరిమితం చేసుకోవాలని బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలకు (ఎన్‌బీఎఫ్‌సీలకు) ఆర్‌బీఐ సూచించింది. బలమైన కార్పొరేట్ గవర్నెన్స్ విధానాల ద్వారా బ్యాలెన్స్ షీట్లు పటిష్టం చేసుకుని, మోసాలు, డేటా చోరీల నుంచి రక్షణ కల్పించుకోవాలని కోరింది. దేశ బ్యాంకింగ్ రంగం, ఎన్‌బీఎఫ్‌సీలు బలంగా ఉన్నాయంటూ.. అధిక నగదు నిష్పత్తి, మెరుగుపడిన ఆస్తుల నాణ్యత, లాభాల్లో బలమైన వృద్ధిని ప్రస్తావించింది. ఈ మేరకు బ్యాంకింగ్ రంగంపై ఆర్‌బీఐ ఓ నివేదికను విడుదల చేసింది. ''బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల మధ్య పరస్పర అనుసంధానత పెరిగిన నేపథ్యంలో.. ఎన్‌బీఎఫ్‌సీలు తమ నిధుల సమీకరణ మార్గాలను విస్తృతం చేసుకోవాలి. బ్యాంక్‌లపై అధికంగా ఆధారపడడాన్ని తగ్గించుకోవాలి. కస్టమర్లకు సేవల విషయంలో మరింత కృషి చేయాలి''అని ఆర్‌బీఐ కోరింది.

సైబర్ దాడుల రిస్క్

నూతన టెక్నాలజీల అమలు నేపథ్యంలో సైబర్ దాడులు, డేటా చోరీ, నిర్వహణ వైఫల్యాలు పెరిగినట్టు పేర్కొంది. మెరుగైన పాలన, రిస్క్ నిర్వహణ విధానాల ద్వారా బ్యాలన్స్ షీట్లను పటిష్టం చేసుకుని, పెరుగుతున్న దేశ ఆర్థిక వ్యవస్థ ఆకాంక్షలను చేరుకునే విధంగా ఉండాలని కోరింది. ''ఈ విధమైన సాంకేతిక, సైబర్ భద్రతా రిస్క్‌లను గుర్తించి, వాటి ముప్పును తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి. బలమైన గవర్నెన్స్, రిస్క్ నిర్వహణ విధానాల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థను పటిష్టం చేసుకోవాలి''అని సూచించింది.

అదానీ గ్రీన్‌కు టోటల్ 'ఎనర్జీ'

రూ. 2,500 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: దేశీ ప్రయివేట్ రంగ కంపెనీ అదానీ గ్రీన్ ఎనర్జీలో ఫ్రెంచ్ దిగ్గజం టోటల్‌ఎనర్జీస్ 30 కోట్ల డాలర్లు(సుమారు రూ. 2,500 కోట్లు) ఇన్వెస్ట్ చేసింది. తద్వారా పునరుత్పాదక ఇంధన భాగస్వామ్య సంస్థ(జేవీ)లో సమాన వాటా తీసుకుంది. అదానీ రెనెవబుల్ ఎనర్జీ నైన్ లిమిటెడ్(ఏఆర్‌ఈ9ఎల్) పేరుతో జేవీని ఏర్పాటు చేశాయి. 1,050 మెగావాట్ల ప్రాజెక్ట్ పోర్ట్‌ఫోలియోగల జేవీలో అదానీ గ్రీన్, టోటల్‌ఎనర్జీస్ 50:50 శాతం చొప్పున వాటాను తీసుకున్నాయి. అదానీ గ్రీన్‌కు ఏఆర్‌ఈ9ఎల్ అనుబంధ సంస్థకాగా.. 300 మెగావాట్ల నిర్వహణా సామర్థ్యంతోపాటు, 500 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. మరో 250 మెగావాట్ల ప్రాజెక్టులు అభివృద్ధి దశలో ఉన్నట్లు అదానీ గ్రీన్ వెల్లడించింది. అదానీ గ్రీన్‌లో 19.75 శాతం వాటా కలిగిన టోటల్‌ఎనర్జీస్ గతంలో అదానీ గ్రీన్ ఎనర్జీ ట్వంటీ త్రీ(ఏజీఈ23) లిమిటెడ్‌లో ఇన్వెస్ట్ చేసింది. ఇది అదానీ గ్రీన్‌కు మరో అనుబంధ సంస్థ. కాగా.. నిర్మాణం, అభివృద్ధి దశలో ఉన్న ప్రాజెక్టులు వాణిజ్య ప్రాతిపదికన కార్యకలాపాలు ప్రారంభిస్తే కొన్ని ప్రమాణాలకు లోబడి టోటల్‌ఎనర్జీస్ తిరిగి జేవీకి అదనపు పెట్టుబడులను సమకూర్చనుంది. ఇంతక్రితం ఏజీఈ23ఎల్‌లో టోటల్ రూ. 4,013 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. తప్పనిసరిగా మార్పిడికి లోనయ్యే డిబెంచర్ల ద్వారా నిధులు సమకూర్చింది.



టోటల్ పెట్టుబడుల నేపథ్యంలో అదానీ గ్రీన్ ఎనర్జీ షేరు ఎన్ఎస్ఈలో స్వల్ప నష్టంతో రూ. 1,597 వద్ద ముగిసింది.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

స్టడీ అబ్రాడ్

విదేశీ విద్యకు.. స్కాలర్‌షిప్స్ ఊతం

ఆర్థిక ఉపశమనం కల్పిస్తున్న ఉపకార వేతనాలు » అకడమిక్ రికార్డ్, ప్రతిభ ఆధారంగా స్కాలర్‌షిప్స్

విదేశీ యూనివర్సిటీల్లో చదువుకోవాలని కోరుకుంటున్న విద్యార్థులకు అక్కడి భారీ ఫీజులు, వ్యయాలు ప్రధాన అవరోధంగా మారుతున్నాయి.దీంతో ఎంతోమంది అవకాశాలు వచ్చినా వదులుకుంటున్న పరిస్థితి. ఇలాంటి విద్యార్థులకు ఆర్థిక భారం నుంచి ఉపశమనం కల్పిస్తున్నాయి.. స్కాలర్‌షిప్స్! అకడమిక్‌గా అద్భుత ప్రతిభతోపాటు టాప్ యూనివర్సిటీలో ప్రవేశం ఖరారు చేసుకుంటే.. ఉపకార వేతనాలు ఊతంగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో..స్టడీ అబ్రాడ్ విద్యార్థులకు అందుబాటులో ఉన్న పలు స్కాలర్‌షిప్‌ల వివరాలు..

ఫుల్‌బ్రైట్ మాస్టర్స్ ఫెలోషిప్స్

భారతీయ విద్యార్థులు తొలి గమ్యంగా భావించే అమెరికాలో.. ఎలాంటి కోర్సులో చేరాలనుకున్న వారికైనా.. అందుబాటులో ఉన్న ఉపకార వేతనం.. ఫుల్‌బ్రైట్ స్కాలర్‌షిప్స్. ఆర్ట్స్, ఎకనామిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/స్టడీస్, హయ్యర్ ఎడ్యుకేషన్ అడ్మినిస్ట్రేషన్, ఇంటర్నేషనల్ అఫైర్స్, ఇంటర్నేషనల్ లీగల్ స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పబ్లిక్ హెల్త్, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్, ఉమెన్స్ స్టడీస్/జండర్ స్టడీస్ తదితర విభాగాల్లో పీజీ, ఆపై స్థాయి కోర్సుల్లో చేరిన వారు ఈ ఫెలోషిప్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన వారికి కోర్సు వ్యవధిలో ఒకసారి స్వదేశానికి వచ్చి వెళ్లేందుకు విమాన చార్జీలు, నివాస ఖర్చులు, ట్యూషన్ ఫీజు ఫండింగ్ వంటివి లభిస్తాయి.

» వివరాలకు వెబ్‌సైట్: ww.usief.org.in/Fullbright-Nehru-Fellowships.aspx

క్వాడ్ ఫెలోషిప్ ఫర్ స్టెమ్ కోర్సెస్

క్వాడ్ దేశాల కూటమి ఆధ్వర్యంలో ఏర్పాటైన స్కాలర్‌షిప్ ఇది. క్వాడ్ గ్రూప్‌లోని ఆస్ట్రేలియా, భారత్, జపాన్, అమెరికాకు చెందిన వంద మంది విద్యార్థులకు అమెరికాలోని యూనివర్సిటీలు/ఇన్‌స్టిట్యూట్స్‌లో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ పీజీ, డాక్టోరల్ కోర్సుల్లో చేరే వారికి ఈ ఫెలోషిప్‌ను అందిస్తారు. దీనికి ఎంపికైన వారికి రూ.50 వేల డాలర్ల ఏక మొత్తం ఆర్థిక సహాయం అందిస్తారు. నీడ్ బేస్డ్ విధానంలో కోర్సు పూర్తి చేసుకునేందుకు అయ్యే వ్యయంలో భాగంగా మరో 25 వేల డాలర్లు ఇస్తారు. దీనికోసం అభ్యర్థులు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

» వివరాలకు వెబ్‌సైట్: www.quadfellowship.org

నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ ఫర్ ఎస్సీ క్యాండిడేట్స్

దేశంలో ఎస్సీ కేటగిరీలకు చెందిన అల్పాదాయ వర్గాల విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం..నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్. ఎస్సీ/ఎస్టీ, వ్యవసాయ కూలీ కుటుంబాలకు చెందిన విద్యార్థులు, డినోటిఫైడ్, సంచార, పాక్షిక సంచార జాతులు, సంప్రదాయ కళాకారుల కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. కుటుంబ ఆదాయం రూ.8లక్షల లోపు ఉండాలి. డిగ్రీ లేదా పీజీ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి, విదేశాల్లో పీజీ లేదా పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకుని ఉండాలి. మొత్తం 125 స్కాలర్‌షిప్ అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఎస్సీ కులాల వారికి–115, సంచార, పాక్షిక సంచార జాతుల వారికి–06, భూమిలేని వ్యవసాయ కూలీలకు, సంప్రదాయ కళాకారులకు –04 స్కాలర్‌షిప్స్‌ను కేటాయిస్తారు. పీజీ కోర్సులో చేరితే మూడేళ్ల పాటు, పీహెచ్‌డీ చేస్తే నాలుగేళ్లు స్కాలర్‌షిప్స్‌ను మంజూరు చేస్తారు. ట్యూషన్ ఫీజు, మెయింటనెన్స్ అలవెన్స్, అత్యవసర ఖర్చులు, వీసా ఫీజు, ఎక్విప్‌మెంట్ అలవెన్స్, మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియం తదితర ఖర్చుల కోసం ఈ స్కాలర్‌షిప్ కింద ఆర్థిక సహకారం అందిస్తారు.

» వెబ్‌సైట్: https://nosmsje.gov.in

ఏడీబీ-జపాన్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్

జపాన్‌లోని యూనివర్సిటీల్లో ప్రవేశం ఖరారు చేసుకున్న మన దేశ విద్యార్థులకు అందుబాటులో ఉన్న మరో ప్రముఖ స్కాలర్‌షిప్ పథకం.. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ జపాన్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్. ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇతర అభివృద్ధి సంబంధిత విభాగాల్లో ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో విద్యనభ్యసించే విద్యార్థులకు ఇవి లభిస్తాయి.ఎంపికైన వారికి పూర్తి స్థాయి ట్యూషన్ ఫీజు, హౌసింగ్ అలవెన్స్, బుక్స్ అలవెన్స్, ట్రావెల్ ఎక్స్‌పెన్సెస్ అందుతాయి. అభ్యర్థులు తాము ప్రవేశం ఖరారు చేసుకున్న యూనివర్సిటీలో అడ్మిషన్ తేదీ ప్రారంభానికి కనీసం ఆరు నెలల ముందు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

» వివరాలకు వెబ్‌సైట్: www.adb.org

వాయుసేనలో పైలెట్ కొలువు

రక్షణరంగంలో ఉన్నతమైన కొలువు సొంతం చేసుకోవాలనుకునే వారికి చక్కటి మార్గం.. ఏఎఫ్‌క్యాట్ (ఎయిర్‌ఫోర్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్). ఏఎఫ్‌క్యాట్ ద్వారా మొత్తం 317 ఉద్యోగాల భర్తీకి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఇందులో అర్హత సాధించిన వారు ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ.. టెక్నికల్, నాన్ టెక్నికల్ విభాగాల్లో ఉన్నతస్థాయి కొలువులను దక్కించుకోవచ్చు. తాజాగా ఏఎఫ్‌క్యాట్-2024 నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. ఏఎఫ్‌క్యాట్‌తో ఉద్యోగాలు, అర్హతలు, పరీక్షా విధానం తదితర వివరాలు..

» 2024 ఏఎఫ్‌క్యాట్ నోటిఫికేషన్ విడుదల
» డిగ్రీ, ఇంజనీరింగ్ అర్హతతో ఉన్నత కొలువులు
» లెవెల్-10 హోదాతో రూ.లక్షకు పైగానే వేతనం

దేశ త్రివిధ దళాల్లో ముఖ్యమైనది వాయుసేన. శత్రుమూకలు మన దేశ గగనతలంలోకి ప్రవేశించకుండా అరికట్టడంలో వైమానిక దళం నిరంతరం పహారాకాస్తుంది. ఇలాంటి కీలకమైన ఎయిర్‌ఫోర్స్‌లో విధుల నిర్వహణ కోసం ఏఎఫ్‌క్యాట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ.. టెక్నికల్, నాన్ టెక్నికల్ విభాగాల్లో ఉన్నతస్థాయి ఉద్యోగాల కోసం ఏటా రెండుసార్లు ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్(ఏఎఫ్ క్యాట్) పేరుతో నోటిఫికేషన్ విడుదల చేస్తారు.

విద్యార్హతలు

ఫ్లయింగ్ బ్రాంచ్: ఈ విభాగానికి దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఇంటర్/10+2లో మ్యాథ్స్, ఫిజిక్స్ చదివి ఉండి.. గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయం నుంచి కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ(ఏదేని గ్రూప్) ఉత్తీర్ణత సాధించాలి. లేదా కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే.

గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్)

- ఈ విభాగానికి అభ్యర్థులు ఏరోనాటికల్ ఇంజనీరింగ్ (ఎలక్ట్రానిక్స్/మెకానికల్) విభాగాల్లో లేదా అనుబంధ ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల్లో కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
- 10+2 స్థాయిలో ఫిజిక్స్, మ్యాథమెటిక్స్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి. ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

గ్రౌండ్ డ్యూటీ (నాన్ టెక్నికల్)

- నాన్ టెక్నికల్‌కు సంబంధించి అడ్మినిస్ట్రేషన్, లాజిస్టిక్స్, అకౌంట్స్ విభాగాలున్నాయి. అడ్మినిస్ట్రేషన్, లాజిస్టిక్స్ విభాగాలకు కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ పూర్తి చేసుండాలి.
- అకౌంట్స్ విభాగానికి సంబంధించి 60 శాతం మార్కులతో బీకాం ఉత్తీర్ణులవ్వాలి. ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే.

వయసు

ఫ్లయింగ్ బ్రాంచ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు వయసు 20 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి. గ్రౌండ్ డ్యూటీ.. టెక్నికల్, నాన్–టెక్నికల్ పోస్టులకు వయసు 20 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి.



ఎంపిక విధానం

ఆయా పోస్టులను అనుసరించి ఆన్‌లైన్ పరీక్ష, ఇంజనీరింగ్ నాలెడ్జ్ టెస్ట్, పైలెట్ అప్టిట్యూడ్ బ్యాటరీ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్, ఫిజికల్ టెస్ట్‌లను నిర్వహించి తుది ఎంపిక చేస్తారు. ఇలా ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణతోపాటు, ఉన్నత స్థాయి ఉద్యోగం సొంతమవుతుంది.

పరీక్ష ఇలా

- బ్రాంచ్ ఏదైనా ఏఎఫ్‌క్యాట్ పరీక్షను ఉమ్మడిగానే నిర్వహిస్తారు. ఈ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. 300 మార్కులకుగాను 100 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు. పరీక్ష సమయం 2 గంటలు.
- టెక్నికల్ బ్రాంచ్‌కు దరఖాస్తు చేసుకున్నవారికి ఇంజనీరింగ్ నాలెడ్జ్ టెస్ట్(ఈకేటీ) నిర్వహిస్తారు. ఇది మొత్తం 50 ప్రశ్నలకుగాను 150 మార్కులకు 45 నిమిషాలపాటు జరుగుతుంది.

ఏఎఫ్ఎస్‌బీ ఇంటర్వ్యూ

రాత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను ఎయిర్‌ఫోర్స్ సెలక్షన్ బోర్డ్ (ఏఎఫ్ఎస్‌బీ) ఇంటర్వ్యూలకు పిలుస్తుంది. ఇది రెండు స్టేజ్‌ల్లో(స్టేజ్–1, 2) ఉంటుంది. స్టేజ్–1లో అర్హత సాధించిన వారు స్టేజ్–2కి వెళ్తారు. ఆ తర్వాత పర్సనల్ ఇంటర్వ్యూ జరుగుతుంది. ఈ దశలన్నీ విజయవంతంగా పూర్తిచేసుకున్న వారికి మెడికల్ టెస్టులు నిర్వహిస్తారు. అనంతరం మెరిట్‌ప్రాతిపదికన శిక్షణకు ఎంపిక చేస్తారు.

ఉచిత ట్రైనింగ్

ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్ బ్రాంచ్‌లకు ఎంపికైన అభ్యర్థులకు 74 వారాల పాటు; గ్రౌండ్ డ్యూటీ నాన్ టెక్నికల్‌కు ఎంపికైన వారికి 52 వారాలపాటు ఉచిత ఎయిర్‌ఫోర్స్ ట్రైనింగ్ ఇస్తారు. శిక్షణలో అభ్యర్థులు చూపిన ప్రతిభ ఆధారంగా ఫైటర్ పైలెట్, ట్రాన్స్‌పోర్ట్ పైలెట్, హెలికాప్టర్ పైలెట్‌గా.. ఆయా విభాగాల్లో ఇంటర్నల్ శిక్షణ ఇస్తారు.

స్టైఫండ్

శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.56,100 స్టైఫండ్‌గా చెల్లిస్తారు. విజయవంతంగా ట్రైనింగ్ పూర్తిచేసుకొని ఉద్యోగంలో చేరిన వారికి రూ.56,100 ప్రారంభ వేతనం లభిస్తుంది. దీంతోపాటు డీఏ, హెచ్‌ఆర్ఏ సహా వివిధ రకాల అలవెన్సులు, సౌకర్యాలు లభిస్తాయి.

ముఖ్యమైన సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 30.12.2023
- **పరీక్ష తేదీ:** 2024 ఫిబ్రవరి 16,17,18 తేదీల్లో
- **వెబ్‌సైట్:** https://afcat.cdac.in

ప్రిపరేషన్ పక్కాగా

- **ఏఎఫ్‌క్యాట్ పరీక్షలో..** జనరల్ అవేర్‌నెస్,ఇంగ్లిష్, రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ,మిలటరీ ఆప్టిట్యూడ్ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.
- ఈకేటీ పరీక్షలో మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ నుంచి ప్రశ్నలను అడుగుతారు.
- **జనరల్ అవేర్‌నెస్:** ఈ విభాగానికి సంబంధించి హిస్టరీ,సివిక్స్,పాలిటీ, కరెంట్ అఫైర్స్, జాగ్రఫీ, ఎన్విరాన్‌మెంట్, కల్చర్, డిఫెన్స్, క్రీడలు తదితర అంశాల నుంచి ప్రశ్నలుంటాయి.
- **వెర్బల్ ఎబిలిటీ:** ఈ విభాగానికి సంబంధించి కాంప్రహెన్షన్, ఎర్రర్ డిటెక్షన్, సెంటన్స్ కంప్లీషన్, సినానిమ్స్, యాంటానిమ్స్, వొకాబ్యులరీ, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **న్యూమరికల్ ఎబిలిటీ:** ఈ విభాగంలో ప్రశ్నలు పదోతరగతి స్థాయిలో ఉంటాయి. మిగిలిన విభాగాల్లోని ప్రశ్నలు మాత్రం డిగ్రీ స్థాయిలో అడుగుతారు. ముఖ్యంగా డెసిమల్ ఫ్రాక్షన్స్, టైమ్ అండ్ వర్క్, యావరేజెస్, ప్రాఫిట్ అండ్ లాస్, పర్సెంటేజెస్, రేషియో అండ్ ప్రపోర్షన్, సింపుల్ ఇంట్రస్ట్, టైమ్ అండ్ డిస్టెన్స్ నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి.
- **రీజనింగ్ అండ్ మిలటరీ అప్టిట్యూడ్:** వెర్బల్ స్కిల్స్, స్పేషియల్ ఎబిలిటీ(మెంటల్ ఎబిలిటీ) నుంచి ప్రశ్నలు వస్తాయి.
- ఏఎఫ్‌క్యాట్ పరీక్షకు సన్నద్ధమయ్యే వారు మూడు దశల ఎంపిక ప్రక్రియపై సమగ్ర అవగాహన పెంచుకోవాలి. సిలబస్, ప్రశ్నలు అడిగే విధానం, టెక్నికల్, నాన్‌టెక్నికల్ పరీక్షల్లో వ్యత్యాసం, ఇంటర్వ్యూ వంటి వాటి గురించి తెలుసుకోవాలి.
- స్వీయ ప్రణాళిక, పక్కా వ్యూహంతో ప్రిపరేషన్ సాగించాలి. ఇందుకోసం సబ్జెక్ట్ వారీగా నిర్దిష్ట టైమ్ టేబుల్‌ను సిద్ధం చేసుకోవాలి. చదవడం పూర్తిచేసిన అంశాలను రివిజన్ చేయాలి.
- జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ కోసం ఎక్కువగా దినపత్రికలను చదవడం మేలు చేస్తుంది. చదువుతున్నప్పుడే ముఖ్యమైన అంశాలతో నోట్స్ రాసుకోవాలి.
- వీలైనన్నీ ఎక్కువ మాక్ టెస్టులను, ప్రాక్టీస్ టెస్టులను రాయడం మంచిది. దీనివల్ల నిర్దేశిత సమయంలో పరీక్షను పూర్తిచేయడం అలవాట వుతుంది. అంతేకాకుండా పరీక్షల్లో చేస్తున్న పొరపాట్లను గుర్తించి.. అధిగమించేందుకు అవకాశం ఉంటుంది.


క్లుప్తంగా...

జేఎన్‌టీయూలో అతిపెద్ద డేటా సెంటర్

- రూ.5 కోట్ల వ్యయంతో ఏర్పాటుకు ముందుకొచ్చిన అదానీ కోనెక్స్ సంస్థ

బాలానగర్ (హైదరాబాద్): తెలంగాణలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ)లో అదానీ కోనెక్స్ సంస్థ అతి పెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. సుమారు రూ.5 కోట్ల వ్యయంతో డేటా సెంటర్ ఏర్పాటుకు బుధవారం జేఎన్‌టీయూ అధికారులతో అదానీ సంస్థ ప్రతినిధులు ఒప్పందం కుదుర్చుకున్నారు. జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ డా.మంజూర్ హుస్సేన్, రెక్టార్ డా. గోవర్ధన్ సమక్షంలో అదానీ డేటా సెంటర్ మేనేజర్ రాజేశ్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ... మొదటిగా మద్రాస్‌లోని ఐఐటీలో ఇటువంటి డేటా సెంటర్ ఏర్పాటు చేశామని, రెండవదిగా జేఎన్‌టీయూలోనే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డేటా సెంటర్ వల్ల విద్యార్థుల డేటా, వారి ప్రాజెక్టు వర్క్స్, పరిశోధనలను భద్రపర్చడంతో పాటు పెద్ద కంపెనీలకు చెందిన వివరాలను భద్రపరిచే అవకాశం ఉందన్నారు. డేటా సెంటర్ ఏర్పాటుకు అదానీ కోనెక్స్ సంస్థకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని యూనివర్సిటీ అధికారులు ఈ సందర్భంగా హామీనిచ్చారు.

నిలోఫర్‌లో తొమ్మిది నెలల చిన్నారికి కోవిడ్



నాంపల్లి (హైదరాబాద్): నిలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తొమ్మిది నెలల చిన్నారికి కోవిడ్ సోకింది. ఆస్పత్రిలో జరిపిన ఆర్టీపీసీఆర్ పరీక్షల్లో చిన్నారికి మంగళవారం పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉండటంతో చిన్నారిని డిశ్చార్జ్ చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి బుధవారం మీడియాకు వెల్లడించారు. చౌటుప్పల్ ప్రాంతానికి చెందిన చిన్నారి జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరినట్లు వివరించారు. కోవిడ్ బాధితుల కోసం నిలోఫర్‌లో ఐసోలేషన్‌తో కూడిన ప్రత్యేక వార్డును అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.

ఈపీఎస్ఐ వైస్ ప్రెసిడెంట్‌గా శేఖర్ విశ్వనాథన్



సాక్షి, హైదరాబాద్: ఎడ్యుకేషన్ ప్రమోషన్ సొసైటీ ఫర్ ఇండియా (ఈపీఎస్ఐ) వైస్ ప్రెసిడెంట్‌గా శేఖర్ విశ్వనాథన్ ఎన్నికయ్యారు. బెంగళూరులో ఈపీఎస్ఐ 11వ జనరల్ బాడీ మీటింగ్ సందర్భంగా ఆయన్ను ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా రామయ్య యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎం.ఆర్.జయరాం ఎన్నికయ్యారు. ఈపీఎస్ఐలో శేఖర్ విశ్వనాథన్ అందించిన సేవలకు గాను ఆయనకు 2012లో 'యంగ్ ఎడ్జ్ నేషనల్' అవార్డు లభించింది. జాతీయ స్థాయిలో ఎఫ్ఐసీసీఐ ఉన్నత విద్యా కమిటీ కోచైర్మన్‌గా కూడా శేఖర్ విశ్వనాథన్ విధులు నిర్వర్తించారు. బెంగళూరు వేదికగా జరిగిన ఈ సమావేశంలో చాన్స్‌లర్స్, వైస్ చాన్స్‌లర్స్, అధ్యక్షులు, జాతీయ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఉన్నత విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లు 350 మందికి పైగా పాల్గొన్నారు. 2005లో స్థాపించిన ఈపీఎస్ఐ అనేది ఒక లాభాపేక్ష లేని ఒక విద్యాసంస్థ.

వ్యర్థాల ప్లాంట్.. వినోదాల స్పాట్!

నగరాల్లో ఇంటింటి నుంచి చెత్తను సేకరించి ఓ ప్రదేశంలో కాల్చేయడమో లేదా రీసైక్లింగ్ చేయడమో జరుగుతూ ఉంటుంది. తీవ్ర దుర్గంధభరితమైన, అత్యంత కాలుష్యమయమైన ఆ ప్రాంతానికి పొరపాటున కూడా వెళ్లే సాహసం చేయలేం కదా? కానీ అలాంటి ప్రదేశానికి వెళ్లి సేద తీరడమే కాదు.. ఆడొచ్చు.. పాడొచ్చు.. ఇంకా కావాల్సింది నుష్టుగా తినొచ్చు. అవాక్కవుతున్నారా? నిజంగా ఇది నిజం. మరి ఆ అందమైన చెత్త వినోద కేంద్రం ఎక్కడుంది.

దాని విశేషాలేంటో చూద్దామా?



డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగన్.. రాజరిక వారసత్వం, ఆధునిక వాస్తుశిల్పాన్ని మిళితం చేసిన పర్యావరణ అనుకూలమైన అందమైన నగరం. 2017లో కోపెన్‌హాగన్‌ను ప్రపంచంలోని గ్రీన్‌సిటీగా ప్రకటించారు. ఇది ప్రధానంగా పునరుత్పాదక శక్తిని పెంపొందించడం, క్లీనర్ మొబిలిటీపై దృష్టి పెట్టింది. దీంతో నగరంలోని వ్యర్థాలను మొత్తం విద్యుత్‌గా మార్చే ఒక పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని ఇక్కడ చేపట్టారు. కేవలం ప్లాంటు ఒకటే ఏం బాగుంటుందని అనుకున్నారు డెన్మార్క్ అధికారులు. అంతే వ్యర్థాల శుద్ధి కేంద్రానికి వినోదపు టచ్ ఇవ్వాలని నిర్ణయించారు. ఆ మేరకు అదిరిపోయే డిజైన్‌తో ఈ ప్లాంట్ నిర్మించారు. కోపెన్‌హాగన్‌లోని ఎత్తైన భవనాల్లో ఒకటైన ఈ ఆర్కిటెక్ట్ అద్భుతాన్ని అమేజర్ బక్కే లేదా కోపెన్‌హిల్‌గా పిలుస్తారు. కార్పొరేట్ ఆఫీసులను తలదన్నేలా ఉన్న ఈ భవనాన్ని చూస్తే ఇది వ్యర్థ శుద్ధి కేంద్రమా అనే సందేహం కలగక మానదు. 100 మీటర్ల ఎత్తైన ఈ భవనంపైన అనేక కార్యకలాపాలతో కూడిన డైనమిక్ కమ్యూనిటీని ఏర్పాటు చేశారు. ఇందులో స్కైయింగ్, హైకింగ్, క్లైంబింగ్ వంటి వినోద సదుపాయాలు ఉన్నాయి. దీంతో ఇది వ్యర్థాలను ప్రాసెస్ చేసే ప్లాంట్‌గానే కాకుండా.. వినోదాలు పంచే విహారాల స్పాట్‌గా కూడా ప్రత్యేకతను సొంతం చేసుకుంది.

కార్బన్ న్యూట్రల్ సిటీగా..

2025 నాటికి ప్రపంచంలోనే మొట్టమొదటి కార్బన్ న్యూట్రల్ సిటీగా కోపెన్‌హాగన్ అవతరించాలనే లక్ష్యంతోనే ఈ ప్లాంట్ నిర్మాణం చేపట్టారు. వ్యర్థాలను భూగర్భంలో ఉండే ఓ బాయిలర్‌లో ప్రాసెస్ చేయడం ద్వారా ప్లాంట్ పనిచేస్తుంది. రోజుకు 300 ట్రక్కుల వ్యర్థాలను వెయ్యి డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద మండిస్తారు. ఈ ప్రక్రియ జరుగుతున్నప్పుడు వాతావరణంలోకి 250 కిలోగ్రాముల కార్బన్‌డైఆక్సైడ్ నీటి ఆవిరి రూపంలో 124 మీటర్ల చిమ్నీ ద్వారా బయటకు వస్తుంది. ఏటా 4,40,000 టన్నుల వ్యర్థాలను మండించడం ద్వారా 1,50,000 గృహాల విద్యుత్ అవసరాలను ఈ ప్లాంట్ తీరుస్తోంది.

పర్వతారోహకులకు పండుగే..

పర్యాటకులు ఈ ప్లాంట్ పై స్కైయింగ్ చేయొచ్చు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 85 మీటర్ల క్లైంబింగ్ వాల్‌ను ఈ ప్లాంట్‌లో ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడకు వచ్చే పర్వతారోహకులు బాగా ఎంజాయ్ చేస్తారు. చిన్నపిల్లలు కింది భాగంలో గైడింగ్ ప్రాక్టీస్ చేసే సదుపాయం కూడా ఉంది. ఇక రిసార్ట్స్ తరహాలో ఇక్కడ కెఫే, బార్ కూడా ఉన్నాయండోయ్.. రూఫ్‌టాప్ కెఫేలో వేడి వేడి కాఫీ, చల్లని శీతలపానీయాలతో సేద తీరొచ్చు. సముద్రాన్ని చూస్తూ మీకు నచ్చిన ఫుడ్ కూడా ఎంజాయ్ చేయొచ్చు. ఎప్పుడైనా డెన్మార్క్ వెళితే ఈ ప్లాంట్‌ను ఓ లుక్కేసి రండి.



- సాక్షి, సెంట్రల్‌డెస్క్

దశాబ్ద కాలంలో భారత్ పురోభివృద్ధి

- ప్రపంచ నాయకత్వ స్థాయికి ఎదిగిన దేశం
- జస్టిస్ కొండా మాధవరెడ్డి శత జయంతి ఉత్సవంలో ఉప రాష్ట్రపతి
- ప్రత్యేక పోస్టల్ కవర్ విడుదల కార్యక్రమంలో పాల్గొన్న జగదీప్ ధన్‌ఖడ్



ప్రత్యేక తపాలా కవర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్, గవర్నర్ తమిళిసై, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్ పీవీఎస్ రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: అవిరళ కృషి, అత్యాధునిక సాంకేతికతతో భారత్ కీర్తి విశ్వవ్యాప్తమవుతోందని భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం అన్ని విధాలా పురోగమిస్తోందని అన్నారు. దశాబ్ద కాలంలోనే భారత్ ప్రపంచ నాయకత్వ స్థాయికి ఎదిగిందని పేర్కొన్నారు. దివంగత మాజీ న్యాయమూర్తి జస్టిస్ కొండా మాధవరెడ్డి శత జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకుని తపాలా శాఖ ప్రత్యేక పోస్టల్ కవర్‌ను బుధవారం హైదరాబాద్‌లో విడుదల చేసింది. కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విలువలతో జన్మించిన రైతుబిడ్డ కొండా మాధవరెడ్డి అని కొనియాడారు. ఆయన ఆశయాలు నేటి తరానికి ఆదర్శమన్నారు. భారత్ అమృత్ కాల్ జరుపుకుంటున్న వేళ ఆయనకు సముచిత స్థానం ఇవ్వడం అభినందనీయమన్నారు.

భారత్ వైపు ప్రపంచం చూపు

యావత్ ప్రపంచం భారత్ వైపు చూస్తోందని ధన్‌ఖడ్ పేర్కొన్నారు. జీ-20 తర్వాత మనం ప్రపంచ నాయకత్వ స్థాయికి ఎదిగామని అన్నారు. ఈ సదస్సు ద్వారా భారత్ శక్తియుక్తులు ప్రపంచం ముందు ఆవిష్కృతమయ్యాయని చెప్పారు. సాంకేతిక విప్లవం సవాళ్ళతో పాటు కొత్త అవకాశాలను కల్పిస్తోందని, ఈ రంగంలో దూసుకెళ్ళేందుకు భారత్ చేసే ప్రయత్నాలన్నీ ప్రపంచ దేశాలతో పోటీపడేలా చేస్తున్నాయని వివరించారు. ఇ-కోర్టుల ఏర్పాటు, పారదర్శక న్యాయ విధానం, డిజిటలైజేషన్, మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారం, పెండింగ్ కేసులు తగ్గించడంపై శ్రద్ధ.. న్యాయ వ్యవస్థలో సంస్కరణలుగా ఆయన పేర్కొన్నారు. సొంత భాషలోనే తీర్పులివ్వడం గొప్ప పరిణామంగా అభివర్ణించారు. కొద్ది రోజుల క్రితమే చట్టసభల ఆమోదం పొందిన క్రిమినల్ కోడ్ బిల్లులను ఈ సందర్భంగా ప్రస్తావించారు.

ఆయన తీర్పులు నేటికీ ఆదర్శం: తమిళిసై

న్యాయమూర్తిగా కొండా మాధవరెడ్డి ఇచ్చిన తీర్పులు నేటి తరానికి ఆదర్శమని, ఆయన ఇచ్చిన తీర్పులు ఇప్పటికీ న్యాయవ్యవస్థకు మార్గదర్శకంగానే ఉన్నాయని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కొనియాడారు. యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్ పీవీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

పట్టాలపై పొగమంచు

- కనిపించని సిగ్నల్స్..
- రైళ్ల రాకపోకలకు అంతరాయం



పెద్దపల్లి జిల్లా రామగుండంలో రైల్వేపట్టాలను కమ్మేసిన పొగమంచు

రామగుండం/ఓదెల(పెద్దపల్లి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని కాజీపేట-బల్లార్షా సెక్షన్ల మధ్య బుధవారం రైలు పట్టాలపై పొగమంచు కమ్ముకోవడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. తెల్లవారుజామున పొగమంచు కమ్ముకోవడంతో పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్ల రాకపోకలకు విఘాతం కలిగింది. ప్రధానంగా సికింద్రాబాద్-బల్లార్షా-న్యూఢిల్లీ మధ్య ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైళ్ల వేగం తగ్గించి నడిపించారు. సిగ్నల్స్‌ను పొగమంచు కమ్మేయడంతో లోకో పైలట్లు అప్రమత్తమయ్యారు. వేగం బాగా తగ్గించి నడపడంతో రైళ్లు నిర్దేశిత సమయం కన్నా ఆలస్యంగా నడిచాయి. మరోవైపు.. రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపైకి వచ్చేవరకూ రైళ్లు కనిపించక ప్రయాణికులు సైతం తికమకపడ్డారు. కాజీపేట- బల్లార్షా సెక్షన్ల మధ్య పెద్దపల్లి, రామగుండం, జమ్మికుంట, ఓదెల, పొత్కపల్లి, కొలనూర్, బిజిగిరిషరీఫ్, హసన్‌పర్తి మధ్య ఈ పరిస్థితి మరింత తీవ్రంగా కనిపించింది. ఉదయం 11 గంటల తర్వాత సూర్యుడు రావడంతో రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థ, పట్టాలు యథాతథస్థితికి చేరుకున్నాయి. దీంతో రైళ్ల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

డ్రోన్ సాయంతో మందుల తరలింపు?

- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో



మందుల తరలింపునకు తయారు చేసిన విమానం

బీబీనగర్: గ్రామీణ రోగుల నుంచి సేకరించిన శాంపిల్స్‌ను బీబీనగర్ ఎయిమ్స్ వైద్యశాలకు తరలించి, వాటి ఆధారంగా తిరిగి రోగులకు అవసరమయ్యే మందులను డ్రోన్ విమానంలో తరలించేలా అధికారులు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి భువనగిరిలోని ఓ మార్కెట్ ఆవరణలో నుంచి చిన్నపాటి డ్రోన్‌లో మందులను అమర్చి కంప్యూటర్ ద్వారా నియంత్రిస్తూ ఎయిమ్స్‌కు పంపినట్లు సోషల్ మీడియాలో బుధవారం ఓ వీడియో వైరల్ అయింది. దీనిపై ఎయిమ్స్ అధికారులు, డ్రోన్ విమానాన్ని తరలించిన ప్రాజెక్టు నిర్వాహకులను వివరాలను అడిగినప్పటికీ వెల్లడించకపోవడం గమనార్హం. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఎయిమ్స్ ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా వైద్య శిబికాలె నిర్వహిస్తున్నారు. రోగుల నుంచి వివిధ పరీక్షల నమూనాలను సేకరించి వారికి సిబ్బంది నేరుగా మందులను పంపిణీ చేస్తారు. కానీ, ఇప్పుడు డ్రోన్ విమానం ద్వారా ఎయిమ్స్‌కు మందులు, శాంపిల్స్ తరలించేలా ట్రయల్‌రన్ నిర్వహిస్తున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

సాధారణ స్థితికి కనిష్ట ఉష్ణోగ్రతలు

- 3 రోజుల పాటు ఇదే తరహాలో వాతావరణం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలో నమోదయ్యాయి. గత వారమంతా సాధారణం కంటే 3 డిగ్రీల మేర తక్కువగా నమోదు కాగా.. ప్రస్తుతం కనిష్ట ఉష్ణోగ్రతలు కాస్త పెరిగి సాధారణ స్థితికి చేరుకున్నాయి. వాతావరణంలో నెలకొన్న మార్పులతో ఈమేరకు ఉష్ణోగ్రతల్లో మార్పు ఏర్పడినట్లు అధికారులు చెబుతున్నారు. బుధవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. మహబూబ్‌నగర్‌లో 31.8 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత, మెదక్‌లో 13.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే రాష్ట్రంలో సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో అత్యల్పంగా 9.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రానికి తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి తక్కువ ఎత్తులో బలంగా గాలులు వీస్తున్నాయి. రానున్న మూడు రోజులు రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంగానే నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

బుధవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్)

కేంద్రం	కనిష్ట ఉష్ణోగ్రత
ఆదిలాబాద్	11.7
మెదక్	13.3
రామగుండం	15.4
నల్లగొండ	16.0
దుండిగల్	16.3
హకీంపేట్	16.4
నిజామాబాద్	16.8
హనుమకొండ	17.5
హైదరాబాద్	17.5
మహబూబ్‌నగర్	18.6
భద్రాచలం	19.0
ఖమ్మం	19.2

గుంపులో ఉంటే మాస్కులు ధరించండి

- వైద్య, ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ
- కోవిడ్ కొత్త వేరియంట్ అంత ప్రమాదకరం కాదు
- కోవిడ్ నియంత్రణపై అధికారులతో సమీక్ష



సాక్షి, హైదరాబాద్: కోవిడ్ రాకుండా ఉండేందుకు జనసందోహంలో ఉన్నప్పుడు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రజలకు పిలుపునిచ్చారు. భౌతిక దూరం పాటించాలని ఆయన కోరారు. కోవిడ్ సంబంధిత లక్షణాలుంటే ఆస్పత్రులకు వెళ్లి డాక్టర్ల సలహాలు తీసుకోవాలని సూచించారు. బుధవారం మంత్రి సచివాలయంలో కోవిడ్ నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కరోనా కొత్త వేరియంట్ జేఎన్.1 అంత ప్రమాదకరం కాదన్నారు. సాధారణ జ్వరం, ముక్కు కారడం, గొంతు నొప్పి, ఆయాసంతోపాటు శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఉంటే ఆసుపత్రికి వెళ్లి కోవిడ్ టెస్టులు చేసుకోవాలని కోరారు. దీర్ఘకాలిక రోగాలు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వ్యక్తులకు కోవిడ్ సోకే అవకాశం ఉందన్నారు. కోవిడ్ నియంత్రణపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన చెప్పారు.

కొత్త వేరియంట్ వల్ల మరణాల శాతం తక్కువే..

కొత్త వేరియంట్ కోవిడ్ వల్ల మరణాల శాతం తక్కువగా ఉందని మంత్రి రాజనర్సింహ తెలిపారు. దీర్ఘకాలిక రోగాలు ఉన్న వారికి మాత్రమే జబ్బు తీవ్రత అధికంగా ఉందన్నారు. అయితే భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. కరోనాపై వస్తున్న వదంతులను నమ్మవద్దని, అలాగే వదంతులను ప్రచారం చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. కోవిడ్ పరీక్షలకు అవసరమైన కిట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆక్సిజన్ ప్లాంట్లు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని, బెడ్ల కొరత లేకుండా చర్యలు చేపట్టామని వివరించారు. తాజాగా ఎలాంటి మరణాలు నమోదు కాలేదని స్పష్టం చేశారు. ఉస్మానియా ఆస్పత్రిలో జరిగిన రెండు ఘటనల్లో కూడా.. దీర్ఘకాలిక రోగాలైన గుండె, ఊపిరితిత్తుల వ్యాధితో రోగులు బాధపడుతుండడం వల్ల ఈ మరణాలు సంభవించాయన్నారు. ఈ సమీక్షలో డీఎంఈ డాక్టర్ త్రివేణి, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.